www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 1-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 213 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.9:12 తదుపరి ఏకాదశి, నక్షత్రం: శతభిషం రా.6:20 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.12:23-1:54, దుర్ముహూర్తం: ఉ.6:17-7:48, అమృతఘడియలు: ఉ.11:17-12:51, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:17, సూర్యాస్తమయం: 5:40

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రభుత్వ సలహాదారుగా పి.సుదర్శన్‌రెడ్డి

పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రావు

ఇద్దరికీ క్యాబినెట్ హోదా కల్పిస్తూ నియామకం

క్యాబినెట్ ప్రత్యేక ఆహ్వానితుడిగానూ సుదర్శన్‌రెడ్డికి అవకాశం.. మంత్రి స్థాయిలో సౌకర్యాలు 3

ఉమ్మడి నిజామాబాద్‌కు ఇక ప్రాతినిధ్యం లేనట్లే?

క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న మరో రెండు బెర్తులు



సుదర్శన్‌రెడ్డి



ప్రేమ్‌సాగర్‌రావు

అభివృద్ధిని గెలిపించాలి

కంటోన్మెంట్‌లో 4 వేల కోట్లతో పనులు చేపట్టాం

జూబ్లీహిల్స్‌లో గెలిపిస్తే అదే తరహాలో అభివృద్ధి చేస్తాం

పీజేఆర్ మరణిస్తే ఆ కుటుంబంపై పోటీ పెట్టారు

దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్సే

వారి మోసంతో ఇల్లిల్లు తిరుగుతున్న సొంత చెల్లెలు

కార్పెట్ బాంబింగ్ చేయడానికి బీజేపీ జాగీరా?

అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టే బాధ్యత నాది

అజార్ ఓడినా.. మాట ప్రకారం మంత్రిని చేశా

జూబ్లీహిల్స్‌లో రోడ్డు షోలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ యూసుఫ్‌గూడ/ బంజారాహిల్స్/ పంజాగుట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చూడాల్సింది సెంటిమెంట్‌ను కాదని, అభివృద్ధిని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మాగంటి గోపీనాథ్ కుటుంబంపై తనకు సానుభూతి ఉందని, అయితే మూడుసార్లు గెలిస్తే జరగని అభివృద్ధి.. నాలుగోసారి గెలిస్తే జరుగుతుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి రోడ్డు షో నిర్వహించారు. వెంగళ్‌రావునగర్, సోమాజిగూడ జవహర్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ వాళ్లు సెంటిమెంట్‌ను చూపించి గెలిపించాలంటున్నారని, కానీ.. 2007లో పీజేఆర్ మరణించినప్పుడు ఆయన కుటుంబంలోని వ్యక్తిని ఏకగ్రీవం చేద్దామంటే జానా్నై అంటూ అభ్యర్థిని నిలబెట్టలేదా? అని ప్రశ్నించారు. నాడు చంద్రబాబునాయుడు, బీజేపీ కూడా

మిగతా 11వ పేజీలో...



జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు సీఎం రేవంత్ అభివాదం

నవీన్‌యాదవ్ ఆకు రౌడీ!

అలాంటి వ్యక్తిని గెలిపిస్తే అందరినీ బెదిరిస్తారు

ప్రజలు అప్రమత్తంగా ఓటెయ్యాలి: కేటీఆర్ 11

8 వారాల సమయం ఇవ్వండి

నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయింది

మరో నలుగురి విచారణ చివరి దశకు చేరింది 14

మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేల ప్రక్రియ ప్రారంభమైంది

స్పీకర్ల కాన్ఫరెన్స్, విదేశీ పర్యటనలతో ఆలస్యమైంది

వరద సహాయ చర్యలు, పనుల్లో ఎమ్మెల్యేలూ బిజీ

ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసుల విచారణకు సుప్రీంను మరింత గడువు కోరిన స్పీకర్ కార్యాలయం



మంత్రిగా ప్రమాణం చేసిన అజారుద్దీన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, నేతలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే నా తక్షణ కర్తవ్యం

నా గురించి కిషన్‌రెడ్డికి అవగాహన లేదు

నాపై వచ్చినవి అన్నీ ఆరోపణలే..

ఒక్కటి కూడా రుజువు కాలేదు: అజారుద్దీన్

భారత క్రికెట్ జట్టుకు అజార్ అందించిన సేవలు మరిచారా కిషన్‌రెడ్డీ?

అజార్‌కు మంత్రి పదవి నిర్ణయం 3 నెలల కిందటే తీసుకున్నాం: పీసీసీ చీఫ్ మహేశ్

హైదరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత అజారుద్దీన్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్లో అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అల్లా సాక్షిగా ప్రమాణం చేసిన ఆయన జై తెలంగాణ, జైహింద్ అంటూ నినదించారు. ప్రమాణ స్వీకారం అనంతరం వేదికపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు, ఇతర నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు

మిగతా 14వ పేజీలో...

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణే!

డిసెంబరు లేదా జనవరిలో ముహూర్తం

పలువురి శాఖల్లోనూ భారీ మార్పులు 10

కొత్త మంత్రులకు మాత్రం మినహాయింపు

ఐదుగురి తీరుపై అధిష్ఠానం పెదవి విరుపు

తారవ్వ ధాన్యం కొనుగోలు

వరదలో నష్టపోయిన హుస్నాబాద్ మహిళారైతు ఖాతాలో డబ్బులు జమ

బండి సంజయ్ రూ.50 వేల సాయం

13

వరంగల్‌లోని సమ్మయ్యనగర్‌లో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి



నాలాల కబ్జాలను ఉపేక్షించొద్దు

చెరువుల ఆక్రమణలనూ తొలగించాల్సిందే.. ఎంతటి వారినైనా వదిలిపెట్టొద్దు

పది మంది కోసం పది వేల మందికి ఇబ్బందా?.. అధికారులు చర్యలు తీసుకోవాలి

వరద బాధితులకు అండగా ఉంటాం.. తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం.. ఇళ్లు నీట మునిగితే రూ.15 వేలు..

కూలిపోతే ఇందిరమ్మ ఇళ్లు.. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు 13

వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్.. వరద నష్టంపై మంత్రులతో కలిసి ఏరియల్ సర్వే

నాగారం భూముల వివాదం..

ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఊరట

నిషేధిత జాబితా నుంచి సర్వే నెంబర్లు 194, 195 తొలగింపు

అవి పట్టా భూములేనని కలెక్టర్ తెలిపారు.. పిటిషనర్ కూడా భూదాన్ భూములు కాదన్నారు

విచారణ సందర్భంగా హైకోర్టు డివిజన్ బెంచ్ వ్యాఖ్యలు.. సింగిల్ జడ్జి ఆదేశాలు కొట్టివేత

సర్వే నెంబర్ 181, 182లపై ఆదేశాలు యథాతథం



హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాగారం భూముల విషయంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఊరట లభించింది. ఐఏఎస్, ఐపీఎస్‌ల భూములు ఉన్న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నెంబర్లు 194, 195లను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పేర్కొంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సర్వే నెంబర్లు 194, 195లోని భూములు పట్టాభూములేనని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారని, ఈ వివాదంలో తొలుత పిటిషన్ దాఖలు చేసిన బిర్ల మల్లేశ్ కూడా అవి భూదాన్ భూములు కాదన్నారని, ఈడీ కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదని డివిజన్ బెంచ్

మిగతా 14వ పేజీలో...

నిషేధిత భూముల జాబితా రెడీ

గ్రామాల వారీగా 22ఏ జాబితా సిద్ధం

రాష్ట్రంలోని 10,953 రెవెన్యూ గ్రామాలకు 10,510 గ్రామాల వివరాలు అందుబాటులో

మరో రెండు రోజుల్లో వంద శాతం జాబితా

సబ్ రిజిస్ట్రార్‌లకు పంపిన జిల్లా కలెక్టర్లు

కొన్ని జిల్లాల్లో జాప్యంపై రెవెన్యూ శాఖ కార్యదర్శి ఆగ్రహం 14

రిజిస్ట్రేషన్ శాఖ, సీసీఎల్ఏ ఇచ్చిన ఫార్మాట్లు వేర్వేరుగా ఉన్నందునే జాప్యమంటున్న కలెక్టర్లు



అనురాధ, మోహన్ (ఫైల్)

మేయర్ దంపతుల హత్య కేసులో ఐదుగురికి ఉరి

ఏపీలోని చిత్తూరు కోర్టు సంచలన తీర్పు

మేనల్లుడే ప్రధాన హంతకుడు 10

ఆర్థికంగా అత్తామామ సహకరించడం లేదని మరో నలుగురితో కలిసి హత్యలు

ఘటనాస్థలిలోనే అనురాధ మృత్యువాత

చికిత్స పొందుతూ కరాటే మోహన్ మృతి

పదేళ్లు కొనసాగిన విచారణ

ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 2 నుంచే.. 10

షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్ బోర్డు

మరో పదేళ్ల రక్షణ బంధం

భారత్-అమెరికా కీలక ఒప్పందం

మన రక్షణ భాగస్వామ్యంలో కొత్త యుగం 2

స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్‌కు ఈ ఒప్పందం కీలకం: రాజ్‌నాథ్

హెచ్-1బీ దుర్వినియోగం

ఎక్స్‌లో అమెరికా కార్మిక శాఖ యాడ్

భారతీయులే అధికంగా లబ్ధి పొందారంటూ అక్కసు 2



అమ్మో.. నకిలీ బొమ్మ!


ఆందోళన కలిగిస్తున్న ఏఐ ఆధారిత డీప్ ఫేక్ వీడియోలు, చిత్రాలు

మహిళలను, పిల్లలను లక్ష్యంగా చేసుకుంటున్న వికృత మనస్సులు

ఏఐతో ముప్పేట నిపుణులు

చెక్ పెట్టేందుకు సర్కారు చర్యలు

ఐటీ రూల్స్ 2021కు పలు సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదా



(సెంట్రల్ డెస్క్)

గుర్తుందా.. 2023లో హీరోయిన్ రష్మిక మందన్నా ఒక లిఫ్ట్‌లో ఎక్కుతున్న వీడియో ఒకటి వైరల్ అయ్యింది! చాలా మంది ఆ వీడియోలో కనిపిస్తున్నది నిజంగా రష్మికాయేనని నమ్మారు!! కానీ.. తీరా చూస్తే అది డీప్ ఫేక్ వీడియో అని, దాన్ని ఏఐతో తయారుచేశారని తేలింది!! మనదేశంలో ఒక సెలబ్రిటీ డీప్ ఫేక్ వీడియో అంతలా వైరల్ అవడం అదే తొలిసారి కాబట్టి చాలా మందికి గుర్తుండిపోయింది. ఆ తర్వాత కాలంలో ఎంతో మంది సెలబ్రిటీల

మిగతా 2వ పేజీలో... 10

భయపడొద్దు.. పోలీసులున్నారు.. డీప్ ఫేక్ బాధితులకు చిరంజీవి భరోసా

అక్రమాలపై ఫిర్యాదు ఇవ్వబోతే దాడి

గిరిజన సహకార సంస్థలో ఘటన

జీఎం సీతారాంనాయక్ సమక్షంలోనే..

అవినీతి రుజువు చేసే పత్రాల్ని లాక్కున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి ఆరోపణ

జీఎంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

మంత్రి అడ్లూరికి ఫిర్యాదు చేసిన బాధితుడు

హైదరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం వారి ఉత్పత్తులకు సరైన ధర కల్పించడానికి ఉద్దేశించిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఇప్పుడు అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థలో జరుగుతున్న అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన వ్యక్తిపై ఏకంగా సంస్థ జనరల్ మేనేజర్ (జీఎం) సీతారాం నాయక్ అనుచరులు దాడికి పాల్పడినట్లు తెలిసింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేశ్‌నాయక్.. జీసీసీలో జరుగుతున్న అవకతవకలపై ఫిర్యాదు చేయడంతో పాటు తనకు అవసరమైన సమాచారాన్ని కోరుతూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకోవడానికి హైదరాబాద్‌లోని

మిగతా 3వ పేజీలో...



సీపీఎం రాష్ట్రనేత సామినేని దారుణహత్య

కత్తితో పొడిచి చంపిన గుర్తుతెలియని వ్యక్తి

ఖమ్మం జిల్లా పాతర్లపాడు గ్రామంలోని రామారావు ఇంటి వద్దే ఘటన

రాజకీయ కారణాలా?.. ఆస్తి, కుటుంబ తగాదాలా?.. పోలీసుల విచారణ

హత్యను తీవ్రంగా ఖండించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 3

హంతకులను పట్టుకోవాలని ఆదేశం

కశ్మీరు విలీనం కాకుండా.. పటేల్‌కు నెహ్రూ మోకాలడ్డు!

- ఈ తప్పిదానికి దశాబ్దాలు బాధలు పడ్డాం: మోదీ
- పటేల్ 150వ జయంతి సందర్భంగా నివాళి



ఏక్‌తా నగర్ (గుజరాత్), అక్టోబరు 31: దేశ విభజన పాపం కాంగ్రెస్‌దేనని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. కశ్మీరును భారత్‌లో విలీనం చేయకుండా నాటి ఉపప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ను ప్రథమ ప్రధాని నెహ్రూ అడ్డుకున్నారని ఆక్షేపించారు. పటేల్ 150వ జయంతినాడు 'జాతీయ ఏకతాదినం' సందర్భంగా శుక్రవారం గుజరాత్‌లోని ఏక్‌తా విగ్రహం వద్ద మోదీ ఆయనకు నివాళులు అర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన తప్పిదానికి దశాబ్దాలపాటు దేశం మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. "దేశాన్ని మాత్రమే గాక వందేమాతరం గీతాన్ని సైతం ఆ పార్టీ చీల్చింది. మతప్రాతిపదికన అందులోని ఓ భాగాన్ని తొలగించింది. బ్రిటిషర్లు వందేమాత్రం నినాదాన్ని అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. కానీ ఆ పాటను తొక్కిపెట్టడంలో కాంగ్రెస్ విజయం సాధించింది' అన్నారు. జాతీయ ఏకతాదినం సందర్భంగా ప్రతి చొరబాటుదారునూ తరిమివేయాలని ప్రజలు ప్రతినబూనాలని పిలుపిచ్చారు. మావోయిజాన్ని కూకటివేళ్లతో పెకలించేదాకా తన ప్రభుత్వం విశ్రమించదన్నారు. సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి, పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి: ఖర్గే

న్యూఢిల్లీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించాలంటూ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించాలి. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఎందుకంటే వల్లభాయ్ పటేల్‌కు సముచిత గౌరవం ఇవ్వాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా భావిస్తే తప్పనిసరిగా ఇది జరగాల్సిందే. ముమ్మాటికీ దేశంలోని ఘర్షణలకు, శాంతి భద్రతల విఘాతానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లే కారణం. గతంలో పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించారు' అని ఖర్గే అన్నారు. శుక్రవారం ఢిల్లీలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు మల్లికార్జున ఖర్గే నివాళులర్పించారు. ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది.

సొంత యూట్యూబ్ చానళ్లు ప్రారంభించండి

- ప్రాజెక్టుల ప్రగతిపై నిత్యం వీడియోలు అప్‌లోడ్ చేయాలి
- ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్ల అభివృద్ధి సంస్థలకు గడ్కరీ ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 31: జాతీయ రహదారుల ప్రగతిని తెలిపేందుకు సొంతంగా యూట్యూబ్ చానళ్లను ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థలను కేంద్ర జాతీయ రహదారులు, రవాణాశాఖల మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. ఆ యూట్యూబ్ చానళ్లలో వివిధ దశల్లో ఆయా రహదారుల పురోగతిని తెలిపే వీడియోలను నిరంతరం అప్‌లోడ్ చేయాలని శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో చెప్పారు. ప్రజా పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపునకే ఈ విధానం తెస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారుల పొడవునా క్యూఆర్ కోడ్‌తో కూడిన హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్న గడ్కరీ.. ఆ కోడ్ స్కాన్ చేస్తే సంబంధిత రహదారి ప్రాజెక్టు వివరాలను ప్రయాణికులూ తెలుసుకోవచ్చునన్నారు. ఒకవేళ రోడ్డు బాగా లేదని సోషల్ మీడియాలో ప్రజలు ఫిర్యాదు చేస్తే.. తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, నిర్వహణలో భాగస్వాములంతా బాధ్యతలు పంచుకోవాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు.

కక్షిదారుల న్యాయవాదులకు దర్యాప్తు సంస్థలు సమన్లు జారీ చేయలేవు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: కక్షిదారులకు ఇచ్చిన వృత్తిపరమైన సలహాలపై ప్రశ్నించే నిమిత్తం దర్యాప్తు సంస్థలు న్యాయవాదులకు సమన్లు జారీ చేయలేవని సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. కక్షిదారుల వివరాలు కోరుతూ న్యాయవాదులకు సమన్లు ఇవ్వడమనేది నిందితుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లే అవుతుందని ఆక్షేపించింది. భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్‌ఏ)లోని సెక్షన్ 132లో పేర్కొన్న మేరకు.. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే దర్యాప్తు సంస్థలు న్యాయవాదులను పిలిపించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఆమోదంతోనే దర్యాప్తు అధికారులు క్రిమినల్ దర్యాప్తుల్లో న్యాయవాదులకు సమన్లు జారీ చేయవచ్చని పేర్కొంది. సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఈడీ సమన్లు జారీ చేయడంపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకొని విచారించింది.

పాక్, అఫ్గాన్ కాల్పుల విరమణ కొనసాగింపు

ఇస్తాంబుల్, అక్టోబరు 31: కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలని పాక్, అఫ్గాన్ నిర్ణయించాయి. రెండు దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో జరుగుతున్న శాంతి చర్చల్లో ఈ మేరకు నిర్ణయించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలుపై నవంబరు 6న మరో కీలక సమావేశం జరగనుందని టర్కీ విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. అక్టోబరు 11న అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులతో మొదలైన ఉద్రిక్తతలు రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీసేలా మారాయి. మరోవైపు, అఫ్గాన్‌లోని కునార్ నదిపై డ్యామ్ నిర్మాణానికి సహకారం అందిస్తామని భారత్ తెలిపింది. నీటి నిర్వహణ, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల్లో తమ సహకారం కొనసాగుతుందని స్పష్టం చేసింది. వాయువ్య పాకిస్థాన్‌లోకి ప్రవహించే ఈ నదిపై డ్యామ్ కట్టడాన్ని పాక్ వ్యతిరేకిస్తోంది. గతంలోనూ హెరాత్ ప్రావిన్స్‌లో సల్మా డ్యామ్ విషయంలో అఫ్గాన్‌కు సహకరించినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

మొఘలుల కాలం నాటి పెయింటింగ్‌కు రూ.119.49కోట్లు

- లండన్‌లో నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ధర



న్యూఢిల్లీ, అక్టోబరు 31: మొఘలుల కాలం నాటి పెయింటింగ్ ఒకటి వేలంలో రికార్డు సృష్టించింది. అక్బర్‌కు అత్యంత ఇష్టమైన చిత్రకారుడు బాసవాన్ గీసిన 'చిరుతపులుల కుటుంబం' చిత్రం రూ.119.49కోట్లకు అమ్ముడుపోయింది. అక్టోబర్ 28న లండన్‌లో ఈ వేలం నిర్వహించారు. వేలం నిర్వాహకులు ఊహించినదాని కన్నా ఈ చిత్రం 14రెట్లు ఎక్కువ ధర పలికింది. ఇది క్రీ.శ 1575-80 మధ్య కాలానికి చెందినదని నిర్వాహకులు తెలిపారు. పర్షియన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ సద్రుద్దీన్ ఖాన్, ఆయన భార్య క్యాథరిన్ వ్యక్తిగతంగా సేకరించిన పురాతన పెయింటింగ్స్ సహా 95 వస్తువులను అక్టోబరు 28న లండన్‌లో వేలం వేయగా వీటికి రూ.533.79కోట్లు వచ్చాయి. నాలుగు ఖండాల నుంచి 20దేశాలకు చెందిన వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. సద్రుద్దీన్ ఖాన్ 1933లో ఫ్రాన్స్‌లో జన్మించారు. 1960-80మధ్య కాలంలో మొఘలులు, తురుష్కులు ఇతర రాజవంశాలకు చెందిన పురాతన వస్తువులను సేకరించారు. ఇవన్నీ స్విట్జర్లాండ్‌లోని వారి ఇంట్లో ఉన్నాయి. కాగా, ఇండియాకు సంబంధించి ఎంఎఫ్ హుస్సేన్ గీసిన గ్రామ్ యాత్ర చిత్రాన్ని గత మార్చిలో న్యూయార్క్‌లో వేలం వేయగా రూ.122కోట్లకు అమ్ముడుపోయింది. దీని తర్వాత అత్యంత ఖరీదైన పెయింటింగ్‌గా బాసవాన్ గీసిన 'చిరుత కుటుంబం' చిత్రం రికార్డులకెక్కింది.

అమ్మో.. నకిలీ బొమ్మ!

(మొదటి పేజీ తరువాయి)

వీడియోలు అలా వైరల్ అయ్యాయి! కానీ.. ఇప్పుడా ముప్పు మరింత మునుముందుకు, మనందరి ముందుకు వచ్చేసింది! సెలబ్రిటీలవే కాదు.. సోషల్ మీడియాలో మామూలు అమ్మాయిలు పోస్ట్ చేసే ఫొటోలను తీసుకుని.. వాటిసాయంతో అశ్లీల డీప్ ఫేక్ వీడియోలు సృష్టిస్తున్న సంఘటనలు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి! "నీ ముగ్గురు అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర ఏఐ వీడియోలనూ సోషల్ మీడియాలో పెట్టకుండా ఉండాలంటే మేం అడిగిన డబ్బు చెల్లించు" అంటూ సైబర్ నేరగాళ్లు చేసిన హెచ్చరికలకు భయపడి.. హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనే ఇందుకు తాజా ఉదాహరణ! ఛత్తీస్‌గఢ్ రాజధాని నయారాయ్‌పూర్‌లోని ట్రిపుల్ ఐటీలో 'ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి.. ఏఐ సాయంతో తన క్లాస్‌మేట్లలో ఏకంగా 36 మంది అమ్మాయిల అశ్లీల చిత్రాలు, వీడియోలను రూపొందించి పోలీసులకు దొరికిపోయాడు. అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ డివైజ్‌లను తనిఖీ చేసిన పోలీసులు.. అలాంటి ఫొటోలు, వీడియోలు 1000కి పైగా ఉండడం చూసి నివ్వెరపోయారు! వ్యక్తిగత వీడియోల సంగతి పక్కనపెడితే.. రాజకీయ నాయకులకు సంబంధించినవి, సెలబ్రిటీల ఫేక్ వీడియోలు ఇటీవలికాలంలో ఏ స్థాయిలో వైరల్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఒక ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ప్రమోట్ చేస్తున్నట్టుగా రూపొందించిన ఫేక్ వీడియో ఒకటి ఇటీవల వైరల్ అయ్యింది. అవగాహన లేనివారు అవన్నీ నిజమేనని భావిస్తున్న పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయి. జనరేటివ్ ఏఐ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని ఈ దశలోనే ఈ స్థాయిలో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు వైరల్ అవుతున్నాయంటే.. కృత్రిమ మేధ అభివృద్ధి చెందేకొద్దీ పరిస్థితి మరెంత ప్రమాదకరంగా తయారవుతుందోనన్న ఆందోళన పెరుగుతోంది. ఎందుకంటే.. ఇప్పుడు రూపొందిస్తున్న ఏఐ వీడియోలను కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే అవి కృత్రిమ మేధ సాయంతో తయారుచేసినవనే విషయం ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. అసహజమైన నీడలు, కదలికలు.. అవి ఫేక్ వీడియోలనే విషయాన్ని ఇట్టే పట్టిచ్చేస్తాయి. కానీ, ఏఐ టెక్నాలజీ అభివృద్ధి చెందే కొద్దీ అలాంటి అసహజమైన కదలికలు, నీడలు లేకుండా వీడియోలు తయారుచేసే ప్రమాదం ఉంది. గూగుల్ సంస్థ తాను అభివృద్ధి చేస్తున్న 'వియో' అనే ఏఐ వీడియో మోడల్‌కు సంబంధించిన వివరాలను 2024 డిసెంబరులో ప్రపంచానికి పరిచయం చేసింది. దాని సాయంతో రూపొందించే చిత్రాలు, వీడియోలు వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంటున్నాయి. ఇదే వేగంతో జనరేటివ్ ఏఐ అభివృద్ధి చెందితే.. గరిష్ఠంగా ఏడాది-రెండేళ్లలోనే ఏది ఏఐ వీడియోనో, ఏది నిజమైనదో చెప్పడం నిపుణులకు తప్ప సాధారణ ప్రజలకు కష్టమవుతుంది!!



పిల్లలనూ వదలట్లేదు..

తమను నిరాకరించిన అమ్మాయిలపై పగతీర్చుకోవడానికి కొందరు ఈ టెక్నాలజీని వాడుతుంటే.. పిల్లలను శృంగారదృష్టితో చూసే వికృత మనస్కులు కూడా ఏఐ సాయంతో అలాంటి వీడియోలను రూపొందిస్తుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నిజానికి జనరేటివ్ ఏఐ టెక్నాలజీని వాడేవారు దాంతో అశ్లీల కంటెంట్‌ను సృష్టించకుండా ఉండడానికి.. ఏఐ సంస్థలు పలు రక్షణ చర్యలు తీసుకుంటున్నాయి. వాటిని క్లాసిఫయర్స్ అంటారు. అవి రెండు రకాలు.. ఒకటి ఇన్‌పుట్ క్లాసిఫయర్స్, రెండు అవుట్‌పుట్ క్లాసిఫయర్స్. ఇన్‌పుట్ క్లాసిఫయర్లు.. వీడియో కంటెంట్‌ను రూపొందించడానికి వినియోగదారులు ఇచ్చే ప్రాంప్ట్‌లను తనిఖీ చేస్తాయి. అనుచితమైన ప్రాంప్ట్‌లు (హింస, శృంగారానికి సంబంధించినవి) ఉంటే వాటిని బ్లాక్ చేస్తాయి. అలాంటి కంటెంట్ జనరేట్ చేయడం తప్పని చెబుతాయి. ఇక.. వినియోగదారులు ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా తయారైన చిత్రాలు/వీడియోలు సురక్షితంగా ఉన్నాయా లేవా అని తనిఖీ చేసే బాధ్యత అవుట్‌పుట్ క్లాసిఫయర్లది. జనరేటివ్ ఏఐని అభివృద్ధి చేస్తున్న ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఇన్ని రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసినా.. వాటిలో ఉండే చిన్నచిన్న లోపాలను ఆధారంగా చేసుకుని చాలామంది అశ్లీల కంటెంట్‌ను తయారుచేస్తున్నారు. 2024లో.. ప్రఖ్యాత అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్ చిత్రాలను ప్రముఖ జనరేటివ్ ఏఐ మోడళ్లతోనే అశ్లీలంగా మార్చడం ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలో.. జనరేటివ్ ఏఐని అభివృద్ధి చేస్తున్న కంపెనీలు దీనిపై దృష్టి సారించాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. ఆయా కంపెనీలు తమ ఏఐ మోడళ్లను అనుమతి పొందిన వ్యక్తులకు, వ్యాపారసంస్థలకు మాత్రమే షరతులతో అందుబాటులోకి తేవాలని, ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించేలా చూడాలని వారు చెబుతున్నారు.


కఠిన చట్టాల దిశగా..

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఈ సమస్యకు చెక్ పెట్టే సమర్థమైన, కఠిన చట్టాలు ఏవీ ప్రస్తుతం లేవు. ఈ నేపథ్యంలోనే పలు దేశాల ప్రభుత్వాలు ఆ దిశగా దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం కూడా.. "ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనలు (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్), 2021" చట్టానికి పలు సవరణలను ప్రతిపాదించింది. నకిలీ కంటెంట్‌ను సులువుగా గుర్తించేందుకు వీలుగా లేబులింగ్, మార్కింగ్‌ను తప్పనిసరి చేసింది. అంటే.. ఏఐ జనరేటెడ్ వీడియోలు, చిత్రాలపై ఆ విషయం తెలిసేలా మార్కింగ్ చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఉంటుంది. అందుకోసం ఆయా ప్లాట్‌ఫామ్‌లు.. సదరు కంటెంట్‌ను అప్‌లోడ్ చేసిన వినియోగదారుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. వీడియోలైతే.. తెరమీద 10 శాతం స్థలం ఆక్రమించేలా, ఆడియోలైతే మొదట్లో 10% సమయం.. అది సింథటిక్ కంటెంట్ అని తెలిసేలా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. ఏఐ కంటెంట్ సోర్స్ తెలిపేలా మెటా డేటాను ఎంబెడ్ చేయాలి (దీనివల్ల.. ఏవైనా అనుచిత వీడియోలు వైరల్ అయినప్పుడు దర్యాప్తు సంస్థలకు దాని మూలం త్వరగా తెలుసుకునే వీలుంటుంది). సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న ఏదైనా కంటెంట్ చట్టవిరుద్ధమనదైతే.. న్యాయస్థానాలు దాన్ని తొలగించాలంటూ ఆదేశించినా, ప్రభుత్వం ఆదేశించినా సత్వరమే (ఆదేశాలు అందిన 36 గంటల్లోపు) దాన్ని తొలగించాలి.

ఈ సమస్యలకు పరిష్కారమేదీ?

అనుచిత ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించడానికి ప్రభుత్వాలు చేసిన చట్టాలు సోషల్ మీడియాకు వర్తిస్తాయి కాబట్టి.. అవి అలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగిస్తాయి. అలా కాకుండా.. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్స్ ద్వారా వైరల్ చేస్తే అప్పుడేం చేయాలనే ప్రశ్నకు సమాధానం లేదు. ఇక.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిత్యం సెకనుకు కొన్ని వేల లక్షల వీడియోలు, చిత్రాలు అప్‌లోడ్ అవుతుంటాయి. వాటన్నింటినీ పరిశీలించి.. అందులో ఏఐ కంటెంట్ ఏదో, మామూలుదేదో గుర్తించే వ్యవస్థ.. దానికి లేబులింగ్, మార్కింగ్ ఉందా లేదా గుర్తించే వ్యవస్థ.. సామాజిక మాధ్యమాల వద్ద ప్రస్తుతానికి లేదు. వాటిని గుర్తించడం ఏఐ టూల్స్‌కు కూడా కష్టం. అంతేకాదు.. ఉద్దేశపూర్వకంగా సింథటిక్ కంటెంట్‌ను సృష్టించేవారు, డిక్లరేషన్ కూడా తప్పుగా సమర్పిస్తే? దాన్ని గుర్తించడానికి సామాజిక మాధ్యమాలు అత్యంత అధునాతనమైన ఆటోమేటెడ్ టూల్స్‌ను వినియోగించాల్సి వస్తుంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని. మరి ఈ సమస్యలను ప్రభుత్వం ఎలా అధిగమిస్తుందో చూడాలి.

లోకం తీరు



3వ తరగతి నుంచే 'ఏఐ' పాఠాలు!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: దేశ విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. మారుతున్న టెక్నాలజీ యుగంలో కృత్రిమ మేధ(ఏఐ) పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి నుంచే పాఠ్యాంశాల్లో 'ఏఐ'ను చేర్చనున్నట్లు కేంద్ర విద్యా శాఖ ప్రకటించింది. విద్యార్థులకు పునాది స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం వెనుక ముఖ్య ఉద్దేశం.. 'ఏఐ అనేది ఒకటి ఉంది' అని, ఆ ఆధునిక సాంకేతికను నేటి రోజువారీ జీవితంలో ఎలా ఉపయోగిస్తున్నారనే విషయాలను పిల్లలకు తెలియజేయడమని పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగానికి (డీవోఎస్‌ఈఎల్) చెందిన సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దీనిపై డీవోఎస్‌ఈఎల్.. సీబీఎస్‌ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) ప్రతినిధులు, ఇతర విద్యా రంగ నిపుణులతో చర్చలు జరిపింది. కృత్రిమ మేధ(ఏఐ), కంప్యూటేషనల్ థింకింగ్(సీటీ) కరిక్యులమ్‌ను అభివృద్ధి చేసేందుకు సీబీఎస్‌ఈ ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ కార్తీక్ రామన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది డిసెంబరు నాటికి వనరుల మెటీరియల్స్, హ్యాండ్‌బుక్‌లు, డిజిటల్ వనరుల అభివృద్ధి పూర్తవుతుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. మొదట అసలు ఏఐ అంటే ఏంటి? అనే దానిపై పిల్లలకు అవగాహన కల్పిస్తామని పాఠశాల విద్యా విభాగం అధికారి పేర్కొన్నారు. ఆ తర్వాత విద్యార్థులు పైతరగతులకు వెళ్లే కొద్దీ.. క్రమంగా సంబంధిత కాన్సెప్ట్‌లు నేర్చుకుంటారని, 11, 12 తరగతుల నాటికి ఎంపిక సబ్జెక్టులుగా చదువుకుంటారని వివరించారు.

పాక్ పీఎల్-15లకు దీటుగా మిటియోర్ క్షిపణులు!

- యూరోపియన్ మిస్సైళ్ల కొనుగోలు యోచనలో భారత్

న్యూఢిల్లీ, అక్టోబరు 31: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకునే దిశగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే తమ ప్రధాన యుద్ధ విమానమైన రఫేల్ కోసం భారీ సంఖ్యలో మిటియోర్ క్షిపణులను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా నుంచి కొనుగోలు చేసిన పీఎల్-15 క్షిపణులతో పాకిస్థాన్ మన యుద్ధ విమానాలపై దాడికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో పీఎల్-15లకు దీటుగా బదులిచ్చేందుకు, ఎప్పటి నుంచో కొనుగోలు చేయాలని అనుకుంటున్న మిటియోర్ మిస్సైల్స్‌ను రంగంలోకి దించాలని భారత్ నిర్ణయించింది. గగనతలంలోని టార్గెట్లపై ప్రయోగించే ఈ క్షిపణులు 200 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలవు. భారత వైమానిక దళం వద్ద ప్రస్తుతం ఉన్న యుద్ధ విమానాల్లో రఫేల్ ఒక్కటే ఈ మిటియోర్ క్షిపణులను ప్రయోగించగలదు. యూరోపియన్ సంస్థ ఎండీఎంఏ తయారు చేసిన మిటియోర్ క్షిపణులను కొనుగోలు చేయడానికి రూ.1500 కోట్ల విలువైన ప్రతిపాదనలు రక్షణ మంత్రిత్వ శాఖ వద్ద చర్చల దశలో ఉన్నాయని, త్వరలో జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. మరోవైపు, భారత్‌లో రఫేల్ యుద్ధ విమానాల తయారీపై ఫ్రాన్స్ ఆసక్తి చూపిస్తోందని ఆ దేశ రాయబారి థియరీ మాథౌ వెల్లడించారు. ఓ చర్చాకార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రఫేల్‌పై మరో కొత్త ఒప్పందానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మా పరిశ్రమ పూర్తిగా భారత్‌లో తయారీ చేపట్టే ఆలోచనలో ఉందని నేను స్పష్టం చేస్తున్నాను. డసాల్ట్ ఏవియేషన్ సంస్థ దీనిపై త్వరలోనే భారత్‌తో చర్చిస్తుందని అనుకుంటున్నా' అని ఆయన పేర్కొన్నారు.

మరో పదేళ్ల రక్షణ బంధం

భారత్-అమెరికా కీలక ఒప్పందం.. ఇరుదేశాల రక్షణమంత్రుల సంతకాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: భారత్-అమెరికా రక్షణ బంధంలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. కీలకమైన రక్షణరంగంలో వచ్చే పదేళ్లపాటు ఇరుదేశాల సహకారానికి సంబంధించిన ఒప్పందం కుదిరింది. దీనిపై ఇరుదేశాల రక్షణమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, పీట్ హెగ్‌సెత్ శుక్రవారం కౌలాలంపూర్‌లో సంతకాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన భారీ సుంకాలతో ఇరుదేశాల సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్న తరుణంలో ఈ ఒప్పందం.. అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు కీలక అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు. 2015లో కుదిరిన భారత్-అమెరికా రక్షణ ఒప్పందం పదేళ్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో.. దాని పునరుద్ధరణ కోసం రాజ్‌నాథ్, హెగ్‌సెత్ సమావేశమయ్యారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఏషియాన్ ప్లస్ (ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య, భాగస్వామ్య దేశాల) రక్షణ మంత్రుల సమావేశం దీనికి వేదికగా నిలిచింది. ఒప్పందంపై రాజ్‌నాథ్‌సింగ్ స్పందిస్తూ.. 'భారత్-అమెరికా రక్షణ సహకారానికి ప్రస్తుత ఒప్పందం విధానపరమైన సమగ్ర దిశానిర్దేశం చేయనుంది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిబంధనలతో కూడిన ఇండో పసిఫిక్‌కు భారత్-అమెరికా సహకారం ఎంతో ముఖ్యమైనది' అని పేర్కొన్నారు. పీట్ హెగ్‌సెత్ స్పందిస్తూ.. తాజా ఒప్పందంతో ఇరుదేశాల రక్షణ బంధం మునుపెన్నడూ లేనంత బలోపేతమైందని, ప్రాంతీయ స్థిరత్వానికి, సవాళ్లను ఎదుర్కోవటానికి ఇది ఒక మైలురాయి వంటిదని కొనియాడారు. భారత రక్షణరంగ సంస్థ హెచ్‌ఏఎల్, అమెరికా కంపెనీ జీఈ ఏరోస్పేస్ సంయుక్తంగా ఎఫ్-414 యుద్ధవిమానాల ఇంజన్లను భారత్‌లో తయారుచేయటంపైనా చర్చలు జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, మలేసియా రక్షణమంత్రి మహమ్మద్ ఖాలెద్ నోర్దిన్‌తోనూ రాజ్‌నాథ్‌సింగ్ విడిగా సమావేశమై చర్చలు జరిపారు.



ఒప్పందంపై సంతకం చేస్తున్న హెగ్‌సెత్, రాజ్‌నాథ్

పదేళ్ల ప్రస్థానంలో బంధం పటిష్ఠం

భారత్‌ను ప్రధాన రక్షణరంగ భాగస్వామిగా అమెరికా గుర్తించటంతో పదేళ్ల కిందట ఇరుదేశాల మధ్య రక్షణ ఒప్పందం కుదిరింది. దీంట్లో భాగంగా అమెరికా నుంచి భారత్‌కు సైనికపరమైన సామగ్రి, టెక్నాలజీ బదిలీ సులువైంది. గత కొన్నేళ్లలో ఇరుదేశాలు మరిన్ని సైనిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. మరమ్మతులకు, సరఫరాలకు ఉభయ దేశాల సైనిక స్థావరాలను పరస్పరం ఉపయోగించుకోవటానికి వీలు కల్పించే 'లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్' 2016లో కుదిరింది. ఇరుదేశాల సైన్యాల మధ్య సమన్వయంతోపాటు భారత్‌కు ఉన్నతస్థాయి మిలిటరీ టెక్నాలజీని అమెరికా కంపెనీలు విక్రయించటానికి వీలు కల్పించే 'కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్' 2018లో కుదరింది. భౌగోళిక సమాచారం తాలూకు పటాలను ఇచ్చిపుచ్చుకోవటం, రవాణాకు పరస్పరం సహకరించుకోవటం లక్ష్యంగా 2020లో 'బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్' కుదిరింది.

యువ అమెరికన్ల కలలు భగ్నం!

- హెచ్-1బీ వీసాల దుర్వినియోగంతో భారతీయులకే ఎక్కువ లబ్ధి
- 'ఎక్స్'లో అమెరికా కార్మిక శాఖ యాడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 31: హెచ్-1బీ వీసాను దుర్వినియోగం చేయడం ద్వారా అమెరికాలో కంపెనీలు స్థానిక యువతకు బదులు విదేశీ కార్మికులతో ఉద్యోగాలను భర్తీ చేశాయని ఆ దేశ కార్మిక శాఖ ఆరోపించింది. ఇందులో భారతీయులే అత్యధికంగా లబ్ధి పొందారంటూ తన అక్కసును వెళ్లగక్కింది. ఈ మేరకు 51 సెకన్ల నిడివితో రూపొందించిన వీడియో యాడ్‌ను తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేసింది. 'హెచ్-1బీ వీసాను దుర్వినియోగం చేసి, విదేశీ కార్మికులను ఉద్యోగాల్లో నియమించుకొని యువ అమెరికన్ల అమెరికా కలలను భగ్నం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, కార్మిక మంత్రి లోరీ చావెజ్-డిరెమర్ నాయకత్వంలో ప్రాజెక్ట్ ఫైర్‌వాల్ ద్వారా వీసా దుర్వినియోగానికి కంపెనీలను బాధ్యుల్ని చేస్తున్నాం. నియామకాల్లో అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్థానిక యువత తమ అమెరికా కలను తిరిగి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఆ యాడ్‌లో కార్మిక శాఖ పేర్కొంది. అందులో పొందుపరిచిన గ్రాఫ్ ప్రకారం... హెచ్-1బీ వీసాల్లో 72% భారతీయులకు, చైనాకు 12శాతం, ఇతరులకు 14 శాతం దక్కుతున్నాయి.

కోటి ఉద్యోగాలు..

- పీఎం-కిసాన్ సాయం రూ.3 వేలు పెంపు
- బిహార్ కోసం ఎన్డీయే మేనిఫెస్టో విడుదల

పట్నా, అక్టోబరు 31 : బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం అధికార ఎన్డీయే కూటమి ఎన్నికల మేనిఫెస్టోను చేసింది. బిహార్ యువతకు కోటి ఉద్యోగాలను హామీ ఇవ్వడంతోపాటు, కోటి మంది మహిళలను లక్షాధికారులను చేస్తామంటూ లఖ్‌పతిదీదీ పథకాన్ని కొత్తగా ప్రకటించారు. ఉచిత విద్యను వాగ్దానం చేశారు. 'సంకల్ప పత్ర్' పేరిట రూపొందించిన ఈ మేనిఫెస్టోను పట్నాలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం నితీశ్‌కుమార్, హమ్(ఎస్) నేత, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, ఎల్‌జేపీ (రామ్ విలాస్) నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్, ఆర్‌ఎల్‌ఎమ్ నేత ఉపేంద్ర కుష్వాహా తదితర ఎన్డీయే భాగస్వామ్య పక్ష నేతలు ఆవిష్కరించారు. జిల్లాకు ఒక మెగా స్కిల్ సెంటరు చొప్పున ఏర్పాటుచేసి ప్రభుత్వ ప్రైవేటు రంగంలో పని చేయడానికి తగ్గినట్టు యువతకు శిక్షణ ఇప్పిస్తామని, బిహార్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మలుస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ముఖ్యమంత్రి రోజ్‌గార్ యోజన పథకాన్ని మహిళల కోసం ప్రకటించారు. వ్యాపారాలు చేసుకోవడానికి ప్రతి మహిళకు ఈ పథకం కింద రూ.రెండు లక్షలు ప్రభుత్వ సాయం అందిస్తామని తెలిపారు. ఏటా రూ.లక్ష సంపాదించే కనీసం కోటిమంది మహిళలను తయారుచేయడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. బాగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీలు) రూ.10 లక్షల ప్రభుత్వ సాయం అందించడంతోపాటు ఈ వర్గాల ఆర్థిక, సామాజిక వాస్తవ స్థితి అధ్యయనానికి సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తితో ఒక కమిటీని నియమిస్తామని తెలిపారు. రైతుల కోసం కొత్తగా కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించారు. దీని కింద పంట సీజన్‌లో రైతు కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని పెంచుతూ, రూ.3 వేలు అదనంగా అందిస్తామని హామీ ఇచ్చారు. మూడు విడతల్లో రూ.9వేలు ఇస్తామని తెలిపారు. పేదల కోసం ఐదు గ్యారంటీలను ప్రతిపాదించారు. ఉచిత రేషన్.. 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్... రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం.. పక్కా గృహ నిర్మాణానికి రూ.యాభై వేలు సాయం.. అర్హులైన కుటుంబాలకు సామాజిక పింఛన్లను హామీ ఇచ్చారు. ఈ హామీలన్నీ నెరవేర్చాలంటే రూ. 36,892 కోట్లు అదనంగా వార్షిక బడ్జెట్‌లో పెట్టాల్సి ఉంటుందని అంచనా.



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నితీశ్, జేపీ నడ్డా

ఈ సీజన్‌లో 46 లక్షల వివాహాలు!

న్యూఢిల్లీ, అక్టోబరు 31: దేశ వ్యాప్తంగా శనివారం(నవంబరు 1) నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం అవుతోంది. సుమారు 45 రోజుల పాటు ఉండే ఈ సీజన్‌లో 46లక్షల వివాహాలు జరుగుతాయని, ఇందుకోసం రూ.6.5 లక్షల కోట్ల మేరకు లావాదేవీలు జరిగే అవకాశం ఉందని.. తద్వారా కోటి మందికిపైగా ఉపాధి లభించవచ్చని అఖిల భారత వాణిజ్య మండలి(సీఏఐటీ) ఆధ్వర్యంలోని సీఆర్‌టీడీఎస్ అధ్యయనం వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో 48లక్షల వివాహాలు అయినట్లు తెలిపింది. దీని కోసం రూ.5.9లక్షల లావాదేవీలు జరిగినట్లు వివరించింది. వివాహాల సందర్భంగా ఈ ఏడాది స్వదేశీ వస్తు వినియోగం 70శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ చెప్పారు. 'వోకల్ ఫర్ లోకల్ వెడ్డింగ్స్' ప్రచారం జోరుగా సాగుతోందన్న ఆయన.. దీనివల్ల లైటింగ్, కృత్రిమ అలంకరణ వస్తువులు, బహుమతులు వంటివి దేశీయంగానే తయారు కానున్నాయని వివరించారు. ఆడంబరంగా జరిగే వివాహాలతో బంగారం, వెండి ధరలు కూడా పెరుగుతున్నాయన్నారు.

అక్రమాలపై ఫిర్యాదు ఇవ్వబోతే దాడి

(మొదటి పేజీ తరువాయి)

దామోదర సంజీవయ్య భవన్‌లో ఉన్న కార్యాలయానికి అక్టోబరు 28న వెళ్లారు. అక్కడి సిబ్బందికి ఇన్‌వార్డులో దరఖాస్తును అందిస్తున్న సమయంలో జీసీసీ జీఎం సీతారాం నాయక్ తన చాంబర్ నుంచి ఇన్‌వార్డ్‌లోకి వెళ్లి అనుచరులతో కలిసి రాజేశ్‌నాయక్‌పై దాడికి పాల్పడ్డారు. 'నా మీద ఫిర్యాదు చేస్తావా? నీకు ఎంత ధైర్యం' అంటూ బెదిరించారు. పైగా అవకతవకలకు సబంధించి సాక్ష్యాధారాలు కలిగిన పత్రాలను రాజేశ్‌నాయక్ నుంచి బలవంతంగా లాక్కున్నారు. ఈ గొడవ పెద్దదిగా కావడంతో దగ్గర్లో ఉన్న జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి.. వాళ్లిద్దర్నీ తన చాంబర్‌కు పిలిపించి గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే తప్పేంటని జీఎంను ప్రశ్నించారు. ఈ గొడవ జరిగిన తీరును ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తనమీద దాడి చేశారని రాజేశ్‌నాయక్ మాసబ్‌ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీఎం సీతారాం నాయక్‌పైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. జీఎం సీతారాం నాయక్ తీరుపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాజేశ్‌నాయక్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జీఎం సీతారాంనాయక్‌ను వివరణ కోరగా.. తనమీద రెండుమూడు సార్లు తప్పుడు ఫిర్యాదులు ఇచ్చారని, అక్టోబరు 28న కూడా వచ్చి కార్యాలయ సిబ్బందితో గొడవ పడుతుంటే.. తాను ఇన్‌వార్డుకు వెళ్లానని చెప్పారు. కావాల్సిన సమాచారం ఇస్తామని చెప్పినా రాజేశ్ నాయక్ ఘర్షణ పడ్డారని, తాము అతడిపై దాడి చేయలేదని సమాధానమిచ్చారు.

భారతీయత కోసం పాటుపడిన ఆర్య సమాజ్

- స్వామి దయానంద సరస్వతి గొప్ప సంఘ సంస్కర్త : ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబరు 31 : భారతీయ విలువల కోసం ఆర్య సమాజ్ ఎంతో పాటుపడిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆ సంస్థ స్థాపకులు స్వామి దయానంద సరస్వతి గొప్ప సంఘ సంస్కర్త అని, మహిళల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ ఆర్య మహా సమ్మేళన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆర్య సమాజ్ స్థాపించి 150 ఏళ్లు పూర్తికావడం వేద భూమి అయిన దేశం మొత్తానికీ విశేషమేనన్నారు. ఈ సందర్భంగా స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి, ఆర్య సమాజ్ 150వ వార్షికోత్సవ స్మారక నాణేలను ప్రధాని విడుదల చేశారు.

ఇందిరాగాంధీకి ఘననివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ వాద్రాలు ఢిల్లీలోని ఆమె స్మారక చిహ్నం శక్తి స్థల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను, ఆమె ధైర్యసాహసాలను, దార్శనికతను కాంగ్రెస్ నాయకులు గుర్తు చేసుకున్నారు. తన నానమ్మ చూపిన ప్రేమ, ఆచరించిన విలువలే నేటికీ తన ప్రతి అడుగులోనూ స్ఫూర్తినిస్తున్నాయంటూ రాహుల్ ఎక్స్‌లో భావోద్వేగ పోస్టు చేశారు. ఈ సందర్భంగా శక్తిస్థల్ వద్ద తాను, ఇతర కాంగ్రెస్ నాయకులు నివాళులర్పిస్తున్న చిత్రాలను కూడా ఆయన పంచుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం చేసిన కోసం ఇందిర చేసిన కృషి వల్లే బలమైన, ప్రగతిశీల భారతం ఆవిర్భవించిందని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.

మనుషులను స్మగ్లింగ్ చేస్తున్న భారతీయ జంటపై అమెరికా ఆంక్షలు

న్యూయార్క్, అక్టోబరు 31: మెక్సికోలో నివసిస్తూ అమెరికాకు అక్రమ మార్గాల్లో మనుషులను తరలిస్తున్న భారతీయ జంటపై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వారికి చెందిన 16 కంపెనీల ఆస్తులను స్తంభింపజేసింది. మెక్సికోలోని కాన్‌కున్‌లో నివసిస్తున్న విక్రాంత్ భరద్వాజ్ ఆయన భార్య ఇందూ రాణిలు రియల్ ఎస్టేట్ సహా పలు వ్యాపారాలు ఉన్నాయని చెప్పుకొని మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని అమెరికా అధికారులు గుర్తించారు. నిజానికి వారిది మెక్సికో కేంద్రంగా పనిచేసే బహుళ జాతీయ క్రిమినల్ ముఠా అని, అది భరద్వాజ్ హ్యూమన్ స్మగ్లింగ్ ఆర్గనైజేషన్ (హెచ్ఎస్ఓ) అని తెలిపారు. భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా పలు దేశాల నుంచి వేలాది మందిని తొలుత మెక్సికోకు తీసుకెళ్లి అక్కడ నుంచి అక్రమంగా సముద్ర, వాయు మార్గాల్లో అమెరికాకు తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇందుకు మెక్సికోకు చెందిన ముగ్గురు వ్యక్తులు సహకరించారని చెప్పారు. దాంతో అమెరికాలో ఆ జంటకు ఉన్న ఆస్తులను స్తంభింపజేస్తూ ఆర్థిక శాఖ పరిధిలోని ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అస్సెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఆదేశాలు ఇచ్చింది.

ప్రభుత్వ సలహాదారుగా పి.సుదర్శన్‌రెడ్డి

పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రావు.. ఇద్దరికీ క్యాబినెట్ హోదా కల్పిస్తూ నియామకం


పి.సుదర్శన్‌రెడ్డి


ప్రేమ్‌సాగర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్యాబినెట్‌లో చోటు ఆశించిన ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రభుత్వం క్యాబినెట్ హోదాతో కీలక పదవులు ఇచ్చింది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారు (అభివృద్ధి, సంక్షేమ ఫ్లాగ్‌షిప్ పథకాల అమలు)గా నియమించింది. ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావును రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమించింది. ఇద్దరికీ క్యాబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు.. సుదర్శన్‌రెడ్డి క్యాబినెట్ హోదాలో అన్ని క్యాబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరవుతారని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఇతర అధికారులతో సమీక్షించే అధికారాన్ని ఆయనకు దఖలు పరిచింది. మంత్రుల స్థాయిలో ఆయనకు నివాస భవనం, సచివాలయంలో మంత్రుల మాదిరిగా చాంబర్‌ను కూడా కేటాయించనున్నట్లు పేర్కొంది. జీత భత్యాలు, సిబ్బంది వంటి సౌకర్యాలు కూడా మంత్రుల స్థాయిలో ఉంటాయని తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని, సలహాదారు సుదర్శన్‌రెడ్డికి సచివాలయం నుంచి అవసరమైన సహకారం అందిస్తారని వివరించింది. సలహాదారు, కార్యదర్శి యూనిట్ మొత్తం.. పథకాల అమలుపై ఎప్పటికప్పుడు క్యాబినెట్‌కు వివరించాల్సి ఉంటుందని పేర్కొంది.

మంత్రి పదవి కోసం ప్రయత్నించినా..

నిజానికి సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు ఇద్దరూ మంత్రివర్గంలో స్థానం కోసం ఎంతో ప్రయత్నించారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రాతినిధ్యంలో భాగంగా తనకు మంత్రి పదవి వస్తుందని సుదర్శన్‌రెడ్డి మొదటి నుంచీ భావిస్తూ వచ్చారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు కూడా బెర్తు ఆశించారు. కానీ, ఎప్పటికప్పుడు వీరికి అవకాశం చేజారుతూ వచ్చింది. ఇటీవల జరిగిన క్యాబినెట్ విస్తరణలో ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ.. సుదర్శన్‌రెడ్డికి చివరి దశలో అవకాశం చేజారింది. వాస్తవానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేకపోవడంతో సుదర్శన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు కావడం, ఇదివరకు మంత్రిగా చేసిన అనుభవం ఉండడం, సీఎం రేవంత్‌రెడ్డితో మొదటి నుంచి సఖ్యతగా ఉంటున్నందున.. మంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ, మంత్రివర్గ విస్తరణలో సామాజిక వర్గాల సమీకరణ అంశం బలంగా ఉండడం, అప్పటికే క్యాబినెట్‌లో రెడ్డి సామాజికవర్గం మంత్రులు ఉండడంతో సుదర్శన్‌రెడ్డికి అవకాశం దక్కలేదు. జి.వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరిలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. అయితే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి వివేక్ వెంకటస్వామితో పాటు ప్రేమ్‌సాగర్‌రావు కూడా మంత్రి పదవి కోసం పోటీ పడ్డారు. కానీ, సామాజిక కోణం, అధిష్ఠానం అండదండల నేపథ్యంలో వివేక్‌కే స్థానం దక్కింది. అయినా.. క్యాబినెట్‌లో మరో మూడు బెర్తులు ఖాళీగా ఉండగా.. తాజాగా అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రివర్గంసంఖ్య 16కు చేరింది. ఇంకా రెండు బెర్తులు మిగలడంతో.. మరోసారి విస్తరణలో సుదర్శన్‌రెడ్డికి అవకాశం దక్కవచ్చన్న చర్చ జరిగింది. కానీ, ప్రభుత్వం ఆయనను క్యాబినెట్ హోదాలో సలహాదారుగా నియమించడంతో ఇక నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం ఉండకపోవచ్చని తెలుస్తోంది. ప్రేమ్‌సాగర్‌రావుకూ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంతో మిగతా రెండు బెర్తులను భర్తీ చేస్తారా? లేక ఇతరుల కోసం రిజర్వ్ చేసి పెట్టారా? అన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రంలో 3,179 వైద్య పీజీ సీట్లు

- ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా 75 సీట్లు
- కాలేజీల వారీగా వివరాలు వెల్లడించిన ఎన్ఎంసీ

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొత్తం 3,179 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు ఉన్నాయని జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది కొత్తగా 75 సీట్లు పెరిగితే.. ఒక్క సనత్‌నగర్ ఈఎస్ఐ కళాశాలలోనే 23 పీజీ సీట్లు పెరిగినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 సంవత్సరానికి గాను ఉన్న పీజీ సీట్ల వివరాలను కాలేజీల వారీగా ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో శుక్రవారం విడుదల చేసింది. ఈ సీట్ల మ్యాట్రిక్స్ నీట్ పీజీ 2025-26 విద్యా సంవత్సరం కోసమని ప్రకటించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,390 పీజీ సీట్లుండగా.. మిగిలినవన్నీ ప్రైవేటు కాలేజీల్లో ఉన్నాయని తెలిపింది. కొత్తగా ప్రారంభమైన రామగుండం, సూర్యాపేట, నల్గొండ, కాలేజీల్లో కూడా డెర్మటాలజీ, అనస్థీషియా, గైనకాలజీ, సర్జరీ, ఆర్థో, ఇతర విభాగాల్లో సీట్లు పెరిగినట్లు ఎన్ఎంసీ పేర్కొంది.

కర్రె గుట్టల్లో కాల్పుల మోత

- తప్పించుకున్న పలువురు మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు కంచుకోటగా పేరొందిన ఛత్తీస్‌గఢ్‌లోని కర్రె గుట్టలు శుక్రవారం కాల్పుల మోతతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, కేంద్ర బలగాల మధ్య సుమారు గంట పాటు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కొన్నిరోజుల క్రితం కేంద్ర బలగాలు కర్రె గుట్టల్లో నూతన బేస్ క్యాంపును ఏర్పాటు చేశాయి. వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఫార్వర్డ్ బేస్ క్యాంపు ఏర్పాటు కోసం అడవుల్లోకి వెళ్లిన బలగాలపై ఒక్కసారిగా మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరపడంతో పలువురు మావోయిస్టులు అక్కడి నుంచి పరారయ్యారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా బృందమే ఈ కాల్పులకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాల్పుల ఘటనపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

పెళ్లివ్యానును ఢీకొన్న బోర్‌వెల్ లారీ

వ్యానులోని ముగ్గురి దుర్మరణం

- మరో 12 మందికి గాయాలు.. పెళ్లింట విషాదం
- హనుమకొండ జిల్లాలో భీమదేవరపల్లిలో ఘటన
- వ్యాన్ క్యాబిన్‌లో కూర్చున్న వధూవరులు క్షేమం


స్వప్న (ఫైల్)

భీమదేవరపల్లి (ఎల్కతుర్తి), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అప్పటిదాకా సంబరాలతో సందడిగా ఉన్న ఆ పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. వరుడి ఇంట్లో వివాహ రిసెప్షన్‌కు హాజరైన వధువు తరఫువారు వ్యానులో తిరిగి వెళుతూ ఓ చోట ఆగారు. వెనుక నుంచి ఓ బోర్‌వెల్ లారీ దూసుకొచ్చి వ్యానును ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. వ్యానులో 30 మంది వరకు ఉన్నట్లు సమాచారం. 12మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో వధువు తల్లిదండ్రులు కూడా ఉన్నారు. మృతుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సుధన్‌పల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి, సిద్దిపేట జిల్లా వెంకటపురానికి చెందిన భాస్కర్‌కు అక్టోబరు 29న కురవి వీరభద్ర స్వామి దేవస్థానంలో వివాహం జరిగింది. 30న వధువు కుటుంబసభ్యులు, బంధువులు రిసెప్షన్ కోసం వ్యాన్‌లో వెంకటాపురంలోని పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడ రాత్రి రిసెప్షన్ అనంతరం వధూవరులతో కలిసి తిరిగి సుధన్‌పల్లికి అర్ధరాత్రి బయలుదేరారు. మార్గమధ్యలో భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద మూత్ర విసర్జన కోసం వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన బోర్‌వెల్ లారీ పెళ్లి వ్యాన్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో వ్యానులో ఉన్న సుధన్‌పల్లికి చెందిన వధువు బంధువులు రెడ్డబోయిన స్వప్న (16), రెడ్డబోయిన శ్రీనాథ్ (6), కళమ్మ (55) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వ్యానుల్లో ఉన్నవారిలో పెళ్లి కూతురు తండ్రి ఉప్పం రాజుకు కాళ్లు విరిగాయి. పెళ్లికూతురు తల్లి అనసూర్య తీవ్రగాయాలతో కోమాలోకి వెళ్లింది. వ్యానులోని మిగతావారిలో గంగలక్ష్మి, అక్షయ, మారుతి, రమాదేవి, దేవేందర్, నవలోక్, రిత్విక్, సరోజన, కార్తీక్, శ్రీరామ్‌కు గాయాలైయ్యాయి. వీరిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై కేసు నమోదైంది. వధూవరులు నాగలక్ష్మి, భాస్కర్ వ్యాన్ క్యాబిన్‌లో కూర్చోవడంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

వేర్వేరు ఘటనల్లో ఆర్టీసీ బస్సులు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- బస్సు కింద పడుకుని ఒకరి ఆత్మహత్య


నందిపేటలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న దృశ్యం

నందిపేట, పేట్‌బషీరాబాద్, సిద్దిపేట అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ద్విచక్ర వాహనదారులను ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తనను ఎక్కించుకునేందుకు ఆగిన బస్సు టైరు కిందే పడుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌కి చెందిన భ్యాగరి లక్ష్మి, ఆమె కుమారుడు పోశెట్టి(27) శుక్రవారం ద్విచక్రవాహనంపై జోర్‌పూర్ మీదుగా నందిపేటకు వెళుతున్నారు. బంగారు మైసమ్మ ఆలయం మలుపు వద్ద నందిపేట నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. పోశెట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో మేడ్చల్ గిర్మాపూర్‌కి చెందిన ముక్కెర ప్రభాకర్ ద్విచక్రవాహనంపై తన కుమార్తె సంకీర్తన, తమ్ముడి కుమార్తె కీర్తన(19)లతో కలిసి శుక్రవారం సుచిత్రా వైపునకు వస్తున్నారు. మార్గమధ్యలో భాగ్యలక్ష్మి ఇన్‌ఫ్రాడెవలప్ సంస్థ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. కీర్తన అక్కడికక్కడే మృతి చెందింది. మెదక్ జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లకి చెందిన నారదాసు బాలరాజు(47) హైదరాబాద్‌లోని బంధువుల ఇంటి వెళ్లి తిరిగి వస్తున్నాడు. పొన్నాల గ్రామశివారులో బస్సు దిగి జనగామ బస్సు ఎక్కడానికి హైదరాబాద్ వైపు రోడ్డు మధ్యలో నడుచుకుంటూ వెళ్లాడు. సిద్దిపేట నుంచి వచ్చిన కాంట్రాక్ట్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతన్ని చూసి ఆపాడు. కానీ బాలరాజు బస్సు ఎక్కకుండా ముందు టైరు కింద పడుకున్నాడు. అది గమనించని డ్రైవర్ బస్సును ముందుకు కదిలించాడు. ద్విచక్రవాహనదారు చూసి బస్సు నిలిపివేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

సీపీఎం రాష్ట్రనేత సామినేని దారుణహత్య

- కత్తితో పొడిచి చంపిన గుర్తుతెలియని వ్యక్తి
- ఖమ్మం జిల్లా పాతర్లపాడు గ్రామంలోని సామినేని రామారావు ఇంటి వద్దే ఘటన
- గ్రామంలో ఉద్రిక్తత.. భారీ బందోబస్తు
- హత్యను తీవ్రంగా ఖండించిన డిప్యూటీ సీఎం భట్టి


సామినేని రామారావు

చింతకాని, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, పార్టీ అనుబంధ రైతు సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రామారావు (75) దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం ఉదయం స్వగ్రామమైన పాతర్లపాడులో మార్నింగ్ వాక్ అనంతరం ఇంటికొచ్చిన రామారావు.. ఇంటి పక్కనే ఉన్న కొట్టంలో తట్ట కింద కప్పెట్టిన కోళ్లను విడిచేందుకు వెళ్లారు. అప్పటికే అక్కడ డాబా మీద మాటు వేసి ఉన్న గుర్తు తెలియని దుండగుడు.. ఒక్కసారిగా వచ్చి కత్తితో రామారావు పొట్ట, ఛాతీ భాగాల్లో పొడిచాడు. రామారావు కేకలు వేయడంతో భార్య స్వరాజ్యం, పక్కింటి వారొచ్చారు. అప్పటికే రామారావు తీవ్రగాయాలతో ఘటనాస్థలిలోనే మృతిచెందారు. కత్తితో పొడిచిన అనంతరం దుండగుడు రామారావు ఇంటి వెనుక ఉన్న పెరట్లో నుంచి పరారయ్యాడు. దుండగుడి టీషర్టులో ఓ ముక్క, అతడు వాడిన కత్తి తాలూకు పౌచ్ ఘటనాస్థలంలో పడిపోయాయి. సీపీ సునీల్‌దత్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం ఘటనాస్థలి నుంచి వేలిముద్రలు, రక్తనమూనాలతో పాటు ఇంకొన్ని ఆధారాలను సేకరించాయి. మృతుడి ఒంటిపై ఏడు కత్తిగాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న రామారావు ఇతర రాజకీయ పార్టీలతో ఘర్షణలు దిగిన ఘటనలు కూడా లేవు. దీంతో ఈ హత్య మిస్టరీగా మారింది. హత్యచేసింది కిరాయి హంతకుడు అయి ఉండొచ్చునని భావిస్తున్నారు. హత్య వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా? ఆస్తి తగాదాలు, కుటుంబ గొడవల కారణంగా జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటన చింతకాని మండలంలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామరావు హత్యను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. రామారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమగ్ర విచారణ జరిపించి హంతకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించారు.

తుర్కియేకు భారత్ ఝలక్!

- ఆ దేశ జాతీయ దినోత్సవాన్ని బహిష్కరించిన కేంద్ర అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబరు 31: దేశ రాజధాని ఢిల్లీలోని తుర్కియే రాయబార కార్యాలయంలో ఈనెల 29న నిర్వహించిన ఆ దేశ జాతీయ దినోత్సవానికి భారత ప్రభుత్వ ఉన్నతాధికారులెవరూ హాజరు కాలేదు. ఈ బహిష్కరణపై అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, ఇది దౌత్యపరంగా తుర్కియేకు భారత్ ఇచ్చిన ఝలక్‌గా భావిస్తున్నారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు అనుకూలంగా తుర్కియే వ్యవహరించిన తీరు, ముఖ్యంగా కశ్మీర్ అంశంపై ఆ దేశ అధ్యక్షుడు పదేపదే అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి వాటివల్ల ఇరు దేశాల మధ్య మైత్రి పూర్తిగా దెబ్బతింది. భారత్ ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో తన శక్తిని పెంచుకుంటోంది. ఈ క్రమంలో తుర్కియేను పక్కన పెట్టి భారత్-ఇజ్రాయెల్-యూఏఈ-అమెరికా కూటమికి, అలాగే అత్యంత కీలకంగా భావిస్తున్న ఇండియా-పశ్చిమాసియా-ఐరోపా ఆర్థిక నడవాకు ప్రాధాన్యమిస్తోంది. మరోవైపు, తుర్కియేతో సుదీర్ఘకాలంగా వివాదాలు ఉన్న సైప్రస్ వంటి దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం కూడా ఈ దౌత్యపరమైన వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిర్దోషికి న్యాయం..!

చేయని నేరానికి శిక్ష అనుభవించినవారికి నష్టపరిహారం అందించాలన్న సుప్రీంకోర్టు ఆలోచనను మెచ్చవలసిందే. తప్పుడు సాక్ష్యాలతో, అభియోగాలతో శిక్షపడిన వ్యక్తికి జరిగిన నష్టాన్ని ఎంతోకొంత భర్తీ చేయడం అవసరమే. పరిహారం చెల్లించడం అంటే, కాస్తంత న్యాయం చేయాలని ప్రయత్నించడమే కాదు, పాపం చేశామనీ, పొరపాటు జరిగిందనీ ఒప్పుకోవడం కూడా. అనంతరకాలంలో నిర్దోషిగా బయటకు వచ్చిన బాధితుడికి జైలులో అతడు కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణించి, గణించాలన్నది సముచితమైన ప్రతిపాదన. బాధితుడికి ఆర్థికంగా ఒరిగేదానికంటే, వ్యవస్థలన్నీ కలసికట్టుగా చేసిన తప్పును ఈ రూపంలో ఒప్పుకోవడం మరింత ఉపశమనం కల్పిస్తుంది.

బలహీనులు, నిస్సహాయుల మీద పెద్దలు కక్షకట్టి తప్పుడు కేసుల్లో ఇరికించడం, ప్రశ్నించేవారిని పాలకులు జైళ్లలోకి నెట్టడం ఈ దేశంలో అనాదిగా జరుగుతున్నదే. పేదల విషయంలో అంత సత్వరంగా స్పందించని న్యాయస్థానాలు రాజకీయ, సినీరంగప్రముఖులు ఇమిడివున్న కేసుల్లో తక్షణ న్యాయం అందించడం ఉన్నదే. న్యాయపీఠంమీద కూర్చున్న కోవిదులకు ఏవి తప్పుడు కేసులో తెలియకపోదు కూడా. ఒకానొక కేసు సుప్రీంకోర్టుకే మరీ అన్యాయంగా కనిపించినందున పరిహారం ప్రతిపాదన దానికీ నచ్చినట్టు ఉంది. మహారాష్ట్రలో ఒక మైనర్‌పై అత్యాచారం చేసి, హత్యచేశాడన్న ఆరోపణమీద ఆరేళ్ళు జైల్లో మగ్గి, ఆ తరువాత, థానేకోర్టు ఉరిశిక్ష వేయడంతో మరో ఆరేళ్ళు ఆ భయం నీడలోనే సర్వోన్నతన్యాయస్థానంలో పోరాటం సాగించిన ఒక నిరుపేదను కోర్టు అంతిమంగా నిర్దోషిగా తేల్చింది. అతడిని ఈ కేసులో అక్రమంగా ఇరికించారని, దర్యాప్తు సక్రమంగా జరగలేదని న్యాయస్థానం నిర్ణయానికి వచ్చింది. తాను జైల్లో కోల్పోయిన జీవితాన్ని పరిగణనలోకి తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని ఆ బాధితుడు కోరుకున్నాడు. అన్యాయం జరిగినందున అతడు నష్టపరిహారానికి అర్హుడనీ, జైలు జీవితం అతని ప్రాథమిక హక్కులను కొల్లగొట్టిన వాస్తవాన్ని లెక్కలోకి తీసుకోవాలని అతని న్యాయవాది వాదించారు. ఒక వ్యక్తిని సుదీర్ఘకాలం జైల్లో మగ్గనిచ్చి, ఆ తరువాత కేవలం నిర్దోషి అని ప్రకటించడంతో వ్యవస్థ బాధ్యత తీరిపోదని సుప్రీంకోర్టు కూడా భావించింది. నిర్దోషి అని నిర్ధారించడంతో పాటుగా దోషాన్ని సరిదిద్దడం కూడా అవసరమనుకుంది. బాధితుడి అభ్యర్థన నెరవేర్చడానికి తదనుగుణమైన మార్గదర్శకాలు రూపొందించాలన్న న్యాయవాది వాదనతోనూ ఏకీభవించింది. అనేక సంక్లిష్టమైన అంశాలు, ప్రక్రియలూ ఇమిడివున్నందున ఈ అంశంపై ఒక నిర్ణయానికి రావడంలో సహకరించమని అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను న్యాయమూర్తులు కోరారు. దిగువ కోర్టులు ఏకంగా ఉరిశిక్షలు వేయడం మీద సుప్రీంకోర్టు పలుమార్లు అసహనాన్ని ప్రకటించడమే కాదు, ఇటీవలి కాలంలోనే అటువంటి కేసులు కొన్ని కొట్టివేసింది కూడా. ఆ సందర్భాల్లో పోలీసులనూ, ప్రాసిక్యూషన్‌నూ తప్పుబట్టడం కూడా చూశాం.

తప్పుడు అభియోగాలు, అరెస్టులు, శిక్షలనుంచి అమాయకులను రక్షించాలన్న తన ప్రయత్నానికి ప్రభుత్వం సహకరించాలని కోర్టు కోరుతోంది. పలుదేశాల్లో ఈ తరహా నష్టపరిహారాలు, తగిన నిబంధనలు ఉన్నందున ఈ దేశంలోనూ వాటిని పాలకులు తలుచుకుంటే అమలుచేయవచ్చును. కానీ, క్షమాపణలకు కూడా నోచుకోని అమాయకులకు ఏకంగా పరిహారాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు సిద్ధపడతాయనుకోలేం. సగంమంది శిక్షలు పడకుండానే జైల్లో మగ్గిపోతున్న దేశంలో ఇంత ఉదాత్తంగా వ్యవహారం సాగుతుందా అన్నది ప్రశ్న. క్రిమినల్ కేసుల్లో నిందితులు నిర్దోషులుగా తేలితే దర్యాప్తు అధికారులను బాధ్యులను చేయాలన్న పదేళ్ళనాటి సుప్రీంకోర్టు ఆదేశం వెంటనే అటకెక్కిపోయింది. అమాయకులపై తప్పుడు కేసులు పెట్టడం ద్వారా అసలు నిందితులను ఉద్దేశపూర్వకంగా వదిలేసిన అధికారులు నిజానికి తీవ్రమైన శిక్షలకు అర్హులు. దోషులు స్వేచ్ఛగా తిరుగుతూ మరింత తెగించేందుకు వీరి చర్య ఉపకరిస్తోంది, వారిని ప్రోత్సహిస్తోంది. నిర్దోషులైనవారు చీకటిగోడలమధ్య మగ్గిపోతూ ప్రాథమికహక్కులను కోల్పోవడమే కాదు, విలువైన కాలాన్నీ, పరువు మర్యాదలను కూడా నష్టపోతారు. ఇలా అక్రమ కేసుల్లో అన్యాయమైపోయినవారిని ఆదుకోవడానికి లా కమిషన్ 2018లోనే కొన్ని సూచనలు చేసింది. అలాగే, లోక్‌సభ ముందుకు ఒక ప్రైవేటు బిల్లు వచ్చి కూడా చివరకు మురిగిపోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండివుంటే భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్) లో ఇప్పటికే తదనుగుణమైన నిబంధనలు చేరివుండేవి. అక్రమ అరెస్టులమీదే మనుగడ సాగించే రాజకీయవ్యవస్థనుంచి సహకారం ఆశించడం వృథా.

కులమతాల ఉచ్చుల్లో ‘విఫల రాష్ట్రం’

బిహార్ గురించి మాట్లాడడమూ లేదా రాయడమూ బాధాకరమైన విషయమే. స్వతంత్ర భారతదేశంలో బిహార్ కథ సంపూర్ణ నిర్లక్ష్యం, వ్యర్థ ప్రగల్భాల చరిత్రే. 1947లో భారతదేశ సమస్త రాష్ట్రాలు ఒకే ప్రారంభ స్థానంలో ఉన్నాయి. స్వాతంత్ర్య వేళ, లేదా భారత గణతంత్ర రాజ్యం ప్రభవించిన పొద్దులో తమను వెనుకనే వదిలివేసి స్వతంత్ర దేశం ముందుకు సాగిపోయిందని ఏ రాష్ట్రమూ చెప్పదు, చెప్పలేదు. నాడు కేంద్రంలోనూ, దాదాపుగా అన్ని రాష్ట్రాలలోనూ అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కనుక దేశవ్యాప్తంగా ఎల్లెడలా ఒకే విధానాలు, కార్యక్రమాలు అమలయ్యాయి. నిజానికి కొన్ని ప్రగతిశీల భావాలను తొలుత బిహార్‌లోనే ప్రయోగాత్మకంగా అమలుపరిచారు. అవి అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. భూ సంస్కరణలు, భూముల పంపిణీ అందుకు ఉదాహరణలు.



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

ప్రజాహితాన్ని ఔదలదాల్చిన నాయకులు బిహార్‌లో ఉండేవారు. సుపరిపాలనను సమర్థంగా అందించిన పాలనా వ్యవస్థ, దీక్షాదక్షతలతో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించిన సివిల్ సర్వెంట్లూ ఉండేవారు. దేశంలోనే మహా సస్యశ్యామల క్షేత్రాలు బిహార్‌లో ఉండేవి. ఆరు రుతువుల్లోనూ నిండుగా ప్రవహించే జీవనది గంగమ్మ చెంతనే ఉన్నది. సహజ వనరులు అపారం. భారత్‌లో తొలి ఉక్కు కర్మాగారాలు అవిభక్త బిహార్‌లోనే ప్రారంభమయ్యాయి. దేశంలోని నాలుగు ప్రముఖ హైకోర్టుల్లో ఒకటి పట్నాలో ఉండేది. ధృఢమైన న్యాయవ్యవస్థ వర్ధిల్లేది. మరి బిహార్ ఎందుకు విఫలమయింది?

బిహార్‌పై అధికారిక సమాచారం మహా నిరుత్సాహం కలిగిస్తుంది. వాస్తవ పరిస్థితులు అంతకంటే అధ్వానమైనవని పరిశీలకులు ఘంటాపథంగా చెప్పుతారు. ఈ శోచనీయ పరిస్థితులకు ప్రతి ప్రభుత్వమూ నిందార్హమైనదే. నితీశ్‌కుమార్ నవంబర్ 24, 2005 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్నారు. (మధ్యలో 278 రోజులు మినహా. ఆ స్వల్పకాలిక ముఖ్యమంత్రిని నితీశ్ స్వయంగా ఎంపిక చేశాడు). అంటే నితీశ్ 20 సంవత్సరాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన తరువాత సుదీర్ఘకాలం పాలించిన నేత లాలూప్రసాద్ యాదవ్ (లేదా ఆయన సతీమణి) 1990 నుంచి 2005 దాకా బిహార్‌లో లాలూ పాలన నడిచింది. 35 సంవత్సరాల వయసులోపు బిహారీలకు ఒకే ఒక్క ముఖ్యమంత్రి– నితీశ్ కుమార్– మాత్రమే తెలుసు. బిహార్ అసెంబ్లీకి ఇప్పుడు జరగనున్న ఎన్నికలు 1990ల నాటి లేదా అంతకు ముందటి సంవత్సరాలలోని ప్రభుత్వాల గురించి కాదు. నితీశ్ నాయకత్వం, ఆయన ఇరవై సంవత్సరాల పాలనపై 2025 ఎన్నికలలో బిహారీలు తీర్పు ఇవ్వనున్నారు.



కులం కుటుంబానికే పరిమితమవ్వాలి. మతాన్ని పూజా ప్రదేశాలలోనే ఆచరించాలి. రాజకీయ వ్యవహారాలనూ పాలనా వ్యవస్థలనూ ఎట్టి పరిస్థితులలోనూ ప్రభావితం చేయకుండా కుల మతాలను కట్టడి చేయాలి. బిహార్ ప్రజలు ఈ సత్యాన్ని గ్రహించి జాగృతమయినప్పుడే తమకుతాము వేసుకున్న ఆ ఉచ్చుల నుంచి బయటపడగలుగుతారు.

2025లో బిహార్ జనాభా 13.43 కోట్లు అని అంచనా. 1 కోటి నుంచి 3 కోట్ల మంది బిహారీలు తమ రాష్ట్రం వెలుపలి ప్రాంతాలకు వలసపోయారని అంచనా. బిహార్‌లో నిరుద్యోగిత, పేదరికానికి ప్రధాన కారణాలు: యువజనుల నిరుద్యోగిత రేటు 10.8 శాతం. విద్యాస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందో నిరుద్యోగిత రేటు కూడా అంత అధికంగా ఉండడం ఒక వైరుధ్యం. కేవలం 1,35,464 మంది బిహారీలు మాత్రమే తమ రాష్ట్రంలోని పరిశ్రమలలో ఉద్యోగులుగా ఉన్నారు. వీరిలో కేవలం 34,700 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు. భారతదేశంలో అత్యధిక పేదరికం రేటు బిహార్‌లో ఉందని 2024లో నీతి ఆయోగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 64శాతం కుటుంబాల నెలసరి ఆదాయం పదివేల రూపాయల కంటే తక్కువగా ఉన్నది. నెలసరి ఆదాయం రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్న కుటుంబాలు 4శాతం మాత్రమే. మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎమ్‌పీఐ– ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలలో బహుళ లేమిని ఒకేసారి పరిశీలించడం ద్వారా పేదరికాన్ని అంచనా వేస్తుంది) అత్యంత చెత్త పనితీరు కనపరిచే రాష్ట్రం బిహార్.

బిహార్ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులకు నితీశ్‌కుమార్ ప్రభుత్వానిదే బాధ్యత. భారత్ జనాభాలో 9శాతం బిహార్‌లో ఉండగా, స్థూల దేశీయోత్పత్తిలో ఆ రాష్ట్రం వాటా 3.07 శాతమే. 2023–24లో బిహారీల తలసరి ఆదాయం రూ.32,174 (జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,06,744లో మూడో వంతు) మరింత ఆందోళనకరమైన విషయమేమిటంటే బిహార్ తలసరి ఆదాయం జాతీయ సగటు ఆదాయం పెరుగుదల రేటు కంటే తక్కువ రేటులో పెరుగుతోంది. రెండిటి మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఆర్థికాభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నప్పటికీ బిహార్ పేద సమాజంగా, విఫల రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ఆ రాష్ట్ర రాజకీయాలే అందుకు కారణం, సందేహం లేదు. బిహార్ ప్రభుత్వమూ, దాని వ్యవస్థలూ తమకుతాము వేసుకున్న కులం, మతం ఉచ్చుల్లో చిక్కుకుపోయాయి. బిహార్ ప్రజలలో తీవ్ర విభేదాలకు మతం ఒక పెద్ద కారణం. రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యంతో పరిపాలనలో ప్రతి అంశాన్ని మతం ప్రభావితం చేస్తోంది. ముస్లింలు నమ్మకద్రోహులు, కృతఘ్నులు అని, తత్కారణంగా వారి ఓట్లను తాను ఆశించడం లేదని గిరిరాజ్‌సింగ్ అనే బీజేపీ నేత వ్యాఖ్యానించాడు. ముస్లింలు 17శాతంగా ఉన్న రాష్ట్రంలో ఆయన ఈ వ్యాఖ్య చేశాడు మరి.

బిహార్ ప్రజల పిచ్చాపాటీలో కులమే ప్రధాన అంశం. రాజకీయాల గురించిన చర్చ కూడా కులం చుట్టూనే నడవడం పరిపాటి. హిందువులు ఓబీసీలుగా, ఎమ్‌బీసీలుగా, ఈబీసీలుగా చీలిపోయి ఉన్నారు. ఈబీసీలలోని 12 కులాలలో నాలుగు మాత్రమే ప్రధానమైనవిగా పరిగణన పొందుతున్నాయి. కుల మతాలకు మితిమీరిన ప్రాధాన్యమివ్వడం వల్ల బిహార్ ప్రజలలో పరస్పర అనుమానాలు, విరోధ భావాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయి. బిహార్ రాజకీయాలలో మార్పు వచ్చి తీరాలి. ఆ మార్పును ఎవరు సాధిస్తారు? ఈ ప్రశ్నకు భిన్న సమాధానాలు వస్తాయి. మార్పును తీసుకువచ్చే నాయకుడు నితీశ్‌కుమార్ మాత్రం కానే కాదని ఇంగిత జ్ఞానం ఉన్న ప్రతి ఒక్కడూ చెప్పగలడు. ఆయన తన ఇరవై సంవత్సరాల పాలనా అలవాట్లలో పాదుకుని పోయి వున్నాడు. అనూహ్య రీతుల్లో ప్రవర్తించడం ఆయనకు పరిపాటి. ఇప్పుడు ఆరోగ్య సమస్యలు కూడా ఆయనను చుట్టుముట్టాయి. నితీశ్ తననుతాను మార్చుకుని బిహార్ పాలనలో, సమాజంలో మౌలిక మార్పులు తీసుకురాగలరని భావించడం, ఆశించడం మూర్ఖత్వమే అవుతుంది. బీజేపీతో జత కట్టిన ప్రతి ప్రాంతీయ పార్టీ పతనమయింది. ఉనికినీ కోల్పోయింది. నితీశ్ నాయకత్వంలోని జనతాదళ్(యు) భవిష్యత్తు అందుకు భిన్నంగా ఉండదు.

కులం కుటుంబానికే పరిమితమవ్వాలి. మతాన్ని పూజా ప్రదేశాలలోనే అనుష్ఠానించాలి. రాజకీయ వ్యవహారాలనూ పాలనా వ్యవస్థలనూ ఎట్టి పరిస్థితులలోనూ ప్రభావితం చేయకుండా కులమతాలను కట్టడి చేయాలి. బిహార్ ప్రజలు ఈ సత్యాన్ని గ్రహించి జాగృతమయినప్పుడే తమకుతాము వేసుకున్న ఆ ఉచ్చుల నుంచి బయటపడగలుగుతారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మురికితనం కరుకుతనం పాలైన మేధ

తొలి ప్రేమ నవ యవ్వన కాలాన్ని దాటదు. తరుణప్రాయంలో అంకురించిన మేధా ఆసక్తులు తాత్కాలికమైనవి కాక జీవితపర్యంతం వర్థిల్లడం కద్దు. అటవీ సామాజికుల చరిత్రకారునిగా నేను నా విద్వత్ వృత్తి జీవితానికి శ్రీకారం చుట్టాను. బ్రిటిష్ వలసపాలనలో మొరటుగా ధ్వంసమైన జీవితాలు వారివి. క్రమంగా నా ఆసక్తులు, పరిశోధనలు, రచనా వ్యాసంగాలు విభిన్న అంశాల వైపుగా వికసించాయి. అయినప్పటికీ నేను తొట్టతొలుత సాగుచేసిన మేధా క్షేత్రంతో నా అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్తూన్నాను. నిజానికి గత వారం రోజులూ ఒక యువ పరిశోధకుడి డాక్టొరల్ థీసిస్ చదువుతూ గడిపాను. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రంగా విలసిల్లుతున్న ప్రాంతాల సామాజిక, పర్యావరణ చరిత్రను శోధించిన సిద్ధాంత వ్యాసమది. అది నన్ను బాగా ప్రభావితం చేసింది. ఎంతగా అంటే ఈ కాలమ్‌లో దాని గురించి రాసి తీరాలనే బలీయమైన ప్రేరణను నాలో పాదుకొల్పింది.



బ్రిటిష్ పాలనలో సింగ్‌భూమ్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో సంభవించిన పరివర్తనల పూర్వాపరాలను ఆ థీసిస్ విశ్లేషించింది. ఈస్టిండియా కంపెనీ క్రమంగా ఆ ప్రాంతంపై సైనిక, పాలనా పరమైన నియంత్రణను సాధించిన వైనాన్ని తొలుత వివరించింది. ఆ తరువాత ఆ ప్రాంత ప్రాకృతిక ఆవరణాన్ని, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను వలసపాలన ఎలా పునర్వ్యవస్థీకరించిందో పేర్కొంది. వలసపాలకుల అటవీ విధానం వ్యాపార ప్రయోజనాలకు ఇచ్చిన ఎనలేని ప్రాధాన్యం, కొత్త పాలకులతో సంప్రతింపుల బాధ్యతలు నిర్వర్తించే గ్రామ పెద్ద హోదాలో చోటు చేసుకున్న మార్పులు, తమ జీవితాలలో వలసపాలన తెస్తున్న మార్పులపట్ల ఆదివాసుల ప్రతిస్పందనలు మొదలైన అంశాలను ఆ థీసిస్ విపులంగా స్పృశించింది. పర్యావరణం, సమాజం, రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరిస్తూ మేధా చరిత్రపై కూడా తగు శ్రద్ధ చూపిన అధ్యయనమది. సింగ్‌భూమ్ గిరిజనులపై యూరోపియన్ అధికారుల, భారతీయ మానవ శాస్త్రవేత్తల మేధా కృషిని నిశితంగా విశ్లేషించింది.

ఈ యువ చరిత్రకారుని పరిశోధనా కృషిలో ఆరు విశిష్ట వైదుష్య లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది– జార్ఖండ్, విశాల భారత ప్రాంతాల ఆదివాసుల జీవనరీతులపై గతించిన కాలంలో విఖ్యాతులు, విస్మృతులు వెలయించిన రచనలపై సమగ్ర సాధికారత; రెండోది– విస్తృత శ్రేణి ప్రాథమిక ఆధారాలను కనుగొని, ఉపయోగించుకున్న సమర్థత. జాతీయ, రాష్ట్ర, జిల్లా ఆర్కైవ్‌లలో లభించే సమాచారాన్ని ఈ పరిశోధకుడు కూలంకషంగా అధ్యయనం చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అలాగే శతాధిక సంవత్సరాల క్రితం ప్రచురితమైన పుస్తకాలు, వ్యాసాలను కూడా విస్తృతంగా సంప్రతించాడు;

మూడోది– పరిశోధిస్తున్న ప్రాంతంలో క్షేత్ర కృషి ద్వారా అనుబంధ జ్ఞానాన్ని సముపార్జించేందుకు సుముఖత. ‘ఒక చరిత్రకారుడికి మందమైన నోట్‌బుక్‌తో పాటు మందమైన బూట్లు కూడా అవసరం’ అన్న ఫ్రెంచ్ చరిత్రకారుడు మార్క్ బ్లాచ్ (1866–1944) సూక్తిని ఈ యువ విద్వజ్ఞుడు మనసా, కర్మణా పాటించాడు (గతాన్ని సమగ్రంగా, విశ్వసనీయంగా అర్థం చేసుకోవడానికి ప్రపంచంలో కఠినమైన, ఆచరణాత్మక పని; శ్రద్ధాయుతమైన, కఠిన మేధో ప్రయత్నం రెండూ అవసరమని మార్క్ బ్లాచ్ ప్రవచించారు); నాల్గవది– తన వాదనలకు మద్దతుగా ప్రాథమిక ఆధారాల నుంచి స్ఫుటమైన, భావస్ఫోరకమైన ఉటంకింపులపై పరిపూర్ణ శ్రద్ధ పెట్టాడు; ఐదవది– తన విశ్లేషణాత్మక అధ్యయనాలను స్పష్టమైన, సూటియైన, ఆకర్షణీయమైన వచనంలో రాశాడు. ఎక్కడా ప్రత్యేక పరిభాషను ఎక్కువగా ఉపయోగించలేదు; ఆరవది– బహుళ దృక్కోణాలను అంగీకరించే వివరణాత్మక విశ్లేషణ. వాదనల సూక్ష్మ విస్తరణ ప్రశస్తంగా ఉన్నది. వలసపాలనాయుగ అధికారులు, వర్తమాన ఆదివాసీహక్కుల కార్యకర్తలలో సాధారణంగా ద్యోతకమవుతుండే గతానుగతిక భావాలను ఈ యువ పరిశోధకుడు పునరుక్తం చేయలేదు. నాటి వలస పాలకులకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన ఆదివాసీ తిరుగుబాట్లు, ప్రస్తుత కాలపు ఆందోళనలు, ఉద్యమాల మధ్య ఉన్న ఘటనాత్మక సామ్యాలు, సూత్రబద్ధమైన సంబంధాలపై ఆలోచనాత్మక విమర్శలు చేశాడు. తమ ప్రశాంత, సంప్రదాయబద్ధమైన జీవితాలలో ఆధునిక రాజ్య వ్యవస్థలు పురికొల్పిన అల్లకల్లోలానికి వ్యతిరేకంగా నాడు, నేడు ఆదివాసుల తిరుగుబాట్లను సుసంబంధంగా విశ్లేషించాడు. ఆసేతుహిమాచలం 500కు పైగా ఉన్న ఆదివాసీ సమూహాల జీవన రీతులలో విస్తారమైన వైవిధ్యాన్ని విస్మరించి సమస్త వనవాసీలను ఒక సజాతీయ సమాజంగా చిత్రించేందుకు గత కాలంలోనూ వర్తమానంలోనూ ప్రయత్నించిన రచనలలోని లోపాలను ఈ యువ మేధావి నిశితంగా విమర్శించాడు.

తమ జీవనావరణాలలోకి రాజ్య వ్యవస్థల చొరబాట్లను ఆదివాసీలు ప్రతిఘటించిన తీరుతెన్నులను, కొంత మంది ఆదివాసీ పెద్దలు సొంత తెగ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని పెంపొందించుకునేందుకు రాజ్యాధికారులతో కుమ్మక్కయిన వైనాలను ఈ చరిత్రకారుని సొంత పరిశోధన వివరించింది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గుణ విశేషాలు విస్తృతంగా ఉన్న ఈ థీసిస్‌లో లోపాలు, లొసుగులు లేకపోలేదు. తన అధ్యయనాలతో ప్రత్యక్ష సంబంధమున్న కొన్ని కీలక గౌణ ఆధారాలను సంప్రతించడాన్ని ఈ పరిశోధకుడు ఉపేక్షించాడు. భారతీయ మానవశాస్త్ర చరిత్రపై టీఎన్ మదన్ రచనలను ఉపయోగించుకోలేదు. జానపద గాథలు, మౌఖిక చరిత్రను మరింతగా ఉపయోగించుకుని ఉంటే పరిశోధన ఇంకా ప్రశస్తంగా ఉండేదని నేను భావిస్తున్నాను. ప్రాథమిక ఆధారాల నుంచి చేసిన ఉటంకింపులు కొన్ని సుదీర్ఘంగా ఉండి అసలు కథనాన్ని అనవసర ప్రాధాన్యాలకు మళ్లించాయి.

అయినప్పటికీ నేను చదివిన భారతీయుల డాక్టొరల్ థీసిస్‌లలో ఇది చాలా ప్రతిభావంతమైనది. పరిపూర్ణమైన పరిశోధన, సందేహం లేదు. ఇటువంటి ఉత్కృష్ట విద్వత్ ప్రమాణాలతో కూడిన థీసిస్ సాధారణంగా కొద్ది కాలంలోనే పుస్తకరూపంలో లోకం ముందుకు రావడం పరిపాటి. పర్యావరణ, సామాజిక చరిత్ర అధ్యయనంలో పథ నిర్దేశం చేసిన నందిని సుందర్ పుస్తకం ‘Subalterns and Sovereigns, మహేష్ రంగరాజన్ గ్రంథం ‘Fencing the Forest’ రెండిటి విషయంలోనూ థీసిస్ సమర్పణ, పుస్తక రూపంలో ప్రచురణకు మధ్య చాలా కొద్ది సంవత్సరాల వ్యవధి మాత్రమే ఉన్నది. ఇటీవలికాలంలో ప్రచురితమై, విశేష మేధా చర్చలకు ఆస్కారమైన భవానీ రామన్, ఆదిత్య బాలసుబ్రమణియన్, నిఖిల్ మేనన్, దిన్యార్ పటేల్‌ల చారిత్రక మోనోగ్రాఫ్‌లు కూడా డాక్టొరల్ థీసిస్‌గా ఆరంభమైనవే.

“ డాక్టర్ ఉమర్ ఖలీద్‌ను నేను ఎప్పుడూ కలుసుకోలేదు. ఆయనతో ఎన్నడూ సంభాషించలేదు. డిసెంబర్ 2019లో ఒక రోజున ఇరువురమూ, ఒక వివక్షాపూరిత చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నాము– ఆయన ఢిల్లీలో, నేను బెంగళూరులో. మా జీవన ప్రస్థానాలు భిన్న పథాలలో ఉండడం పట్ల, అందుకు కారణాల విషయమై నేను అప్పుడప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నా పరిశోధనా కృషి, రచనా వ్యాసంగం నిరాటంకంగా కొనసాగడానికి, ఉమర్ కొనసాగించలేకపోవడానికి కారణం నా మొదటి పేరు ఉమర్ కాకుండా, రామచంద్ర కావడమేనా?

ప్రస్తావిత పుస్తకాలు అన్నీ విద్వత్ ప్రపంచంలో విస్తృత అధ్యయనానికి నోచుకున్నాయి. మేధా చర్చలకు ప్రేరణ అయ్యాయి. నేను విపులంగా చర్చిస్తున్న థీసిస్ కూడా పుస్తక రూపంలో ప్రచురితమైతే నందినీ సుందర్, మహేశ్ రంగరాజన్ తదితరుల పుస్తకాల వలే విశేష ప్రశంసలకు పాత్రమవుతుందనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. విషాదమేమిటంటే నేను పేర్కొన్న థీసిస్ 2018లోనే న్యూఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి సమర్పించడం జరిగింది. అయితే అది ఇప్పటికీ పుస్తక రూపం పొందలేదు. ఎందుకని? ఆ పరిశోధకుడి పేరు ఉమర్ ఖలీద్ కావడమే, సందేహం లేదు. క్రూర రాజ్యవ్యవస్థకు సంకోచించే న్యాయవ్యవస్థ తోడవడంతో ప్రతిభావంతుడైన ఆ యువ చరిత్రకారుడు (నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి) ఐదు సంవత్సరాలకు పైగా కారాగారంలో కునారిల్లుతున్నాడు. బెయిల్ మంజూరు చేయకపోవడమే కాదు. అసలు అతడిపై ఎటువంటి ప్రాథమిక అభియోగాలు కూడా మోపకుండా ఆ చైతన్యశీల చింతనాపరుడిని జైలు నిర్బంధంలో కొనసాగిస్తున్నారు!

డాక్టర్ ఉమర్ ఖలీద్‌ను నేను ఎప్పుడూ కలుసుకోలేదు. ఆయనతో ఎన్నడూ సంభాషించలేదు. అయితే డిసెంబర్ 2019లో ఒక రోజున ఇరువురమూ ఒక వివక్షాపూరిత చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నాము– ఆయన ఢిల్లీలో, నేను బెంగళూరులో. మా జీవన ప్రస్థానాలు భిన్న పథాలలో ఉండడం పట్ల, అందుకు కారణాల విషయమై నేను అప్పుడప్పుడూ ఆశ్చర్యపోతుంటాను. నా పరిశోధనా కృషి, రచనా వ్యాసంగం నిరాటంకంగా కొనసాగడానికి, ఉమర్ కొనసాగించలేకపోవడానికి కారణం నా మొదటి పేరు ఉమర్ కాకుండా, రామచంద్ర కావడమేనా?

స్వయంగా ఆధునిక భారతదేశ చరిత్రకారుడిని అయినందున ఈ కాలమ్‌లో డాక్టర్ ఉమర్ ఖలీద్ గురించి తెలియజేశాను. ఆయన విద్వత్ కృషి లోతు, విశాలత, ఉత్కృష్టతను అర్థం చేసుకుని ప్రశంసించగల స్థాయిలో ఉన్నందునే నేనీ వ్యాసాన్ని రాశాను. కాగా ఈ కాలమ్‌ను ముగిస్తూ నా మనసులోని మాటను చెప్పదలిచాను. తమ రాజకీయ యజమానుల ఆదేశాల మేరకు పోలీసులు ముందూ వెనుక చూడకుండా ఆలోచనారహితంగా మోపిన అవిశ్వసనీయ ఆరోపణలతో కారాగారాలలో కృశిస్తున్న అనేక మంది ఉత్తమ వ్యక్తులు, మానవీయ మేధాశీలురుల్లో డాక్టర్ ఉమర్ ఖలీద్ ఒకరు. ఈ భారతీయులలో కొంత మంది తమ తమ అధ్యయన క్షేత్రాలలో వినూత్న భావ పథాలను నిర్మించిన ఉత్కృష్టులు. తమ వ్యక్తిగత జీవితాలలోను, ఎంచుకున్న కార్యరంగంలోను అహింసా పద్ధతులకు, భారత రాజ్యాంగ సంస్థాపక విలువలకు సంపూర్ణంగా నిబద్ధమైన పలువురు సామాజిక సేవకుల, పౌర సమాజ క్రియాశీలుర జీవితాలు కూడా రాజ్య క్రౌర్యాన్ని చవిచూస్తున్నాయి. బహుళత్వ వాదం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నందునే వారు నిరంకుశ పాలకులతో విభేదించి జైళ్లపాలయ్యారు. అటువంటి ఉదాత్తులు ఇంకా ఎంతో మంది వివిధ సమస్యల నెదుర్కొంటున్నారు. తోటి భారతీయులు అయిన ఈ సజ్జనులు, ముఖ్యంగా యువ మేధావులు మన గణతంత్ర రాజ్య సమున్నతికి అనితరసాధ్యమైన సేవలు అందించగల మంచి వయసులో ఉన్న కాలంలో చీకటి గుయ్యారాలు, మురికి కూపాలు, ఆరోగ్యకరం కాని పరిస్థితులకు నెలవులు అయిన కారాగారాలలో మగ్గిపోవలసిరావడం మానవతకు మచ్చ కాదా? ఇది దేశానికి మేలు చేస్తుందా? ఇప్పటికే చాలా సమయం మించిపోయింది. ఇంతవరకు నిరాకరిస్తూ వస్తోన్న న్యాయాన్ని ఆ మానవీయులకు సమకూర్చేందుకు మన న్యాయమూర్తులు ఇప్పటికైనా సాహసించాలి. సమాజ జీవితంలో సముదాత్త విలువలను పరిమళింపచేయాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

‘వలస బతుకు’ ఆవిష్కరణ సభ

కుతుబ్‌షాహీల కాలంలో హైదరాబాద్ నిర్మాణానికి మొదలైన వలసలు ఈనాటికీ కొనసాగుతున్నాయి. రైలు మార్గాల నిర్మాణ కాలం నుంచి మన ప్రాంత వలస కూలీలు పాలమూరు లేబరుగా ప్రసిద్ధమయ్యారు. లక్షలాది వలస కూలీలు తరతరాలుగా కష్టపడి దేశం నిర్మించారు. కానీ తమ జీవితాలను గౌరవప్రదమైన, సుఖవంతమైన జీవితాలుగా నిర్మించుకోలేకపోయారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పాలన చెలాయిస్తున్న పాలకులు, ప్రభుత్వాలు వచ్చిన తరువాత కూడా వలసలు ఆగలేదు. వలస జీవితాలు మారలేదు. ఈ జిల్లాలో లెక్కకు మిక్కిలిగా కవులు, రచయితలున్నా జిల్లా వలసల మీద ఒక్క నవలా రాలేదు. లక్షలాది కూలీలలో ఒక్కడు మరికల్ నర్సన్న తన వలస బతుకు రాశాడు. మిత్రుల కోరిక మేరకు తన వలస జీవితం ఏకబిగిన రాశాడు. తల్లిదండ్రులను, పిల్లలను, కుటుంబాన్ని ప్రేమించి రెక్కలు దాచుకోకుండా కష్టపడ్డాడు. ఏదీ దాచుకోకుండా రాశాడు. ఇప్పుడు ఆయన లేడు. ‘వలస బతుకు–నర్సన్న’ పుస్తకావిష్కరణ సభ రేపు ఉదయం 10 గంటలకు నారాయణపేట జిల్లా మరికల్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవిష్కర్త. పరకాల ప్రభాకర్, ప్రొ. జి. హరగోపాల్, గోరటి వెంకన్న, ఎం.రాఘవాచారి, డి.జి. హైమవతి, ఎండి ఇక్బాల్ పాష, ఎ. తిమ్మప్ప, ఎం. వెంకట్రాములు, ఎం. సుదర్శన్, ఎం. నారాయణ పాల్గొంటారు.

– పాలమూరు అధ్యయన వేదిక

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆత్మగౌరవ దండోరా సభ

నూట నలభై రెండు కోట్ల ప్రజలున్న దేశంలో సర్వోన్నత న్యాయాధిపతి తన సింహాసనం మీద కూర్చుని వాదోపవాదాలు వింటున్న సమయం అది. నిండు కోర్టులో కట్టుదిట్టమైన భద్రత ఉన్న చోటు అది. ఆ న్యాయాధిపతిపై బూటు విసరడమనే జుగుప్సాకరమైన దాడి ఎందుకు జరిగింది? దీనికి ప్రేరేపించిన కళంకాయనులు ఎవరనేది ప్రపంచానికి తెలిసిపోయింది. ఆ చర్యకు పాల్పడిన వ్యక్తి సమాధానం అలాంటిది. అంతేకాదు, అది ఆ వ్యవస్థ సమాధానం కూడా. న్యాయాన్ని న్యాయంగా చూడలేని ఒక అన్యాయాల పునాది మీద విలసిల్లుతున్న భావజాలం అది. వీరి అనాగరిక చర్యలకు సర్వోన్నత న్యాయస్థానానికి సైతం మినహాయింపు లేదనటానికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుంది?

మనది కాని నేలమీద పడి బతుకుతున్నామనే అగౌరవాన్ని సంకేతాలుగా పంపదలుచుకున్న అసహన వ్యవస్థ అప్రజాస్వామిక దాడి అది. ఒక వ్యక్తి చర్య ఏ మాత్రం కాదు. అది వ్యవస్థీకృత నియంతృత్వం, దాని పాలన పెంచి పోషిస్తున్న సనాతనవాద ప్రభావం. దానికి పౌర సమాజాన్ని గౌరవించే సహనం ఉండదు. రాజ్యాంగాన్ని గౌరవించే మనసు ఉండదు. మత వైరుధ్యం కుల రాక్షసత్వం నరనరానా నింపుకుని అసమ సమాజ నిర్మాణానికి అనునిత్యం వెంపర్లాడుతుంటుంది. అందుకని న్యాయం అందరిదిగా ఉండడానికి కూడా ఒప్పుకోదు ఈ ధర్మం.

ఈ దాడి విషయంలో చట్టం తన పని తాను చేయటానికి నిరాకరించటం దగ్గరే అసలు కథ మొదలవుతుంది. పౌర సమాజం ఆలోచించటానికి కారణం కూడా అయింది. సుప్రీంకోర్టు జడ్జి అంటే రాజ్యాంగం ప్రతిబింబించే ఈ దేశ స్ఫూర్తి. అలాంటి వ్యక్తి మీద దాడి జరగటం అంటే రాజ్యాంగం మీద దాడి జరగడమే. ఇంత జరిగినా ఈ దేశ పాలనా వ్యవస్థకు చీమ కుట్టినట్టు కూడా లేదు. ఆ స్థానంలో దళిత సీజేఐ కాకుండా అగ్రహారం నుంచి వచ్చిన సీజేఐ అయితే పరిస్థితులు ఇలా ఉంటాయా? అనే ప్రశ్న దళిత సమాజాన్ని ఆవేదనకు గురిచేసింది.

రాజ్యాంగమే సుప్రీం గనుక ఆ వ్యవస్థ మీద దాడి జరిగినప్పుడు బాధ్యత వహిస్తూ న్యాయశాఖ మంత్రి రాజీనామా చేయాలి కదా! భద్రతా వైఫల్యమయితే శాఖాపరమైన చర్యలు ఏమి తీసుకున్నారో తెలియదు. రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే పరిమితమైనవి గనుక రాజకీయ పార్టీలు అందుకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి. ఆయన దళితుడు గనుక, వాటి నుంచి ఇంతకన్నా ఆశించలేం.

దేశం తలవంచుకునే ఘటన... ఈ దాడి. ఇది అక్టోబర్ 6న జరిగినా, నేటికీ న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు నమోదు చేయకపోవడంలో ఆంతర్యం తెలియంది కాదు. హేయమైన ఈ దాడిని దేశమంతా ఖండించింది. ‘ఇటువంటి ఘటనలు నన్ను ప్రభావితం చేయలేవు’ అన్న సీజేఐ మాటలు విని క్షమించి వదిలివేయాల్సిన దాడి కాదు ఇది. చెప్పిందల్లా చెయ్యకపోతే ఇలాంటి దాడులు చేస్తామనే భావదారిద్ర్యం నుంచి రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత పౌర సమాజం మీద ఉన్నది.

సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ‘మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి’ ఇరవై ఐదు రోజులుగా ఉద్యమం చేస్తున్నది. ఈ పోరాటంలో భాగంగా నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఈ ప్రదర్శన రాజ్యాంగ పరిరక్షణ కోసం, దళితుల ఆత్మగౌరవం కోసం జరుగుతున్నది. దళితుల ఆత్మగౌరవ దండోరా ప్రదర్శనలో పాల్గొనడం ప్రజాస్వామికవాదులుగా మనందరి బాధ్యత.

• డప్పోల్ల రమేశ్

అమృతలత పురస్కారాల ప్రదానం

అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు, ఇందూరు అపురూప అవార్డ్స్–2024–25 ప్రదానోత్సవం నవంబరు 2 (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ మామిడిపల్లిలోని శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో జరుగుతుంది. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ సి. మృణాళిని, విశిష్ట అతిథిగా వి. ప్రతిమ, సభాధ్యక్షురాలుగా నెల్లుట్ల రమాదేవి పాల్గొంటారు. అమృతలత జీవన సాఫల్య పురస్కారాన్ని 2024కి గాను కథ, నవల విభాగంలో వసుంధర, శాంతినారాయణ; జర్నలిజం విభాగంలో వల్లీశ్వర్; 2025కి గాను అనువాదం విభాగంలో నలిమెల భాస్కర్, కవిత్వ విభాగంలో జి. వెంకటకృష్ణ, కథ/నవల విభాగంలో పెద్దింటి అశోక్ కుమార్ స్వీకరిస్తారు. సాహితీవేత్తలకు, వివిధ రంగాలకు చెందిన వారికి ఇచ్చే ఇందూరు అపురూప అవార్డులను 2024కి గాను సూరం శంకర్ (గజల్), పంచరెడ్డి లక్ష్మణ్ (కవిత్వం), స్వయంప్రకాశ్ (సంపాదకత్వం), ఎన్. విజయాకిషన్‌రెడ్డి (కవిత్వం), కుసుమలతారెడ్డి (పర్యావరణం); 2025కి గాను వసంతా వివేక్ (బహుముఖ ప్రజ్ఞ), వి. నర్సింహారెడ్డి (ఆధ్యాత్మిక సాహిత్యం), పి. సుజాత (బోధనారంగం), సుశీలా శర్మ (క్రీడలు/నాట్యం), బోచర్కర్ ఓంప్రకాశ్ (అవధానం) అందుకుంటారు. వివరాలకు: 98488 68068.

– అమృతలత

మత్తడి దూకుతున్న పాకాల



- వివరాలు 7లో



పోతననగర్‌లో బురదలో నడుస్తున్న సీఎం



అంబేద్కర్‌భవన్ రోడ్ సమ్మయ్యనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఓదార్చుతూ.. భరోసానిస్తూ..

నగరంలోని ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సుడిగాలి పర్యటన

- మొంథా తుఫాను బాధితులతో మమేకం
- ఏం జరిగిందంటూ ఆరా
- సావధానంగా వారి గోడు ఆలకింపు
- ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ
- గోడు వెళ్లబోసుకున్న పలువురు మహిళలు
- వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తక్షణ సహాయానికి అక్కడిక్కడే ఆదేశాలు
- నగరంలో రెండు గంటల పాటు సాగిన పర్యటన

హనుమకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం వరంగల్ నగరంలో సుడిగాలి పర్యటన జరిపారు. మొంథా తుఫాను వల్ల కురిసిన భారీ, అతి భారీ వర్షాలకు వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజల కష్టాలను, నష్టాలను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. వారితో ముచ్చటించారు. ఆవేదనలు, ఆక్రందనలు, కన్నీటిధారలు, నిస్సహాయత గోడులు, రెండు చేతులు జోడించి ఆదుకోండయ్యా.. అంటూ ఆర్థింపులు ముఖ్యమంత్రి పర్యటనలో ఆద్యంతం కనిపించిన కన్నీటి దృశ్యాలు. నగరంలోని సమ్మయ్యనగర్, కాపువాడ, పోతననగర్ ప్రాంతాల్లో సీఎం రాకకోసం ఎన్నో గంటల ముందే బాధలతో బరువెక్కిన గుండెలతో ఎదురుచూశారు. వరదతాకిడికి దెబ్బతిన్న తమ ఇళ్ల ముందు వేచి ఉన్న బాధితులు, ముఖ్యంగా మహిళలు సీఎంను చూడగానే ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. కన్నీటి పర్యంతం అయ్యారు. సీఎం దగ్గరగా వెళ్లి తమ బాధలను చెప్పుకునేందుకు ప్రయత్నించారు. మరికొంత మంది ఏకంగా కాళ్లమీద పడబోయారు. వారందరినీ రేవంత్ రెడ్డి వారించి పరామర్శించారు. అధైర్యపడకండి.. నేనున్నాను.. మీమ్మల్ని ఆదుకుంటాను.. అని భరోసా ఇచ్చారు.

తొలుత ఏరియల్ సర్వే అనంతరం సీఎం నేరుగా హనుమకొండలోని సమ్మయ్యనగర్ ముంపు ప్రాంతానికి వెళ్లారు. కారులో అక్కడికి చేరుకోగానే అప్పటివరకు ఆతృతతో ఎదురుచూస్తున్న బాధితులు ఆయనను చుట్టుముట్టారు. వరద బీభత్సం వల్ల తాము పడ్డ కష్టాలను ఏకరువు పెట్టారు. సీఎం ఆ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లను, కూలిపోయిన ఇళ్లను చూశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఇద్దరు వరద బాధితులు ఇళ్లలోకి వెళ్లారు. సలేంద్ర రమాదేవి ఇంటిలోకి వెళ్లి ఇంటి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారు. ఏం జరిగిందని అడిగి



సమ్మయ్యనగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఎం

తెలుసుకున్నారు.. 'అయ్యా... కుండపోతగా కురిసిన వర్షానికి తన ఇంట్లో వరదనీరు చొచ్చుకువచ్చిది.. సామానులన్నీ తడిసిపోయాయి. కొన్ని వస్తువులు వరదల్లో కొట్టుకుపోయాయి. రాత్రంత జాగరణ చేశాం. తినడానికి తిండి, తాగడానికి మంచి నీళ్ల లేక విలవిలాడిపోయాం.' అంటూ ఆ మహిళ కన్నీటితో బాధనంతా చెప్పుకొచ్చింది. 'ఏడ్వకమ్మా.. నీకు తప్పక సాయం అందుతుంది. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా..' అని సీఎం హామీ ఇచ్చారు. ఆ తర్వాత పక్కనే ఉన్న డబ్బాల లత అనే మరో మహిళ ఇంట్లోకి వెళ్లి చూడగా ఆ ఇంట్లో ఇంకా వరద నీరు నిలిచి ఉండడంతో చలించిపోయారు. సీఎంను చూడగానే ఆ మహిళ బోరున విలపించింది.

వరదలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామంటూ గోడు వెళ్లబోసుకున్నది. వరదనీరు ఇంటిలోకి చొచ్చుకురావడంతో తన రేకుల ఇళ్లు కూలిపోయే ట్టు ఉన్నదని ఇంటి స్వరూపాన్ని చూపించింది. ఆమె ఆవేదనను విన్న సీఎం.. బాధపడకమ్మా.. తప్పక ఆదుకుం టాం.. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కాగా, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇంత వరద బీభత్సం జరిగినట్టు స్థానికులు సీఎంకు ఫిర్యాదు చేశారు. గోపాల్‌పూర్ చెరువు టన్నెల్ గేట్లను ఎత్తివేయడంలో ఐబీ అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల చెరువు పొంగి వరదనీరు (మిగతా 7వ పేజీలో)

జెట్ స్పీడ్‌తో సాగిన పర్యటన

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలో గడిపిన సీఎం

వరంగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన గంట ఆలస్యంగా మొదలైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.15 గంటలకు ఏరియల్ సర్వే నిర్వహించాల్సి ఉండగా, మధ్యాహ్నం 2.20గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి 20 నిమిషాలు హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు వరంగల్ నగరాన్ని, పరిసర ప్రాంతాలను హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీకి చేరుకున్న సీఎంకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా హనుమకొండ సమ్మయ్య నగర్‌లో వరద ముంపుకు గురైన ప్రాంతాలను సందర్శించారు. మధ్యాహ్నం 3.35 గంటలకు కాపువాడలో పర్యటించి వరద ముంపు బాధితులను పరామర్శించి వారి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పక్కనే ఉన్న పోతననగర్ ప్రాంతాన్ని, పోతననగర్ నాలాలను పరిశీలించారు. ముంపుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 4.18 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

అక్కడి నుంచి కలెక్టరేట్ లోపలికి వెళ్లిన సీఎం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్థంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్‌వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం 4.25గంటల నుంచి 5.15గంటల వరకు ఏడు జిల్లాల కలెక్టర్లతో వరద నష్టాలపై సమీక్షించారు. అధికారుల నిర్లక్ష్యంపై సున్నితంగా హెచ్చరిస్తూనే.. ప్రజలకు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. వరద బాధితులకు భరోసా ఇస్తూ ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సాయంత్రం 5.32గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణం అయ్యారు.

డీఈవో వాసంతిపై వేటు

- అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం చర్య
- ఎఫ్ఏసీ డీఈవోగా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి
- వాసంతికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని డీఎస్ఈ



డి.వాసంతి



ఎ.వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ డీఈవో డి.వాసంతిని ఆ పోస్టు నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. డిప్యూటీ ఈవో అయిన వాసంతి ఎఫ్ఏసీ హోదాలతో డీఈవోగా పనిచేస్తున్నారు. ఆమెపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వమే నేరుగా చర్యలు తీసుకుందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆమె డిప్యూటీ ఈవోగా ఉన్న సమయంలో సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి స్థలం విషయంలో చేసిన తప్పునకు గత ఏడాది రెండు ఇంక్రిమెంట్ల కోత విధిస్తూ విద్యాశాఖ చర్యలు తీసుకుంది. అలాగే ఆమెపై ఉపాధ్యాయులు, విద్యాశాఖలోని వివిధవర్గాల నుంచి ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం నిఘావర్గాల నివేదిక ఆధారంగా డీఈవో పోస్టు నుంచి తొగించినట్టు ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. విద్యాశాఖ వెలువరిచిన ఉత్తర్వుల్లో వాసంతిని ఎక్కడికి పంపించింది స్పష్టత ఇవ్వలేదు. కాగా, అక్రమాల్లో కూరుకున్న వాసంతిని నాన్‌ఫోకల్ పోస్టులైన హనుమకొండ పెట్రోల్ పంపు హైస్కూల్ హెడ్మాస్టర్, లేదంటే ప్రభుత్వ డైట్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్, బీఈడీ కాలేజీ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమించే అవకాశం ఉందని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. ఎఫ్ఏసీ డీఈవో పోస్టు నుంచి ఉద్వాసన పలికేందుకు ప్రభుత్వమే జీవో జారీ చేయడం ఉమ్మడి జిల్లాలో ఇదే ప్రప్రథమం అని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

- ప్రభుత్వ వైఫల్యంతో తీవ్ర నష్టం
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

దామెర, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొంథా తఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షంతో నీట మునిగిన వరి, పత్తి, క్యాబేజీ తదితర పంటలను నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నేత, మ ల్కాజ్‌గిరిఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షంతో నీట మునిగిన వరి, పత్తి, క్యాబేజీ తదితర పంటలను ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నేతలు, రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ.. తుఫాన్ భయంకరంగా ఉండబోతుందంటూ... వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అంతేకాకుండా ఎక్కడా కూడా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయలేదని, ప్రజలను కూడా హెచ్చరించలేదని విమర్శించారు.

మొంథా తుఫాన్‌తో కేవలం పంటలు నీట మునగడమే కాకుండా వ్యవసాయ భూములు కూడా కోతకు గురయ్యా యని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి పంటను సుమారు 50లక్షల హెక్టార్లలో వేసి ఉంటారని తెలిపారు. కాగా, కేంద్ర



ఊరుగొండలో వర్షంతో నేల వాలిన వరి పంటను పరిశీలిస్తున్న ఈటల రాజేందర్

ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు వర్తింప చేస్తే మేలు జరిగేదని గుర్తు చేశారు. వర్షాలకు తడిచిన పత్తి పంటతో పాటు వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొను గోలు చేయాలని తెలిపారు. పంట నష్టంపై ప్రభుత్వం సత్వరమే సర్వే చేయించి, నష్ట పరిహారం చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, మాజీ ఎంపీ సీతారాంనాయక్, కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు వీసం రమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొడాల మధుకర్, రైతులు బొల్లు రాజిరెడ్డి, బూర్గుల రాంచందర్‌రావు, గోగుల రాజిరెడ్డి, ఉప్పుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట షాదం

- రిసెప్షన్‌కు వెళ్లి వస్తుండగా పెళ్లి బృందం జీపును ఢీకొట్టిన లారీ
- ముగ్గురి మృతి, 10 మందికి గాయాలు
- గాయపడిన వారిలో వధువు తల్లిదండ్రులు సైతం.. • వధూవరులు క్షేమం
- భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో ఘటన
- బాధితులు మహబూబాబాద్ జిల్లావాసులు
- క్షతగాత్రులకు ఎంజీఎంలో చికిత్స
- పరామర్శించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

7



స్వప్న(ఫైల్)



శ్రీనాథ్ (ఫైల్)

నిట్‌లో ఆధునిక హంగులతో థియేటర్

- సకల సౌకర్యాలతో కొత్త క్యాంటీన్
- శంకుస్థాపన చేసిన డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో అత్యాధునిక ఓపెన్ ఎయిర్ యాంఫి థియేటర్ నిర్మాణానికి శుక్రవారం డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి శంకుస్థాపన చేశారు. దీనితో పాటు నిట్ ఆవరణలో కొత్త క్యాంటీన్ నిర్మాణానికి కూడా పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. సీపీడబ్ల్యూడీ ద్వారా అమలు చేస్తున్న ఈ యాంఫి థియేటర్ ప్రాజెక్టు నిట్‌లో సాంస్కృతిక, మౌలిక వసతుల రంగంలో మైలురాయిగా నిలుస్తుందన్నారు. సుమారు రూ.24.40కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ థియేటర్ పనులను 18 నెలల్లో పూర్తి చేస్తారు. ఇందులో 2500 మంది కూర్చునే సామర్థ్యంతో పాటు రెండు ఆర్ట్ గ్యాలరీలు. ఒక మల్టీపర్పస్ హాల్ కూడా ఉంటుంది. సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యాకార్యక్రమాలు, కమ్యూనిటీ సమావేశాలకు అనువైన వేదికగా దీనిని నిర్మిస్తారు.

కొత్త క్యాంటీన్

వరంగల్ నిట్ ఆవరణలో కొత్త క్యాంటీన్ నిర్మాణానికి కూడా డైరెక్టర్‌పునాది రాయి వేశారు. సీపీడబ్ల్యూడీ ద్వారా రూ.6.11కోట్ల అంచనా వ్యయంతో 11 నెలల్లో దీనిని నిర్మిస్తారు. ఇందులో 350 సీట్లతో కూడిన డైనింగ్‌హాల్, ఆధునిక వంటగది ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సందర్శకులకు సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన భోజన వాతావరణాన్ని ఈ క్యాంటీన్ అందిస్తుంది.

ప్రాణాలు తీసిన ట్రాక్టర్ బోల్టు

- ఒకే తండాకు చెందిన ఇద్దరు కూలీల దుర్మరణం
- మొక్కజొన్న మిషన్ తీసుకెళ్తుండగా ఘటన



బానోతు హర్లా, రాములు

పర్వతగిరి, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని పంచరాయి తండా లో విషాదం చోటు చేసుకుంది. జీవ నోపాధి కోసం పని చేసే ఇద్దరు గిరిజ న కూలీలు ప్రమాదవ శాత్తు దుర్మ రణం పాలయ్యారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... పర్వత గిరి మండలంలోని పంచరాయి తండాకు చెందిన బానోతు రాములు(57), బానోతు హర్లా(48) శుక్రవారం తమ తండాలోని ప్రవీణ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌పై మొక్కజొన్న మిషన్‌తో ఏనుగల్లు ప్రాంతానికి పనికి వెళ్తున్నారు. మొదట ఏనుగల్లులో పనిచేసి, అక్కడి నుంచి మల్యా తండాకు శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వెళ్తుండగా ట్రాక్టర్‌కు మిషన్ ట్రాలీని తగిలించారు. మిషన్‌పై కూలీలు ఇద్దరు కూర్చొని వెళ్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్‌కు తగిలించిన మిషన్ బోల్టు ఊడిపోయింది. దీంతో ఇద్దరు కింద పడిపోగా బానోతు హర్లా అక్కడికక్కడే మృతిచెందాడు. రాములుకు తీవ్ర గాయాలు కాగా, అంబులెన్సులో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒకే తండాకు చెందిన ఇద్దరు గిరిజన కూలీలు మృతి చెందడంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దుర్ఘటకు ట్రాక్టర్ డ్రైవర్ ప్రవీణ్ నిర్లక్ష్యం కారణమని మృతుడు రాములు కుమారుడు బానోతు రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, జరిగిన ఘటనపై పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంజీఎంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు.

గల్లంతైన శ్రావ్య మృతదేహం లభ్యం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే
- అన్ని విధాలా ఆదుకుంటామని హామీ

7

సీఎంను కలిసిన కమిషనర్, మేయర్



ముఖ్యమంత్రికి పూల మొక్కను అందిస్తున్న కమిషనర్, మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వరంగల్ నగరంలో దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి సమీక్షా సమావేశం నిర్వహించేదుకు శుక్రవారం వరంగల్ నగరానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, మే యర్ గుండు సుధారాణి కలిసి పూల మొక్కలను అందించారు. మధ్యాహ్నం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ కళాశాల మైదానంలో హెలికాప్టర్‌లో దిగిన ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

తుఫాన్‌తో రూ.10కోట్ల నష్టం

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

● ముంపు సబ్‌స్టేషన్లను సందర్శించిన సీఎండీ



గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ

రాంనగర్, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.10కోట్ల నష్టం వాటిల్లిందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు నీట మునిగిన 249 ట్రాన్స్‌ఫార్మర్లలో 246 సరిచేశామని, మునిగిన 8 సబ్‌స్టేషన్‌లలో 6 సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు. మిగతా 2 సబ్‌స్టేషన్‌లకు ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ సరఫరా అందజేశామన్నారు. మరమ్మతులకు గురైన 33 కేవీ ఫీడర్లు, 116, 11 కేవీ ఫీడర్లను పునరుద్ధరించామన్నారు. 428 స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. కాగా, మరమ్మతుల చేస్తున్న ప్రాంతాలను సీఎండీ శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. యాదవనగర్, గోపాల్‌పూర్, కాపువాడ, 100ఫీట్ల రోడ్డులోని ప్రగతినగర్‌ను పరిశీలించారు. సీఎండీ వెంట ఆపరేషన్ డైరెక్టర్ మధుసూదన్, ఎస్ఈ మధుసూదన్ రావు, డీఈ సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విజిలెన్స్ వారోత్సవాల వాక్‌థాన్

విజిలెన్స్ అడిసినల్ ఎస్పీ శ్రీనివాసరావు

వరంగల్ క్రైం, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6గంటలకు జేఎన్ఎస్ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వాక్‌థాన్ కార్యక్రమం ఉంటుందని విజిలెన్స్ అడిషినల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 2 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో టీజీఎస్ఆర్టీసీ, ట్రాన్స్‌కో, కేటీపీఎస్, సివిల్ సప్లయ్, జీడబ్ల్యూఎంసీ, అటవీశాఖ, డీసీసీబీ, ఎస్బీఐ, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, ఏసీజీవీటీ, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లోని విజిలెన్స్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడిషినల్ ఎస్పీ శ్రీనువాస్‌రావు మాట్లాడుతూ.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఏర్పడటానికి గల కారణాలను వివరించారు. ప్రభుత్వ పథకాల తీరుతోపాటు ప్రభుత్వ నిధలు దుర్వినియోగంపై ప్రభుత్వానికి విజిలెన్స్ శాఖ నివేదిక సమర్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బీభత్సాన్ని పరిశీలించేందుకు శుక్రవారం హనుమకొండకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాష్ట్ర పర్యావరణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రత్యేక వాహనంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ, ఎమ్మెల్యేలు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లారు.

ఫొటోగ్యాలరీని పరిశీలించిన సీఎం

మొంథా తుఫాన్ వల్ల సంభవించిన బీభత్సానికి సంబంధించిన ఫొటోలు కలెక్టరేట్‌లో ఫొటో గ్యాలరీగా ఏర్పాటు చేయగా సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. వర్షానికి నేలమట్టమైన పంటలు, రైతులు పంటలను చూస్తూ కన్నీరు పెడుతున్న ఫొటోలు, ధ్వంసమైన రోడ్ల ఫొటోలు సీఎం ఆసక్తిగా తిలకించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించడానికి కలెక్టరేట్‌కు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి సాయుధ పోలీస్ బలగాలు గౌరవ వందనం చేశాయి. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం సీఎం సమీక్షలో పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో తోపులాట

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటనలో భాగంగా శుక్రవారం సమ్మయ్యనగర్‌లోని పలు కాలనీలను మంత్రులతో కలిసి సందర్శించారు. ఈ పర్యటనలో స్థానికులు వినతిపత్రాలు తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వస్తుండగా సీఎం సెక్యూరిటీ సిబ్బంది నెట్టివేయడంతో స్వల్పంగా తోపులాట చోటు చేసుకుంది. వరద ముంపుతో పలు కాలనీలకు చెందిన బాధితులు పెద్దఎత్తున రేవంత్‌రెడ్డి వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న పోలీసులు, సీఎం స్పెషల్ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్థానికులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. తుఫాన్ ప్రభావంతో నిలువ నీడలేక సర్వం కోల్పోయిన తమకు సీఎంను కలిసి తమ గోడు వెళ్లబోసుకుందామంటే సిబ్బంది, పోలీసులు అడ్డుకుంటున్నారని వాపోయారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టడంతో పర్యటన ప్రశాంతంగా ముగిసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం రాక సందర్భంగా ముందస్తు అరెస్టులు

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీడం రాజ్‌కిషోర్, కొడకండ్ల సదాంత్, ఇజ్జగిరి భీంరాజ్‌లను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. పర్యటన అనంతరం విడిచిపెట్టారు.

సీఎంకు వినతి పత్రం..

పోతననగర్ ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా 29వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గట్టు చందు, తాళ్లపెల్లి రమేష్, ఇతర నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. భారీ వర్షాలతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని, నగరంలో వరద బాధితులకు రూ.50వేలు తక్షణ సహాయం అందించాలని కోరారు.

పరిహారం ఇప్పించండి

ఇన్నర్ రింగ్ రోడ్డు బాధితుల గోడు

సీఎంను కలిసి వినతి పత్రం అందజేత

హనుమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో 200 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు బాధితులు సీఎంను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వరంగల్ ఇన్నర్‌రింగ్ రోడ్డు 200 ఫీట్ల భూబాధితుల సమాఖ్య ప్రతినిధులు అధ్యక్షుడు గంగుల దయాకర్, సహాయ కార్యదర్శి ఎం.డి. రియాజొద్దిన్ నేతృత్వంలో బాధితులు ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన సీఎంను హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కింద కోల్పోయిన భూమి సర్వే నెంబర్ మిస్ అయిన బాధితులకు నష్టపరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, ఈదృష్ట్యా ఈ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. తరతరాలుగా వారసత్వం వస్తున్న భూమి రైతుల ఆధీనం ఉన్నప్పటికీ వారికి కూడా పరిహారం ఇవ్వడం లేదని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈరోడ్డు నిర్మాణంలో కోల్పోయిన సాదాబైనామా భూముల యజమానుల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. నోటరీ పేపర్‌తో ఉన్న వారిలో కొందరు కూడా ఈ రోడ్డు కింద భూములను కోల్పోయారని వారికి కూడా పరిహారం ఇప్పించాలని అర్థించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఇందిరాగాంధీ, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న నేతలు

హనుమకొండ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ సేవలను కొనియాడారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సేవలను కీర్తించారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత



మాట్లాడుతున్న కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత

వరంగల్ మెడికల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సూచించారు. శుక్రవారం హనుమకొండ పట్టణ పరిధిలో ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్యను అడిగి తెలుసుకున్నారు. సమ్మయ్య నగర్, లష్కర్ సింగారంలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి మందుల లభ్యత, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డాక్టర్ మంజుల, డాక్టర్ హైదర్, సీడీపీవో విశ్వజ తదితరులు పాల్గొన్నారు.



జీవాంజీ దీప్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఎమ్మెల్యే నాగరాజును కలిసిన దీప్తి

పర్వతగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన వర్డ్స్ వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో 200, 400ల పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు సాధించిన జీవాంజీ దీప్తి శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హనుమకొండలోని ఆయన నివాసంలో దీప్తి తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మిలతో పాటు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం తరపున రెండు స్వర్ణ పతకాలు సాధించి దేశానికి గుర్తింపు తేవడం గర్వకారణమని తెలిపారు. త్వరలో 500 గజాల స్థలం కూడా ఇప్పిస్తానని, గ్రూప్ 2 ఉద్యోగానికి గతంలో సిఫార్సు చేశామని, ఆ నియామక ప్రతం సైతం సీఎం సమక్షంలో అందచేస్తామని హామీ ఇచ్చారు.

మొంథాతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్



మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్

నర్సంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కురిసిన వర్షాల వల్ల వేలాది ఎకరాల వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలు దెబ్బతిని రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు జరిగిన నష్టం అంతాఇంతా కాదని చేతి కందే దశలో ఉన్న పంటలు దెబ్బ తినడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. అధికారులతో అన్నిరకాల పంటలు సర్వే నిర్వహించి దెబ్బతిన్న పంటల అంచనాలు తయారు చేయించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిజెఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు



ఎన్నికైన రిటైర్డ్ ఏఈవోల ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ

వడ్డెపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఏఈవో)ల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని కృషి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశం రాష్ట్ర ఏఈవోల పూర్వ అధ్యక్షుడు బి.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఐఆర్, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారుల సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శంకరమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జి.సుధాకర్, కోశాధికారిగా గోకారపు సురేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శరభారెడ్డి, ఉపాధ్యక్షులుగా శామ్యూల్, ఎస్.రాజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.కనకయ్య, గౌరవ అధ్యక్షుడిగా బి.ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పాపినాయుడు, కోటేశ్వర్‌రావు, రామా మనోహర్‌రావు, అనుమాన సత్యనారాయణ, ఇ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

ఇద్దరు అంతరాష్ట్ర దొంగల అరెస్టు

వరంగల్ క్రైం, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): నకిలీ నెంబర్ ప్లేటు కారుతో తిరుగుతూ అర్ధరాత్రి ఇళ్లలో దొంగతనం చేసే ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను పట్టుకొని నిందితుల నుంచి రూ.12లక్షల విలువ చేసే 10 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏనుమాముల సీఐ సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్‌లో నకిలీ నెంబర్ ప్లేటుతో తిరుగుతూ అర్ధరాత్రి దొంగతనాలు చేస్తున్నారనే సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ డీసీపీ, మామునూరు ఏసీపీ ఆదేశాలతో ఏనుమాముల పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దొంగలపై నిఘా పెట్టామన్నారు. శుక్రవారం పైడిపల్లిలో అనుమానాస్పదంగా ఉన్న షేక్ షకీల్, బబ్లూ అనే ఆదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు చేశామని ఒప్పుకున్నారన్నారు. నిందితుల నుంచి సుమారు రూ.12 లక్షల విలువ చేసే 10 తులాల బంగారంతో పాటు కారును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం

నర్సంపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహేశ్వరం గ్రామంలో పట్టపగలు రెండు ఇళ్లలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత వారం రోజుల కిందట మహేశ్వరం గ్రామంలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లను నర్సంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నర్సంపేట పట్టణంలోని కుమ్మరికుంట, ద్వారకపేట రోడ్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు మైనర్లు చదువుపై శ్రద్ధ లేక చిన్న చిన్న అవసరాల కోసం దొంగతనాలకు కొద్ది రోజులుగా అలవాటు పడ్డారు. వీరిలో ఒక బాలుడు ఇంతకు ముందు ప్రభుత్వ ఆసుపత్రిలో మొబైల్ దొంగతనంతో పాటు అంగడి రోడ్‌లో ఒక దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి రెండు తులాల బంగారం, రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రఘుపతి రెడ్డి తెలిపారు. ఇద్దరు బాలురను జువైనల్ హోమ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ ఎక్స్ అభ్యర్థుల ఫీజు గడువు 24

కేయూ క్యాంపస్ అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఏ, ఎంకామ్ ఎక్స్ అభ్యర్థుల ఫీజులు నవంబరు 24 వరకు ఫీజులు చెల్లించుకోవాలని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.700లు, రెండు సబ్జెక్టుల వరకు రూ.600లు చెల్లించుకోవాలని సూచించారు. అలాగే ఒక్కో సబ్జెక్టుకు ఇంప్రూమెంట్ రూ.300లు చెల్లించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కోలాహలంగా యువజన ఉత్సవాలు

ఏడు అంశాల్లో 150మంది హాజరు



స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న పరశురాములు, డీవైఎస్‌వో

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా యువజన విభాగంలో ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో ఏర్పాటు చేసిన యువజన ఉత్సవాలను జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువజన ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో యువజన కళాకారులకు ఏడు అంశాల్లో పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. 15ఏళ్ల నుంచి 29ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలకు, స్త్రీ, పురుషులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో వివిధ మండలాల నుంచి 150 మంది పాల్గొన్నారన్నారు. జానపద నృత్యం గ్రూప్, జానపద పాటల గ్రూప్, వ్యాసరచన (హిందీ, ఇంగ్లీష్, తెలుగు) పోటీలు, పెయింటింగ్, ఉపన్యాసం, (హిందీ, ఇంగ్లీష్) కవిత్వం (హిందీ, ఇంగ్లీష్, తెలుగు)లో, ఇన్నోవేషన్ ట్రాక్‌లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు ఎంపికల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కళాకారులు 10జనవరి నుంచి 12జనవరి 2026లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి యువజన ఉత్సవాల్లో ప్రాతినిధ్యం వహిస్తారని అశోక్‌కుమార్ తెలిపారు. కాగా, ఇక్కడ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించామన్నారు.

ఈ కార్యక్రమంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం సూపరింటెండెంట్ యతిపతి విజయశ్రీ, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత గంగోజుల నరేష్, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఓడపల్లి శ్రీనివాస్, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సీఎం పర్యటన

వరంగల్ టౌన్/మామునూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 11వ డివిజన్‌లో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. కాలనీలలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా రావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. భారీ స్థాయిలో ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించారు. 11వ డివిజన్ కాపువాడలో ముంపు బాధితులను పరామర్శించి వారి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.


హనుమకొండలోని సమ్మయ్యనగర్ నుంచి నయీంనగర్‌కు వెళ్లే నాలాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

పోతననగర్‌లో..

మట్టెవాడ: వరద ముంపునకు గురైన పోతననగర్ ప్రాంతాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. అయితే కేవలం 4 నిమిషాలల్లో సీఎం పర్యటన ముగియడంతో ప్రజలు తీవ్రనిరాశ చెందారు. సీఎం వెంట ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా అధికార యంత్రాంగం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మిసురేందర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ వినతి..

వరంగల్ పోతననగర్ నాలాను విస్తరించాలని 11వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. వరంగల్ పోతననగర్ భద్రకాళి చెరువు మత్తడిని అభివృద్ధి చేయాలని, భద్రకాళి నాళాలను విస్తరించి ఎల్‌బీ కళాశాల వద్ద కల్వర్టు ఎత్తు పెంచాలని, భద్రకాళి ఆలయానికి వెళ్లే దారిలో రంగంపేట వద్ద వంతెనను విస్తరించి ఎత్తు పెంచాలని, వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. బొందివాగు నాళా వరదనీటిని భద్రకాళి చెరువులోకి మళ్లించాలని కోరారు.


వరంగల్ పోతననగర్‌లో వరద ముంపును సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తున్న కలెక్టర్ సత్యశారద

సమ్మయ్యనగర్‌లో వినతిపత్రాల స్వీకరణ

హనుమకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని సమ్మయ్యనగర్‌తోపాటు పలు కాలనీలను సందర్శించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి సీఎం పర్యటించారు. బాధితులను కలిసి మాట్లాడారు. భారీ వర్షాలతో చెరువులు తెగిపోయి రోడ్లు, కాలువలు, ఆస్తి నష్టం జరిగిందని పలువురు కాలనీల వాసులు సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకొచ్చారు. సమ్మయ్య నగర్ కాలనీకి చెందిన సలేంద్ర రమాదేవి, డబ్బాల లత నివాసాలకు సీఎం చేరుకొని వరద నష్టంపై వారితో మాట్లాడారు. వారి నుంచి వినతి పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి స్వీకరించి నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాలనీలలో ఉన్న ముంపునకు గురైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కలెక్టర్‌ను ఆదేశించారు. సమ్మయ్యనగర్ నాలాను పరిశీలించి వరద ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, మున్సిపాల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అడిగి తెలుసుకున్నారు. ఏటా వర్షాకాలంలో తాము వరద ముంపునకు గురవుతున్నామని, తమను ఆదుకోవాలని బాధితులు సీఎంను వేడుకున్నారు.


సమ్మయ్యనగర్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మున్సిపల్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తా..

వరద ముంపు ప్రాంతాలను సమ్మయ్య నగర్ నాలాను పరిశీలించి వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని జీడబ్ల్యూఎంసీ కార్మికులు సీఎం ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. అక్కడే ఉన్న కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌ను పలిచి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, సీఎం ప్రత్యేక సలహాదారుడు వేం నరేందగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ కాలనీలో సీఎం పర్యటన

వడ్డెపల్లి(ఆంధ్రజ్యోతి): వరద తాకిడికి గురైన హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌లోని ఇంజనీర్స్ కాలనీ రోడ్డు నంబర్-2 ను సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఇంజనీర్స్ కాలనీలో వరద బీభత్సానికి గురైన బాధితులను కలిసి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వరద బాధితులు లత, అరుణ, అనిత, వాంకుడోత్ వీరన్న తదితరులు సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తుఫాన్‌వల్ల తాము సర్వం కోల్పోయామని పేర్కొన్నారు. తాము నివాసం ఉంటున్న స్థలానికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ పథకం కింద గృహాలు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. సమ్మయ్యనగర్‌లోని నాలాలను పరిశీలించారు. కాగా, సమ్మయ్యనగర్‌లోని ఇంజనీర్స్ కాలనీలో సీఎం పర్యటన 28 నిమిషాలపాటే కొనసాగింది.


హనుమకొండ కలెక్టరేట్‌లో ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు


వరంగల్ పోతననగర్‌లో వినతి పత్రం తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి

ఓదార్చుతూ.. భరోసానిస్తూ...

(5వ పేజీ తరువాయి)

తమ ఇళ్లలోకి చొచ్చుకువచ్చిందని ఫిర్యాదు చేశారు. ఆతర్వాత సీఎం అక్కడి నుంచి కాపువాడకు చేరుకున్నారు. ఇక్కడ కొద్ది సేపే ఉన్నారు. వరదలకు దెబ్బతిన్న రోడ్లు, ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. సీఎం రాగానే బాధితులంతా ఒక్కసారిగా ముందుకు చొచ్చుకువచ్చి తమ గోడు వినిపించే ప్రయత్నం చేశారు. ఇక్కడ కూడా రేవంత్ రెడ్డి ఒకరిద్దరితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఒక మహిళ వరదల వల్ల జరిగిన నష్టాన్ని వివరించగా బాధపడకమ్మా.. సాయం తప్పక అందుతుందని వారించారు. అ తర్వాత సీఎం అక్కడి నుంచి పోతననగర్‌కు చేరుకున్నారు. సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఇరుకు వీధిలోకి వెళ్లి బాధితులను కలుసుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో వరద ముంపునకు గల కారణాలను తెలుసుకునేందుకు మ్యాప్‌లను పరిశీలించారు. రంగంపేటకు కూడా సీఎం వెళ్లాల్సి ఉన్నప్పటికీ ఆ వెంటనే సీఎం హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చేశారు.

తూర్పు వైపు వెళ్లలేదు...

సీఎం పర్యటన అంతా ఎమ్మెల్యే నాయిని రాజేందరెడ్డి ప్రాతినిధ్యం వహించే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాల్లోనే సాగింది. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గమైన వరంగల్ తూర్పులో కూడా వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. నిజానికి పశ్చిమలో కన్నా తూర్పులోనే వర్షం అధికంతా పడడటమే కాకుండా అనేక ప్రాంతాలు నీట మునిగాయి. నష్టం కూడా ఎక్కువగానే జరిగింది. అయినా కూడా సీఎం తూర్పు ప్రాంతాల్లో పర్యటించకపోవడం గమనార్హం. మొత్తం మీద సీఎం నగరంలో రెండు గంటల పాటు గడిపారు.


హనుమకొండలోని సమ్మయ్యనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పాల్గొన్న మంత్రులు


హనుమకొండ కాపువాడలో సీఎంకు వరద గురించి వివరిస్తున్న ప్రజలు


సమ్మయ్యనగర్‌లో సీఎంకు సమస్యలను వివరిస్తున్న కలెక్టర్

గల్లంతైన శ్రావ్య మృతదేహం లభ్యం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే
- అన్నివిధాలా ఆదుకుంటామని హామీ

జఫర్‌గఢ్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వాగులో గల్లంతైన బక్క శ్రావ్య శుక్రవారం శవమై కనిపించింది. బుధవారంరాత్రి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం శివారు బోళ్లమత్తడి వద్ద వాగులో ప్రేమజంట కొట్టుకుపోగా శ్రావ్య గల్లంతు కాగా, యువకుడు బరిగెల శివకుమార్ ప్రాణాలతో బయటపడిన విషయం విదితమే. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శుక్రవారం వాగులో గాలిస్తుండగా ఘటన జరిగిన సమీపంలోనే శవమై కనిపించింది. విగతజీవిగా పడి ఉన్న కుమార్తె మృతదేహం చూడగానే తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కూతురు మరణానికి కారకుడైన శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించి, శావ్య తల్లి పూర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.


వాగులో లభ్యమైన శ్రావ్య మృతదేహం

శ్రావ్య కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

బక్క శ్రావ్య కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన అధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో బోళ్లమత్తడి ప్రదేశాన్ని పరిశీలించారు. శ్రావ్య తల్లిదండ్రులు ఆలీసాబ్-పూర్ణ, వారి కుటుంబీకులను పరామర్శించారు. కడియం మాట్లాడుతూ యువతి మృతిపై సమగ్ర విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా బాధితులకు అందించే రూ.5 లక్షల ఆర్థిక సాయం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో సుమన్, ఇరిగేషన్ ఈఈ సీతారాం నాయక్, పీఆర్ ఏఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, ఆర్.సుదర్శన్ పాల్గొన్నారు.

రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి : బీజేపీ

శ్రావ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు.


శ్రావ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

పెళ్లి బృందం జీపును ఢీకొట్టిన లారీ

- ముగ్గురి మృతి, పలువురికి గాయాలు
- వధువు తల్లిదండ్రులకు సైతం గాయాలు
- భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో ఘటన
- బాధితులు మహబూబాబాద్ జిల్లావాసులు
- క్షతగాత్రులకు ఎంజీఎంలో చికిత్స
- పరామర్శించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో స్వప్న, కళమ్మ, శ్రీనాథ్‌ల మృతదేహాలు


ఎంజీఎం మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

భీమదేవరపల్లి(ఎల్కతుర్తి), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లింట విషాదం నెలకొంది. వరుడి ఇంట్లో రిసెప్షన్ ముగించుకొని వధూవరులతో వస్తున్న వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు బంధువులు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన కాచిపడగల కులస్థులు ముదిరాజుల కథలు చెబుతూ.. యాచిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఇదే కాచిపడగల కులస్థుడైన ఉస్తం రాజు చిన్న కుమార్తె నాగలక్ష్మి వివాహం ఈనెల 29న(బుధవారం) కురవి వీరభద్రస్వామి దేవస్థానంలో సిద్దిపేట జిల్లా వెంకటాపూర్‌కు చెందిన వరుడు భాస్కర్‌తో జరిగింది. మరుసటి రోజు 30న పెళ్లి కుమారుడి ఇంటికి వధువు కుటుంబ సభ్యులు, బంధువులు రిసెప్షన్ కోసం వ్యాన్‌లో వెంకటాపూర్ గ్రామానికి వెళ్లారు. రాత్రి రిసెప్షన్ అనంతరం తిరిగి సూదనపల్లికి వధూవరులను తీసుకుని అర్ధరాత్రి బయలుదేరారు. మార్గమధ్యలోని భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద మూత్ర విసర్జన కోసం వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపారు. ఈ క్రమంలో అతివేగంగా బోర్‌వెల్ లారీ పెళ్లి వ్యాన్‌ను బలంగా వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో వాహనంలో ఉన్న సూదనపల్లికి చెందిన వధువు బంధువులు రెడ్డబోయిన స్వప్న(16), శ్రీనాథ్(6), కళమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే అనసూయ, అక్షయ, మారుతి, రమాదేవి, దేవేందర్, నవలోక్, రిత్విక్, సరోజన, కార్తీక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యుడు రెడ్డబోయిన శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బాధితులకు ఎంజీఎంలో చికిత్స

వరంగల్ మెడికల్(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోగా, గాయపడిన వారిని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు. మొత్తం 20 మందిని ఎంజీఎంకు తీసుకురాగా, వారిలో 10 మందికి స్వల్ప గాయాలు, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఎంజీఎంలో అనసూర్య(65), శివకుమార్(7), అక్షిత(8), సంజన అనే చిన్నారులతోపాటు మారుతి అనే వ్యక్తి చికిత్స పొందుతున్నారు. చిన్నారుల తలలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇందులో మరో ఐదుగురు క్షతగాత్రులు ములుగురోడ్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, క్షతగాత్రులను పోలీసు కమిషనర్ పరామర్శించారు. ఘటన వివరాలు తెలుసుకొన్నారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఇదిలావుండగా, ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, మిత్రులు ఎంజీఎం క్యాజువాలిటీ గేటు చేరుకునే ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సూదనపల్లిలో విషాదం..

కురవి(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆగివున్న బొలేరోను లారీ ఢీకొన్న ఘటనలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లికి చెందిన రెడ్డబోయిన స్వప్న (16), రెడ్డబోయిన శ్రీనాథ్(6)తో పాటు పెళ్లికి వచ్చిన వీరి సమీప బంధువు కొండపర్తి కళమ్మ(55) మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదే ఘటనలో బొలేరోలో ఉన్న ఉస్తం రాజుకు రెండు కాళ్లు, నడుం విరిగింది. గంగలక్ష్మికి కాళ్లు, నడుము, ఉస్తం అనసూర్య, శ్రీరాంలకు తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లారు. ఉస్తం భాగ్య, దేవేందర్‌లకు కాళ్లు విరిగాయి. పెళ్లి కూతురు తండ్రి ఉస్తం రాజుకు రెండు కాళ్లు విరగగా, తల్లి ఉస్తం అనసూర్యకు తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. మృతదేహాలు శుక్రవారం అర్ధరాత్రికి స్వగ్రామం చేరుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

మత్తడితో కనువిందు చేస్తున్న పాకాల

ఖానాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మత్తడి పోస్తూ కనువిందు చేస్తోంది. ఈ ఏడాది ఎన్నడూలేని విధంగా ఆగస్టు 15నుంచి పాకాల సరస్సు మత్తడి పోస్తూనే ఉంది. ఇంత సుదీర్ఘకాలం మత్తడి పోసిన దాఖలాలు గతంలోలేవు. కాగా, పాకాల మత్తడి పోస్తుండడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో అశోక్‌నగర్-కొత్తగూడ గ్రామాలకు రాకపోకలు మూడు రోజులుగా నిలిచిపోయాయి.



మధ్యాహ్నభోజన కార్మికుల ధర్నా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు సరైన సమయానికి బిల్లులు, జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, ప్రతీ నెల 5వ తేదీనే బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబరు 12వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత, ప్రధాన కార్యదర్శి ధర్మల రాంమూర్తి, శారద, మేకల అమృత, రమాదేవి, ఎల్లేశ్, శంకర్ నాయక్, శ్రీనివాస్, స్వరూప, లక్ష్మీ పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులు

వరంగల్ క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ అనంతరం సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలని అడిషనల్ డీసీపీ రవి సూచించారు. వరంగల్ పోలీసు విభాగంలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఎస్సైలు సమ్మయ్య, శివకుమార్, ఆర్ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు కె.సంపత్‌రెడ్డి, జి.వెంకయ్య, పి.సదానందంలను డీసీపీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ అంతయ్య, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో ఇందిరాగాంధీ వర్ధంతి



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న షేక్ అజ్గర్

కాజీపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ చౌరస్తాలో శుక్రవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మైనారిటీ జనరల్ సెక్రటరీ ఎం.డి. బిలాల్, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు హాజరై ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పసునూరి మనోహర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస, గబ్బెట ఎల్లేశ్, కె.రమేశ్, తిరుపతి, శ్రీను, భానుచందర్, గబ్బెట ఎల్లేశ్, ఇమ్మడి రవి, వంశీనాథ్, వంశీతో పాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జిల్లా యువజన ఉత్సవాల్లో
కేయూ విద్యార్థుల ప్రతిభ



యువజన ఉత్సవాల్లో మొదటి ప్రైజ్ సాధించిన కేయూ బయోటెక్నాలజీ జట్టు

కేయూ క్యాంపస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విద్యార్థులు తెలంగాణ ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ నేతృత్వంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో ప్రతిభ చూపారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో కేయూ విద్యార్థులు సంప్రదాయ నృత్యాల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డిస్ట్రిక్టు యూత్ ఆఫీసర్ అశోక్‌కుమార్, రోటరీ క్లబ్ ఛైర్మన్ నవీన్‌లతో పాటు ఇతర అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. బహుమతి సాధించిన వారిలో ఆర్.జయశీల, ఎస్.హర్షిణి, బి.మధులిక, టి.కౌశిత, బి.మౌనిక, ఎం.అంజలి, ఎస్.గౌతమి, ఎం.నాగసాయి లక్ష్మి, కె.అక్షిత, బి.సంధ్యలున్నారు. వీరితోపాటు కేయూ బయోటెక్నాలజీ విద్యార్థులు కె.శిరీష, ఎస్.వైష్ణవిలు మొదటి, మూడో స్థాయిల్లో నిలిచారు. వీరు 'నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర' అనేఅంశంపై కవిత్వాన్ని వెలువరించారు. వీరికికేయూ బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, కేయూ యూత్ వేల్ఫేర్‌ఆఫీసర్ తిప్పని రాధికలు నేతృత్వంలో వహించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి మొదటి ప్రైజ్ సాధించిన కేయూ విద్యార్థులను కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్ తదితరులు అభినందిచారు. మొదటి స్థానంలో నిలిచిన కేయూ విద్యార్థులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే స్టేట్ లెవల్, తర్వాత ఢిల్లీలో జరిగే తుది పోటీల్లోనూ పాల్గొననున్నారు. యూత్‌అవేర్‌నెస్, యూత్‌అవేర్‌నెస్ డ్రగ్స్ ఎడ్యుకేషన్ అంశాలపై పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

2 నుంచి కేయూ ఎస్డీఎల్‌సీఈ పీజీ కాంట్రాక్టు తరగతులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం 2024-25 పీజీ కోర్సులకాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 2, 8, 9 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి కేయూ దూరవిద్య కేంద్రంతోపాటు ఎంపిక చేసిన కళాశాల్లో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎంకామ్ మొదటి సెమిస్టర్ తరగతులు జరుగుతాయని స్పష్టం చేశారు. వర్సిటీ క్యాంపస్‌లో తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీతో పాటు ఎంకామ్ తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, మంచిర్యాల, నిర్మల్, మణుగూరు. భద్రాచలం, ఖమ్మంతో పాటు తదితర ప్రాంతాల్లోని స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు.

తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ గ్రామ కమిటీ



మడికొండ సీఐ పుల్యాల కిషన్‌కు మొక్క అందజేస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

మడికొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ మడికొండ గ్రామ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడిగా వస్కుల రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా బైరి కొమురయ్య, గౌరవ సలహాదారులుగా గోపనబోయిన రాజు, బరిగల కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్ర ఎల్లగౌడ్, ప్రధాన కార్యదర్శిగా వల్లెపు రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.డి.సలీం, గాదెపాక కిరణ్, బోగి రాజు, బిల్ల సంతోష్, జిట్ట సదానందం, మొడెం ముకుందం, కోశాధికారిగా మద్దెలకుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా నమిండ్ల వంశీ, నర్ర భాను, ఎస్‌కే సాహేద్ అలీ, పసునూరి ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా దోమ నరేష్, సోషల్ మీడియా కార్యదర్శిగా కిరణ్, కార్యవర్గ సభ్యులుగా కొలిపాక కోటి, బి.రమేష్, ఎస్‌కే ఫారూక్, జిట్ట రాహుల్, బానోతు నారాయణ తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మడికొండ సీఐ పుల్యాల కిషన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఆటోడ్రైవర్లకు సహకరించాలని కోరారు.

కదిలిస్తే కన్నీళ్లే..!

- మొంథా తుఫాన్‌తో భారీగా ఆస్తి నష్టం
- కన్నీరుమున్నీరవుతున్న ముంపు కాలనీవాసులు
- ఆదుకోవాలని వరద బాధితుల వేడుకోలు

వడ్డేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బీభత్సానికి హనుమకొండలోని వివిధ కాలనీల్లో ప్రజలు భారీ ఆస్తి నష్టానికి గురయ్యారు. విలువైన వస్తువులు పాడై పోవడంతో వారు రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వరద బాధితులు వేడుకుంటున్నారు. హనుమకొండ 56వ డివిజన్ ద్వారకా సాయి కాలనీ, జవహర్ కాలనీ, పరిమళ కాలనీ, శివాజీ నగర్, వివేక్ నగర్ కాలనీ, అమరావతి నగర్, 57వ డివిజన్‌లోని టీవీ టవర్ కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, వాంబే కాలనీ, గాంధీనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగి ఇళ్లల్లోకి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, సోఫాసెట్లు, మంచాలు, పరుపులు, నిత్యావసర వస్తువులు, గ్యాస్ స్టౌవులు పాడయ్యాయి. విలువైన వస్తువులు పాడై పోవడంతో తాము లక్షలాదిగా నష్టపోయామని పలువురు వరద బాధితులు వాపోతున్నారు. గోపాల్‌పూర్ ఊర చెరువు తెగి వివేక్‌నగర్ కాలనీలో వరద నీరు చేరి ప్రజలు భారీ ఆస్తినష్టానికి గురయ్యారు. ఇళ్ల గోడలు సైతం కూలి పెద్దఎత్తున నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి అన్ని విధాలా ఆదుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు.

సర్వం కోల్పోయాను..



మొంథా తుఫాన్ ప్రభావానికి తాను సర్వం కోల్పోయాను. ఇంట్లోకి వరద నీరు చేరి ఫ్రిజ్, టీవీ, పరుపులు, మంచాలు, నిత్యావసర సరుకులు తడిసి పోయాయి. ప్రభుత్వం ద్వారా తనకు ఆర్థిక సహాయాన్ని అందించాలి.

– సయ్యద్ ఉమర్‌పాషా, ద్వారకాసాయి కాలనీ

అధికారులు కన్నెత్తి చూడలే..



తుఫాన్ ప్రభావం వల్ల ద్వారకాసాయి కాలనీ ఫేజ్-1లో ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఎంతో నష్టపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం కన్నెత్తి చూడలేదు. ఆహారం, మంచినీరు సైతం అందక మూడు రోజులు కాలనీ వాసులంతా పస్తులు ఉన్నారు.

– ఆవుల విజయ్‌కుమార్‌రెడ్డి, ద్వారకాసాయి కాలనీ



సమ్మయ్యనగర్‌లోని కాలనీలో వరదకు కొట్టుకువచ్చిన కారు



సమ్మయ్యనగర్‌లో ఇంట్లో పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న ప్రజలు



సమ్మయ్యనగర్‌లోని తులసీ బార్ సమీపంలో రోడ్డు దుస్థితి



మట్టి, చెత్తతో నిండిన కాలనీ రోడ్డు

కేయూ న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 30న జరగాల్సిన న్యాయశాస్త్ర విభాగం సెమిస్టర్ పరీక్షలను భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేయగా శుక్రవారం పరీక్షల రీ షెడ్యూల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎమ్డీ అసీం ఇక్బాల్‌లు ప్రకటించారు. మూడేళ్ల కోర్సుల ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, అలాగే ఐదేళ్ల ఎల్ఎల్‌బీ ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 3వ తేదీన, ఇంజనీరింగ్ బీటెక్ (నాన్ సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నవంబరు 15వ తేదీన జరుగుతాయని పేర్కొన్నారు. మిగిలిన పరీక్షలన్నీ యథావిధిగా గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని పేర్కొన్నారు.

భారీ వర్షాలకు కూలిన కామన్ మెస్ ప్రహరీ

కేయూ క్యాంపస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్‌లోని కామన్ మెస్ ప్రహరీ భారీవర్షాలకు కూలిపోయింది. కామన్‌హాల్‌కు వెనుకవైపు ఉన్న గోడ వర్షాల ధాటికి ఒక్కసారిగా కుప్పకూలింది. గోడ కూలిపోవడంతో దానికి అనుకొని ఏర్పాటుచేసిన వాటర్ కనెక్షన్ పైపులు దెబ్బతిన్నాయి. వర్సిటీ క్యాంపస్‌లోని పద్మాక్షి లేడీస్ హాస్టల్‌తో పాటు పలు హాస్టల్స్‌లోకి వర్షపు నీళ్లు చేరుకున్నాయి. హాస్టల్ సిబ్బంది వర్షపునీటిని బయటికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.



కూలిపోయిన కేయూ కామన్‌మెస్ ప్రహరీ గోడ

పరమేశ్వర స్వరూపమే దీపం

టీటీడీ మనగుడిలో పురాణ ప్రవచకురాలు వసుంధర



ప్రవచనాలు నిర్వహిస్తున్న వసుంధర

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికంగా ఎంతో శ్రేష్ఠమైన కార్తీకమాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్‌లోని భువనేశ్వరీ మాత ఆలయంలో కార్తీక పౌర్ణమి వరకు కొనసాగే మనగుడి కార్యక్రమాలు గురువారం రాత్రి నుంచి ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి పురాణ ప్రవచకురాలు, సాంస్కృతిక ఉపన్యాసకురాలు పెన్నెటి వసుంధర దీపం దాని మహాత్యం అన్న అంశంపై ప్రవచనాలు నిర్వహించారు. దీపం యథార్థంగా పరమేశ్వర స్వరూపమని, మన శరీరాన్ని ఎంతకాలం ఉంచాలో ఉంచి, ఆ ఊపిరి అయిపోగానే తాను బయటకు వెళ్లి శవంగా పడగొట్టగిలిగే స్వరూపమే దీప మని వ్యాఖ్యానించారు. ప్రతీ రోజు సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్రాలు, కార్తీక పౌర్ణమి నేపథ్యంలో ప్రముఖుల పురాణ ప్రవచనాలను నవంబరు 5 కార్తీక పౌర్ణమి వరకు ఈ ఆలయంలో నిర్వహింపజేస్తున్నట్లు టీటీడీ డీపీపీ కో ఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ మోత్కూరి రామేశ్వర్‌రావు, భద్రకాళి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు మోత్కూరి మయూరి, వరసిద్ధి వినాయ కమిటీ చైర్మన్ చాగర్ల శ్రీనివాస్, భువనేశ్వరిమాత ఆలయ సభ్యులు, కార్యక్రమ కోఆర్డినేటర్ గుండవరం విధుమౌళి, అద్దంకి సారంగచారి, గట్టు సత్యనారాయణ, పద్మజ, జంగిలి సుధాకర్‌రావు, నామా రాజేందర్, నర్సింహారెడ్డి, వెంకటచార్య తదితర ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం మనగుడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆలయంలో ప్రముఖ పురాణ ప్రవచకులు వంగాల సోమయాజులుచే కార్తీక పౌర్ణమి విశిష్టతపై ప్రవచనం నిర్వహిస్తారని విధుమౌళి తెలిపారు.

పెద్దమ్మగడ్డ యువకుల సేవాభావం

- రెండు రోజులు వరద నీటిలో విస్తృత సేవలు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ నుంచి హనుమకొండకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన వేళ.. అత్యవసర పనులు, విధులకు వెళ్లే వారికి పెద్దమ్మగడ్డ యువకులు ఉపశమనం కలిగించారు. జట్టుగా ఏర్పడి వేగంగా ప్రవహించే వరద నీటిలో నిలబడి వందలాది మందిని రోడ్డు దాటించి వరంగల్ నగర రాకపోకలను సుగమనం చేశారు. నగరంలో మొంథా తుఫాన్ ప్రజలను అతలాకుతలం చేసింది. రెండు రోజులు భారీగా కురిసిన వర్షం కారణంగా హనుమకొండ, చౌరస్తా, అలంకార్ జంక్షన్, హంటర్‌రోడ్డు, భద్రకాళి బండ్, కేయూ నుంచి పెద్దమ్మగడ్డ రోడ్డు మార్గాల్లో వర్షం నీరు రాకపోకలను స్తంభింజేశాయి. ఈ క్రమంలో కమలాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారు వరంగల్ ఎంజీఎంకు వెళ్లేందుకు నగరంలోని ప్రధానరోడ్లు వర్షానికి మూతపడ్డాయి. కేయూ నుంచి అంబులెన్స్‌లో వచ్చిన వారు వెనక్కి వెళ్లి పెగడపెల్లి డబ్బాలు, గుండ్లసింగారం, వంగపహాడ్, ఆరెపల్లి, హనుమాన్ జంక్షన్, ఆటోనగర్ మీదుగా వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో వరద నీరు కారణంగా పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న నాలా నీరు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని అక్కడి యుకులు తెలుసుకున్నారు. సుమారు 50 మంది యువకులు ఒక్కటై ప్రజలకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నాలాపై ప్రవహించే నీటిలో నిలబడి కొందరు వాహనాలను దాటించారు. నీటిలో వాహనాలపై ప్రయాణించే సమయంలో అదుపుతప్పి పడిపోయే వారిని గుర్తించి వాహనంతో సహా కుటుంబసభ్యులను దగ్గరుండి మరీ నీటి ప్రమాదం నుంచి దాటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు రెండు షిఫ్టులుగా పనిచేసి సేవలందించారు. ప్రజలకు సేవ చేయడంలో చాలా సంతృప్తి చెందినట్టు పెద్దమ్మగడ్డకు చెందిన యువకులు జైపాల్, రాజు, మనోజ్, యశ్వంత్ సంతోషం వ్యక్తం చేశారు.



పెద్దమ్మగడ్డ నాలా నుంచి ప్రజలను దాటిస్తున్న యువకులు

ప్రమాదాల నివారణపై
పట్టింపేదీ?

- టీఎన్జీవోస్ కాలనీలో గుంతలమయంగా రోడ్డు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాలకులు

వడ్డేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే టీఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వందలాది వాహనాలు ఈ మార్గం నుంచి వెళ్తుంటాయి. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి జంక్షన్ వరకు ఉండే మార్గంలోని టీఎన్జీవోస్ కాలనీ రోడ్డులో అడుగులోతు గుంతలు పడి రెండు నెలలు కావస్తున్నా జీడబ్ల్యూఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే రోడ్డు నుంచి వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గుంతల రోడ్డులో పడుతూ గాయపడుతున్నారు. అదేవిధంగా రాత్రి వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు స్థానిక ప్రజలు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వివిధ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఫార్మసీలో స్వాతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు జక్కు స్వాతి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ స్వాతికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంట్రా నాజల్ ఫార్ములేషన్స్ ఫర్ డ్రగ్స్ ఆఫ్ నేచురల్ ఓర్జిన్ ఫర్ ది ట్రీట్మెంట్ ఆఫ్ న్యూరో డీజనరేటీవ్ డిజార్డర్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ సాధించారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానపరెడ్డి కృష్ణవేణి పర్యవేక్షణలో స్వాతి పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన స్వాతి ఓగ్లాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఫార్మసీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన స్వాతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆగయ్యగౌడ్‌తో పాటు భర్త రామకృష్ణ, తల్లిదండ్రులు రామమూర్తి, శోభారాణి ఇతర అధ్యాపకులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు డీఎస్ఏ స్విమ్మర్లు



జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన డీఎస్ఏ స్విమ్మర్లను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 21 నుంచి 23 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు హనుమకొండలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ పొందుతున్న పలువురు స్విమ్మర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన డీఎస్ఏ స్విమ్మర్లు కె.సుదర్శన్, పి.విశ్వేశ్వర్‌రావు, శోభారాణి, కరుణాకర్, పి.సమ్మయ్య, అసిత్‌కుమార్‌లు డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ రాయబారపు నవీన్‌తో కలిసి శుక్రవారం డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్‌ను జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాస్టర్స్ స్విమ్మర్లను అశోక్‌కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

వంటిల్లు

తియ్యటి సీతాఫలాన్ని ఇష్టపడని వారుండరు. కొంతమంది దీన్ని నిప్పుల మీద కాల్చుకుని తింటుంటారు. సీతాఫలాలతో బాసుందీ, రబ్డీ, మిల్క్‌షేక్... ఇలా ఎన్నో రకాల రుచులు తయారు చేస్తుంటారు కూడా! అలాంటి వాటిలో కొన్ని విభిన్నమైన తియ్యటి రుచులు మీకోసం...





సీతాఫలంతో తియ్యగా...

సీతాఫలం కలాకంద్



కావాల్సిన పదార్థాలు

సీతాఫలాలు- రెండు, పన్నీర్- 300 గ్రాములు, పాల పొడి- రెండు చెంచాలు, మిల్క్‌మెయిడ్- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, బాదాం- ఏడు, పిస్తా- ఆరు, నెయ్యి- ఒక చెంచా

తయారీ విధానం

వెడల్పాటి గిన్నెలో పన్నీర్ వేసి చేత్తో మెత్తగా మెదిపి ఉంచుకోవాలి. సీతాఫలాలను చాపర్‌లో వేసి గుజ్జును గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పన్నీర్, సీతాఫలాల గుజ్జు, మిల్క్‌మెయిడ్, పాలపొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గరిటెతో మెత్తగా మెదుపుతూ కలుపుతూ ఉండాలి. పది నిమిషాల తరువాత మిశ్రమం బాగా దగ్గరకు వస్తుంది. చివరగా యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరిచి పైన డ్రై ఫ్రూట్స్ పలుకులు చల్లాలి. కలాకంద్ చల్లారిన తరువాత ముక్కలుగా కోసి సర్వ్ చేసుకోవాలి.

సీతాఫలం ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు

సీతాఫలాలు- ఆరు, ఫ్రెష్ క్రీమ్- ఒక కప్పు, పాలపొడి- అర కప్పు, పాలు- ఒక కప్పు, పంచదార పొడి- ఒక కప్పు, వెనీలా ఎసెన్స్- అర చెంచా

తయారీ విధానం

సీతాఫలాలను మధ్యకు విరిచి, లోపలి గుజ్జును చాపర్‌లో వేసి చాప్ చేయాలి. తరువాత చెంచాతో గింజలు తీసివేసి గుజ్జును గిన్నెలోకి తీసుకోవాలి. ఒక గిన్నెలో పాలపొడి వేసి, అరకప్పు నీళ్లు పోసి, ఉండలు రాకుండా పేస్టులా కలపాలి. వెడల్పాటి గిన్నెలో ఫ్రెష్ క్రీమ్ వేసి మెత్తగా చిక్కగా మారేవరకూ బ్లెండర్‌తో పది నిమిషాలపాటు బ్లెండ్ చేయాలి. ఆపైన పాల పొడి పేస్టు, పాలు, పంచదార పొడి, వెనీలా ఎసెన్స్ వేసి, నురుగులా వచ్చేవరకూ మరోసారి బ్లెండ్ చెయాలి. తరువాత సీతాఫలాల గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక కంటైనర్‌లో పోసి మూతపెట్టి కనీసం పది గంటలపాటు ఫ్రీజర్‌లో ఉంచాలి. ఇది ఐస్‌క్రీమ్‌లా గడ్డ కట్టిన తరువాత గాజు బౌల్స్‌లోకి తీసి సర్వ్ చేసుకోవాలి.



సీతాఫలం ఫిర్నీ



కావాల్సిన పదార్థాలు

సీతాఫలాలు- రెండు, పాలు- ఒక కప్పు, పంచదార- పావు కప్పు, బాస్మతి బియ్యం- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, బాదం- అయిదు, పిస్తా- ఆరు, జీడిపప్పు- కొద్దిగా, కిస్‌మిస్‌లు- ఆరు, నెయ్యి- మూడు చెంచాలు

తయారీ విధానం

ఒక గిన్నెలోకి బాస్మతి బియ్యాన్ని తీసుకొని, శుభ్రంగా కడిగి, నిండా నీళ్లు పోసి, గంటసేపు నానబెట్టాలి. తరువాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీయాలి. సీతాఫలాలను చేత్తో మధ్యకు విరచాలి. చెంచా సహాయంతో గుజ్జును తీసి, చాపర్‌లో వేయాలి. దీనిమీద మూత పెట్టి చాపర్ తాడును నాలుగైదుసార్లు లాగి వదలాలి. గుజ్జు నుంచి గింజలు బయటికి వచ్చేస్తాయి. వాటిని చెంచాతో తీసివేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. తరువాత బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో పాలు పోసి, చిన్న మంట మీద మరిగించాలి. పాలు మరుగుతుండగా బాస్మతి బియ్యం పిండిని వేసి గరిటెతో కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చాక సీతాఫలం గుజ్జు, పంచదార, యాలకుల పొడి వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత స్టవ్ మీద నుంచి దించాలి. ముందుగా వేయించి పెట్టుకున్న డ్రైఫ్రూట్స్ పలుకులు, కిస్‌మిస్‌లు చల్లి ఫిర్నీని సర్వ్ చేసుకోవాలి.

సీతాఫలం మఫిన్స్



కావాల్సిన పదార్థాలు

పాలు- అర కప్పు, నిమ్మరసం- ఒక చెంచా, కొబ్బరిపొడి- అర కప్పు, సీతాఫలం గుజ్జు- ముప్పావు కప్పు, చాక్లెట్ చిప్స్- కొన్ని, పంచదార పొడి- రెండు చెంచాలు, గోధుమ పిండి- అర కప్పు, బేకింగ్ పౌడర్- అర చెంచా, వెనీలా ఎసెన్స్- పావు చెంచా, నూనె- రెండు చెంచాలు, చాక్లెట్ సిరప్- పావు కప్పు

తయారీ విధానం


ఒక గిన్నెలో పావు కప్పు పాలు పోసి నిమ్మరసం వేసి కలిపి ఉంచుకోవాలి. వెడల్పాటి గిన్నెలో సీతాఫలం గుజ్జు, పంచదార పొడి, బేకింగ్ పౌడర్, వెనీలా ఎసెన్స్, నూనె వేసి ఆపైన నిమ్మరసం కలిపిన పాలు పోసి గరిటెతో బాగా కలపాలి. తరువాత గోధుమ పిండి, కొబ్బరిపొడి వేసి మిగిలిన పాలు కూడా పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుని సిలికాన్ మౌల్డ్‌లలో నింపి పైన చాకోచిప్స్ చల్లాలి. వీటిని ప్రీ హీటెడ్ ఓవెన్‌లో ఉంచి, 180 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద 25 నిమిషాలపాటు బేక్ చేయాలి. తరువాత దాన్ని బయటికి తీసి చల్లారనివ్వాలి.
పూర్తిగా చల్లారిన మఫిన్స్ మీద చాక్లెట్ సిరప్ చిలకరించి సర్వ్ చేసుకోవాలి.

భోజన కుతూహలం

వీర్యకణాలు పెంచే పుచ్చపండు!

ఒకప్పుడు పుచ్చకాయలు వేసవి కాలంలోనే వచ్చేవి. కానీ ఇప్పుడు పుచ్చకాయలు ఏడాది పొడవునా దొరుకుతున్నాయి. అందువల్ల దీనిని కేవలం వేసవి పండుగా భావించాల్సిన అవసరం లేదు. మన దగ్గర సంవత్సరంలో మూడువందల రోజులూ వేడి ఉంటుంది. అందువల్ల పుచ్చకాయలు తినటం అందరికీ మంచిదే! 'భోజనకుతూహల' పాకశాస్త్ర గ్రంథం ఈ పుచ్చపండును 'కళింగఫలం'గా పేర్కొంది. దీనిలోని ఔషధ గుణాలను వర్ణించింది. ఆ ఔషధ గుణాలేమిటో చూద్దాం.

- పుచ్చకాయలలో ఉన్న అనేక రకాల పోషకాలు రక్తపోటును నియంత్రిస్తాయి.
- దీనిలో ఉండే లైకోపీన్ అనే పదార్థం గుండెకు మేలు చేస్తుంది. చర్మానికి కాంతిని ఇస్తుంది. విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బీ12, పొటాషియం, మెగ్నిషియం లాంటివి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి.
- పుచ్చకాయను రాత్రి తినకూడదు. రాత్రి తింటే



కఫం పెరుగుతుంది. మధ్యాహ్నం తింటే త్వరగా అరిగిపోతుంది కాబట్టి ఇబ్బంది ఉండదు.
- పుచ్చకాయ తొక్కకు.. ఎర్రటి కండకు మధ్య తెల్లటి కండ ఉంటుంది. ఇది కీరదోస మాదిరిగా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. దీనిని నిమ్మరసం, పుదీనాలతో కలిపి జ్యూస్ చేసుకొని తాగితే ఎసిడిటీ తగ్గుతుంది. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ తెల్ల కండను ముక్కలుగా చేసి పప్పుగా కూడా వండుతారు. కొన్ని ప్రాంతాలలో దీనితో హల్వా కూడా చేస్తారు.
- పుచ్చకాయ రసం క్రమం తప్పకుండా తాగితే పురుషులలో జీవకణాలు పెరుగుతాయి.

• గంగరాజు అరుణాదేవి

సంకల్పం

చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్న మహిళలు వారు. వేరొకరి ఉన్మాదానికి బలైన బాధితులు. యాసిడ్ దాడిలో రూపురేఖలు కోల్పోయి... జీవచ్ఛవంలా మారిన వారికి ఊపిరి పోసి... కొత్త జీవితాన్ని అందిస్తున్నారు కల్సుమ్ **షాదాబ్ వాహబ్**. నైపుణ్య శిక్షణ ఇచ్చి, అవకాశాలు కల్పించి, స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహిస్తున్నారు. ఆ మధ్య 'మిలాన్ ఫ్యాషన్ వీక్'లో ర్యాంప్‌పై నడిపించి... వారిలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపారు.





బాధితులకు భరోసా

"దాదాపు పదిహేనేళ్ల కిందట... బెంగళూరులోని ఓ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారుల కోసం ఆర్ట్ థెరపీ సెషన్ నిర్వహిస్తున్నాను. ఆ సమయంలో ఓ మహిళ నా కంట పడింది. సగం కాలిపోయిన ముఖం, ముడతలు పడిన చర్మం. పక్కనే ఉన్న నర్సును అడిగాను... "ఆమెకు ఏమైంది?" అని. "యాసిడ్ దాడి బాధితురాలు" అని నర్సు చెప్పింది. అప్పటివరకు నాకు తెలియదు... యాసిడ్ దాడి అంటే ఏమిటో! విచారిస్తే... బెంగళూరులో మా ఇంటికి చేరువలోనే ఆ సంఘటన జరిగిందని తెలిసింది. అది నన్ను మరింత బాధించింది. ఇంటికి వచ్చాక కూడా ఆమె ముఖం నా కళ్లల్లో మెదులుతూనే ఉంది. ఆ సంఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ క్షణమే ఒక నిర్ణయానికి వచ్చాను.. ఇలాంటివారికి అండగా నిలబడాలని.

బళ్లారి నుంచి బెంగళూరుకు...

నేను పుట్టి పెరిగిందంతా బెంగళూరులోనే. సైకాలజీలో మాస్టర్స్ చేశాను. పెళ్లి తరువాత నా నివాసం బళ్లారికి మారింది. అక్కడ మావారు నిర్వహించే స్వచ్ఛంద సంస్థ 'హోతూర్ ఫౌండేషన్' బాధ్యతలు చూసుకొనేదాన్ని. ఏ దిక్కూ లేని అనాథలు, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేసే సంస్థ ఇది. అదే సమయంలో వికలాంగులైన చిన్నారుల్లో ఆత్మస్థైర్యం నింపే ఉద్దేశంతో 'కలర్స్ ఆఫ్ హోప్' పేరుతో మరో కార్యక్రమాన్ని చేపట్టాను. దేశ వ్యాప్తంగా కేంద్రాలు ప్రారంభించాను. అందులో భాగంగా అనేక ఆసుపత్రులు తిరిగాను. చికిత్స పొందుతున్న చిన్నారులను పలుకరించేదాన్ని. ఈ క్రమంలోనే బెంగళూరు ఆసుపత్రిలో యాసిడ్ దాడి మహిళను చూశాను. వారి కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో... మేం బళ్లారి నుంచి బెంగళూరుకు వచ్చి స్థిరపడ్డాం.

సర్జరీలకు కూడా...

"యాసిడ్ దాడిలో గాయపడిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతుంది. కాలిన గాయాలకు చికిత్సలు, సర్జరీలు చేయించుకోవాలంటే లక్షల రూపాయలతో కూడుకున్న పని. అంత డబ్బు భరించలేక, గాయాలతో జీవించలేక తీవ్ర మనోవేదన అనుభవిస్తుంటారు బాధితులు. కొన్ని సందర్భాల్లో అయినవారు కూడా ముఖం చాటేస్తారు. అందుకే మా సంస్థ ద్వారా వారికి సర్జరీలు చేయిస్తున్నాం. పూర్తి స్థాయిలో వైద్య సాయం అందేలా చూస్తున్నాం. ఆ తరువాత వారు సమాజంలో సాధారణ జీవితం గడిపేలా మానసికంగా సిద్ధం చేస్తున్నాం. 'జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 207 యాసిడ్ దాడి కేసులు నమోదయ్యాయి. కొందరిపై రెండుసార్లు కూడా దాడి జరిగింది. వారికి న్యాయం అందడంలో కూడా తీవ్ర జాప్యం చోటుచేసుకొంటోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలనే లక్ష్యంతో... మేం వారికి న్యాయ సహాయం కూడా అందిస్తున్నాం."

వారి కోం ఒక వేదిక...

యాసిడ్ దాడి బాధితులను గుర్తించి, వారిని ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు నా ప్రయత్నాలు ప్రారంభించాను. తరచూ ఆసుపత్రులకు వెళుతున్నప్పుడు ఒక మహిళను కలిశాను. సగానికి పైగా కాలిన శరీరంతో ఉన్న ఆమె ఎవరినీ కలవడానికి ఇష్టపడటంలేదు. ఎలాగో నేను ఆమె దగ్గరకు వెళ్లి, నాపట్ల నమ్మకం కలిగించాను. అప్పుడు తను చెప్పింది... తనలా ఇంకా ఎంతోమంది యాసిడ్ దాడి బాధితులు ఉన్నారని. సాయం అందించే చేతులు లేక అవస్థలు పడుతున్నారని. వారందరినీ కలిసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాను.

ఆర్థిక సాయం సరిపోదని...

ఆరంభంలో బాధిత మహిళలకు ఆర్థిక సాయం చేశాను. కానీ వ్యసనాలకు బానిసలైన వారి భర్తలు... తమ భార్యల చేతుల్లో డబ్బులు లాక్కొని వెళ్లేవారు. దాంతో వ్యూహం మార్చాల్సి వచ్చింది. నేరుగా డబ్బు ఇవ్వకుండా... వారిని సాధికారత వైపు నడిపించాలని నిర్ణయించాను. అందులో భాగంగా నైపుణ్య శిక్షణ ఇప్పించాను. వీటన్నిటికీ ఒక వేదిక ఉంటే బాగుంటుందని 2019లో 'అర లూమైర్'ను స్థాపించాను.

ఫ్యాషన్‌తో ప్రయాణం...

దాడి కారణంగా ఆత్మస్థైర్యం కోల్పోయి ప్రపంచం ముందు నిలబడడానికి ఇష్టపడని మహిళలకు తొలుత కౌన్సెలింగ్ ఇచ్చాను. పలు సైకాలజీ వర్క్‌షాప్‌లు నిర్వహించాను. అదేసమయంలో వారిని స్వశక్తి సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు ఫ్యాషన్‌ను ఒక మార్గంగా ఎంచుకున్నాను. ఆ మహిళల్లో కొందరికి కుట్టు పని తెలుసు. కొందరికి ఎంబ్రాయిడరీ తెలుసు. వారి నైపుణ్యానికి మరింత పదును పెట్టి, వినూత్న డిజైన్లలో డ్రెస్‌లు రూపొందించేలా తీర్చిదిద్దాం. ఇప్పటివరకు 123 మంది బాధితులను మా సంస్థ ద్వారా ఆదుకున్నాం.

మిలాన్‌లో మెరుపులు...

ముఖ్యంగా ఎనభై, తొంభై ఏళ్లనాటి చీరలను రీసైక్లింగ్ చేసి, ఆకర్షణీయమైన బ్లేజర్లుగా మలిచాం. వాటిని గత నెలలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'మిలాన్ ఫ్యాషన్ వీక్'లో ప్రదర్శించాం. ఒకప్పుడు ముఖం దాచుకున్న బాధిత మహిళలు... హుందాగా ర్యాంప్‌పై నడిచారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫ్యాషన్ సంస్థలు, డిజైనర్ల అభినందనలు అందుకున్నారు. అంతేకాదు... సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు స్వశక్తిని నమ్ముకుని, ఆత్మస్థైర్యంతో నిలబడిన వారి గురించి గొప్పగా చూపిస్తూ ఒక చిత్రం కూడా రూపొందించారు. 'ఫ్యాషన్ వీక్‌లో అత్యంత అందమైన సందర్భం ఇది' అంటూ ఆహూతులు ప్రోత్సహించారు. ఇది ఆ మహిళల జీవితంలోనే కాదు, నా జీవితంలో కూడా అరుదైన, మరిచిపోలేని రోజు. ఏదిఏమైనా నా లక్ష్యం ఒక్కటే... దాడివల్ల కాలిన గాయాలతో మానసికంగా కుంగిపోయిన మహిళల బాధను పంచుకొని, వారిని తిరిగి జనజీవన స్రవంతిలో కలపడం. అందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను."

సెలబ్ ఫిట్

జీనత్ అమనుల్లా ఖాన్... ఉరఫ్ జీనత్ అమన్. 1970, 80 దశకాల్లో బాలీవుడ్‌ను ఒక ఊపు ఊపిన నటి. అందమైన రూపం... ఆకర్షణీయమైన శరీరాకృతితో ఒకప్పుడు కోట్లాదిమంది అభిమానుల గుండె చప్పుడై వెలిగిన జీనత్... నేటికీ అదే ఫిట్‌నెస్‌తో అలరిస్తున్నారు. 73 మూడేళ్ల వయసులోనూ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా కనిపిస్తున్నారు. తన రోజువారీ కార్యకలాపాలు... ఆరోగ్యకర జీవన ప్రయాణం గురించిన విశేషాలు పంచుకొంటూ... స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తన ఆహార నియమాలు, ఫిట్‌నెస్ గురించి ఇటీవల ఆమె పెట్టిన ఓ పోస్టు అందర్నీ ఆకర్షిస్తోంది.

ఏడు పదుల్లోనూ అదే ఉత్సాహం

'మిస్ ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్' కిరీటాన్ని అందుకొని... సినీ రంగ ప్రవేశం చేసిన జీనత్ అతి తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఆరంభంలో తడబడినా... దేవ్‌ఆనంద్ 'హరేరామా హరేకృష్ణ'తో తిరుగులేని నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అది మొదలు అలనాటి బడా కథానాయకుల అందరి సరసనా నటించి... అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్‌గా ఎదిగారు. అయితే వైవాహిక జీవితంలో మానసిక, శారీరక వేధింపులకు గురైన ఆమె... ఆటుపోట్లను తట్టుకొని నిలబడ్డారు. దాదాపు వంద చిత్రాల్లో నటించారు. ఆమె కెరీర్‌లో 'హరేరామ హరే కృష్ణ', 'హీరా పన్నా', 'సత్యం శివం సుందరం', డాన్, 'కుర్బానీ' లాంటి ఎన్నో మెగా హిట్స్ ఉన్నాయి. ఏడు పదులు దాటిన వయసులోనూ జీనత్... అవకాశం వచ్చినప్పుడల్లా తెరపై మెరుస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ తాజా సిరీస్ 'ద రాయల్స్'లో కనిపించారు. సినిమాల్లో చేసినా చేయకపోయినా... నిత్యం ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులను పలకరిస్తుంటారు. అక్కడ ఆమెకు ఫాలోవర్స్ కూడా లక్షల్లో ఉన్నారు. తన వ్యక్తిగత విషయాలతో పాటు ట్రెండీ దుస్తులు ధరించి, ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకొంటారు. మధ్యమధ్యలో ఆరోగ్యకర జీవన విధానానికి అనుసరించాల్సిన మార్గాల గురించి వివరిస్తుంటారు. ఈ వయసులో కూడా తాను ఇంత ఫిట్‌గా, చలాకీగా కనిపించడానికి కారణం ఆహారపు అలవాట్లేనని పేర్కొన్న జీనత్... ఆ విశేషాలను ఇలా చెప్పుకొచ్చారు.



"శరీరం, మనసు ఆరోగ్యం కోసం నిత్యం నేను పోషకాలు ఉన్న ఆహారం మాత్రమే తీసుకొంటా. కానీ కచ్చితమైన ఆహార నియమాలంటూ ఏవీ లేవు. నా దృష్టిలో



ఆహారం అనేది ఇంధనం లాంటిది. ఎంత అవసరమో అంతే తీసుకోవాలి. ఆరోగ్యకర జీవనానికి శారీక దారుఢ్యం, మితాహారం ముఖ్యమని, అయితే తినేది తాజాగా ఉండాలని అమ్మ చెప్పేది. నేటికీ అదే నేను అనుసరిస్తున్నాను.

- ఉదయం అల్పాహారంలో నానబెట్టి, తొక్క తీసిన బాదం పప్పు, బ్లాక్ టీ. ఇది జీవక్రియను మెరుగుపరుస్తుంది. గత కొన్నేళ్లుగా చీజ్‌తో కలిపి అవకాడో టోస్ట్ తీసుకొంటున్నా.. ఒకవేళ మన వంటకాల వైపు మనసు మళ్లితే పోహ తింటాను.
- మధ్యాహ్నం కడుపు నిండా భోజనం ఆరగిస్తాను. అయితే సాధ్యమైనంతవరకు శాకాహారానికే ప్రాధాన్యం ఇస్తా. నా భోజనంలో సాధారణంగా పప్పు, సబ్జీతో రోటీ ఉంటుంది. లేదంటే ఆకుకూరలు, పచ్చి బఠానీ, బంగాళదుంప కలిపి చేసిన కూర, పన్నీర్ టిక్కా, ఇంట్లో తయారైన టమాటో పచ్చడితో రోటీ తీసుకొంటాను.
- సాయంత్రం ఐదు గంటలకు కొద్దిగా ఉప్పు, మసాలా వేసి వేయించిన మఖానా తింటాను. తీపి పదార్థాలకు దూరంగా ఉంటాను. అలాగని పూర్తిగా మానేయలేదు. అప్పుడప్పుడూ తింటూనే ఉంటా.
- నా ఆహార నియమాలు కఠినమైనవేమీ కావు. సరళమైనవి, ఎవరైనా అనుసరించ తగినవి. కాకపోతే తీసుకొనే ఆహారం ఆరోగ్యకరమైనది, సమతులమైనది అయివుండాలి. అదొక్కటే నేను చెప్పేది. వీటన్నిటితో పాటు నిత్యం వ్యాయామాలు కూడా ముఖ్యమని మరిచిపోకండి.



పెదాల నలుపు తగ్గేదెలా?

పోషకాహార లోపం, రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, శరీరంలో తగినంత తేమ లేకపోవడం లాంటి కారణాల వల్ల పెదాలు నల్లగా మారుతుంటాయి. చిన్న చిట్కాలతో పెదాల నలుపును తగ్గించుకోవచ్చు.

- రాత్రి పడుకునేముందు పెదాలకు కలబంద గుజ్జును పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. దీంతో పెదాలమీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.
- ఒక చెంచా నిమ్మరసంలో పావు చెంచా తేనె కలిపి పెదాలకు పట్టించాలి. పావుగంట తరువాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తూ ఉంటే క్రమంగా పెదాలు రంగు తిరుగుతాయి.
- రోజూ ఉదయాన్నే పెదాలకు ఆలుగడ్డ రసం రాసి వేళ్లతో మెల్లగా రుద్దాలి. తరచూ ఇలా చేయడం వల్ల తగినంత తేమ అంది పెదాలు మృదువుగా మారతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల పాలు, అరచెంచా పసుపు వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని పెదాలకు పట్టించి ఆరిన తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే పెదాల నలుపుదనం విరుగుతుంది.
- పెదాలకు కీరదోస రసం రాసినా మంచి ఫలితం కనిపిస్తుంది
- ఒక చెంచా నారింజ తొక్కల పొడిలో ఒక చెంచా తేనె కలిపి పేస్టులా చేయాలి. దీన్ని పెదాలకు పట్టించి పది నిమిషాల తరువాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. రెండు రోజులకు ఒకసారి ఇలా చేస్తుంటే క్రమంగా పెదాలు ఎర్రగా మారతాయి.
- గుప్పెడు గులాబీ రేకులను తీసుకుని పాలు చిలకరిస్తూ మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని పెదాలకు పట్టించి కొద్దిగా ఆరిన తరవాత వేళ్లతో మర్దన చేయాలి. తరచూ ఇలా చేస్తుంటే పెదాల నలుపు తొలగిపోతుంది.

మేయర్ దంపతుల హత్య కేసులో..
ఐదుగురికి ఉరిశిక్ష

- పదేళ్లనాటి కేసులో చిత్తూరు కోర్టు తీర్పు
- మేనల్లుడే ప్రధాన హంతకుడు
- ఆర్థికంగా అత్తామామ సహకరించడంలేదని చాంబరులో కత్తులతో దాడిచేసి హత్య

చిత్తూరు లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో పదేళ్ల కిందట సంచలనం రేపిన మేయర్ దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూతో సహా ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ, జిల్లా కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. 2015 నవంబరు 17వ తేదీన అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్‌ను మున్సిపల్ కార్యాలయంలోని వారి చాంబర్‌లోనే చంపేశారు. అనురాధను తుపాకీతో కాల్చగా, మోహన్‌ను కత్తులతో నరికి చంపారు. అనురాధ అక్కడికక్కడే చనిపోగా, మోహన్ అదేరోజు సాయంత్రం వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. అప్పట్లో ఈ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. మోహన్ మేనల్లుడు శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూయే ఈ ఘాతుకానికి పాల్పడటం మరింత కలకలం రేపింది. కాల్పులకు ప్రత్యక్ష సాక్షి సతీశ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు చింటూతోపాటు 23 మందిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించారు. ఈ కేసులో 133 మంది సాక్షులుండగా, 57 మందిని కోర్టు విచారించింది. పదేళ్లపాటు సుమారు 352 సార్లు ఈ కేసు వాయిదా పడింది. ఈ నెల 24వ తేదీన కోర్టు చింటూ సహా ఐదుగురిపై నేర నిర్ధారణ జరిపింది.

రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్నారనే..

మేయర్ దంపతుల హత్యకు దారితీసిన కారణాలను పోలీసులు చార్జిషీట్‌లో కోర్టుకు వివరించారు. ఆ చార్జిషీట్‌లోని అంశాలను అనుసరించి.. మేయర్ అనురాధ, మోహన్‌లకు ఆయన మేనల్లుడు చింటూ అన్నివిషయాల్లో అండగా ఉండేవాడు. వారి కోసం తాను చేస్తున్న ఉద్యోగాన్ని కూడా వదులుకుని నమ్మినబంటులా పనిచేసేవాడు. అయితే, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం కంతల చెరువు వద్ద ఉన్న మోహన్ క్వారీ విషయంలో తొలిసారి చింటూకు ఆశాభంగమైంది దానిని తనకు ఇవ్వాలని చింటూ అడిగాడు. ఇంట్లో మాట్లాడి తర్వాత చెబుతానని మోహన్ అనడంతో.. చింటూ అహం దెబ్బతింది. చిత్తూరు నగరపాలక సంస్థ మార్కెట్ వేలం వ్యవహారం చింటూను మరింత ఆగ్రహానికి గురిచేసింది. రూ.16లక్షలుగా ఉన్న మార్కెట్ వేలాన్ని రూ.90 లక్షలకు పాడించి తనను ఆర్థికంగా ఇబ్బంది పెట్టారంటూ అత్తామామలపై కోపాన్ని పెంచుకున్నాడు. తాను గంగనపల్లె రోడ్డులో కొన్న స్థలానికి దారి విషయంలో సహకరించలేదని అనురాధ, మోహన్ నుంచి చింటూ దూరం జరిగాడు. తన వెంట ఉండే కుర్రాళ్లతో చిత్తూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టు పనులకు చింటూ టెండర్లు వేయించాడు. ఆ పనులు కూడా వేరే కాంట్రాక్టర్లకు పోవడంతో మరింత పగ పెంచుకున్నాడు. తాను రాజకీయంగా ఘర్షణ పడిన సీకేబాబుతో తన మామ లోలోపల కలిసిపోయాడని చింటూ అనుమానం పెంచుకున్నాడు. అత్తామామలను అంతమొందిస్తేనే రాజకీయంగా ఎదుగుతామని, లేదంటే తనకు మనుగడే ప్రశ్నార్థకరమవుతుందనే నిర్ణయానికి చింటూ వచ్చాడు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణే!

డిసెంబరు లేదా జనవరిలో ముహూర్తం.. పలువురి శాఖల్లోనూ భారీ మార్పులు

- కొత్త మంత్రులకు మాత్రం మినహాయింపు
- పనితీరుపై ఇప్పటికే ఒక దఫా మీనాక్షి నివేదిక
- ఐదుగురి తీరుపై అధిష్ఠానం పెదవి విరుపు
- మళ్లీ సమీక్షనాటికి మెరుగుపరుచుకుంటేనే సేఫ్

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో భారీ ప్రక్షాళన జరగనుందా!? పనితీరు బాగా లేని కొంతమంది మంత్రులను తప్పించి.. అదే వర్గానికి చెందిన మరికొందరికి అవకాశం కల్పించనున్నారా!? కొంతమంది మంత్రుల శాఖలనూ మార్చనున్నారా!? ఇందుకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. తెలంగాణ ప్రభుత్వ పాలననే నమూనాగా చూపి వచ్చే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. స్థానిక ఎన్నికల తర్వాత డిసెంబరులో లేదా వచ్చే ఏడాది జనవరిలో భారీ ప్రక్షాళన చేపట్టనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబరుకు రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించనున్నట్లు తెలుస్తోంది. దీనితోపాటు మంత్రుల శాఖల్లోనూ భారీగా మార్పులు తీసుకు రానున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ కసరత్తులో కొత్తగా నియమితులైన నలుగురు మంత్రులకు మినహాయింపు ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో మరో ఇద్దరికి అవకాశం ఉంది. పునర్ వ్యవస్థీకరణతో మరి కొందరికి అవకాశం దక్కనుందని చెబుతున్నారు. వాస్తవానికి, క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి సహా 18 మందికి అవకాశం ఉంటుంది. కొత్తగా ప్రభుత్వం ఏర్పడినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, మరో 11 మంది మంత్రులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. సుదీర్ఘ చర్చల తర్వాత జూన్‌లో వాకిటి శ్రీహరి (బీసీ ముదిరాజ్), గడ్డం వివేక్ (ఎస్సీ మాల), అడ్లూరి లక్ష్మణ్ (ఎస్సీ మాదిగ)లను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. తాజాగా అజరుద్దీన్ క్యాబినెట్‌లోకి చేరారు. దీంతో, సీఎంతో కలిపి మంత్రుల సంఖ్య 16కు చేరుకుంది. వాస్తవానికి, సీఎంతోపాటు తొలుత ప్రమాణ స్వీకారం చేసిన 11 మంది మంత్రుల పనితీరుపై అధిష్ఠానం ఇప్పటికే సమీక్ష చేసింది. ఆయా శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులుగా, రాజకీయ నాయకులుగా వ్యవహరించిన తీరును పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం.. ఒక్కో మంత్రికి సంబంధించి సమగ్ర నివేదికను రూపొందించింది. వారి ప్రోగ్రెస్ రిపోర్టును పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అందజేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఐదుగురు మంత్రుల పనితీరుపై పెదవి విరిచిన అధిష్ఠానం.. మళ్లీ సమీక్ష నాటికి మెరుగుపరుచుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలో మరోమారు సమీక్ష జరిపి మంత్రివర్గంలో భారీ ప్రక్షాళన తీసుకురానున్నట్లు తెలుస్తోంది. పనితీరు మెరుగు పరుచుకోని మంత్రుల స్థానంలో అదే వర్గాలకు చెందిన వేరొకరిని తీసుకోనున్నట్లు చెబుతున్నారు. అలాగే కీలకమైన శాఖలు నిర్వహిస్తున్న కొందరు మంత్రుల నుంచి వాటిని తప్పించి వేరే శాఖలు కేటాయించే అవకాశం ఉందంటున్నారు. పునర్వ్యవస్థీకరణ తర్వాత.. ఇప్పటికే ఖాళీగా ఉన్న రెండు సీట్లు సహా నలుగురైదుగురికి కొత్తగా అవకాశం దొరకనుందని చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ చీఫ్ విప్, ఇతర పదవులనూ భర్తీ చేయనున్నారు.

ఒత్తిడిలకు తలొగ్గేదే లే..!

మంత్రి పదవుల కోసం ఇటు సీఎం రేవంత్ రెడ్డి, అటు అధిష్ఠానంపై పార్టీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఒత్తిడి తీసుకు వస్తుండడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితుల్లోనే విస్తరణ ఆలస్యమవుతూ వస్తోంది. ముఖ్యంగా, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రివర్గంలో ఉండటంతో ఇద్దరిలో ఒక్కరికే అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేసింది. సుదర్శన్ రెడ్డి కోసం సీఎం రేవంత్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు కోసం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రయత్నాలు చేశారు. వారి విషయంలోనూ అధిష్ఠానం సుముఖత చూపలేదు. ప్రేమ్‌సాగర్‌రావును పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా, సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమించడంతో వారిద్దరూ రేసు నుంచి తప్పుకొన్నట్లు స్పష్టమైంది. సీఎం, డిప్యూటీ సీఎంలు స్వయంగా సిఫార్సు చేసిన వారికే మంత్రి పదవులు నిరాకరించడం ద్వారా మిగిలిన వారికీ అధిష్ఠానం స్పష్టమైన సంకేతం ఇచ్చిందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

హాస్టల్లో విషాహారం

- 52 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలు
- రాత్రి భోజనం చేశాక కడుపునొప్పి, వాంతులు
- 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- గద్వాల జిల్లా ధర్మవరం వసతి గృహంలో ఘటన
- కొందరి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు సమాచారం



గద్వాల క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పరిధిలోని ధర్మవరం బీసీ వసతి గృహంలో విషాహారం కారణంగా 52 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 8గంటలకు విద్యార్థులు భోజనం చేశారు. కొద్దిసేటికే కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నారు. తొలుత రెండు 108 అంబులెన్స్‌లలో బాధిత విద్యార్థులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఇంకొందరిని మరో ఆంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. మొత్తంగా 52 మంది విద్యార్థులు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చాలా మంది పరిస్థితి నిలకడగానే ఉన్నా కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఇంకా కొన్ని గంటలు గడిస్తే కాని వారి ఆరోగ్య పరిస్థితిని చెప్పలేమని డాక్టర్లు చెబుతున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో
రూ.3.6 కోట్ల హైడ్రోఫోనిక్ గంజాయి పట్టివేత

హైదరాబాద్/శంషాబాద్ రూరల్/కంది, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి హైడ్రోఫోనిక్ గంజాయి పట్టుబడింది. అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తి బ్యాంకాక్ నుంచి శుక్రవారం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు.. ఖాదర్ బ్యాగులు తనిఖీ చేయగా అతని వద్ద 3.6 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.3.6కోట్లు ఉంటుందన్నారు. ఖాదర్ వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం కస్టమ్స్ కార్యాలయానికి తరలించారు. సాధారణంగా బ్యాంకాక్ నుంచి వస్తున్న మహిళా ప్రయాణికుల వద్ద నుంచి ఎక్కువగా హైడ్రోఫోనిక్ గంజాయి పట్టుబడుతోందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది-శంకర్‌పల్లి రహదారి వద్ద శుక్రవారం రూ.10 లక్షల విలువైన 964 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కంది హైవేలో విశాఖ ఏజెన్సీ నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్ తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాలతో తనిఖీలు చేపట్టామని ఆయన అన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ కాటేదాన్‌లోని బృందావన్ కాలనీకి చెందిన అనిల్‌కుమార్ అనే వ్యక్తి హాష్ ఆయిల్‌ను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ చేసిన చేసిన నిందితుడిని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

- ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 2 నుంచే..
- షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్ బోర్డు

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల షెడ్యూల్ విడుదలయింది. 2026 ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ దాకా శని, ఆదివారాలు కూడా కలిపి రెండు పూటలా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా, మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలదాకా ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇక జేఈఈ-మెయిన్స్-2026 పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రాక్టికల్ పరీక్షలు రాసే అవకాశం ఇవ్వనున్నారు. జనవరి 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా నైతిక, మానవ విలువలు పరీక్ష ఉండగా.. జనవరి 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా పర్యావరణ విద్య పరీక్ష ఉంటుంది. ఇక ఫస్టియర్, సెకండియర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 25వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలదాకా జరుగనున్నాయి. కింద టేబుల్‌లో పేర్కొన్న షెడ్యూల్ ఇంటర్ వృత్తి విద్య పరీక్షలకు కూడా వర్తిస్తుందని ఇంటర్‌బోర్డు ప్రకటించింది.

ఫస్టియర్

25-2-2026(బుధవారం)	పార్ట్-2 సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1
27-2-2026(శుక్రవారం)	ఇంగ్లీష్ పేపర్-1
2-3-2026(సోమవారం)	మ్యాథ్స్-1(ఏ), బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1
5-3-2026(గురువారం)	మ్యాథ్స్ పేపర్-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1
9-3-2026(సోమవారం)	ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్-1
12-3-2026(గురువారం)	కెమిస్ట్రీ-1, కామర్స్-1
14-3-2026(శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, బ్రిడ్జి కోర్సు-1
17-3-2026(మంగళవారం)	మోడ్రన్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1

సెకండియర్

26-2-2026(గురువారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
28-2-2026(శనివారం)	ఇంగ్లీష్ పేపర్-2
3-3-2026(మంగళవారం)	మ్యాథ్స్ పేపర్-2(ఏ), బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్-2
6-3-2026(శుక్రవారం)	మ్యాథ్స్ పేపర్-2(బీ), జువాలజీ-2, హిస్టరీ-2
10-3-2026(మంగళవారం)	ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2
13-3-2026(శుక్రవారం)	కెమిస్ట్రీ-2, కామర్స్-2
16-3-2026(సోమవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, బ్రిడ్జి కోర్సు-2
18-3-2026(బుధవారం)	మోడ్రన్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2

డీఎడ్ సెకండియర్ ఫలితాలు విడుదల

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) సెకండియర్ పరీక్షల ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం శుక్రవారం విడుదల చేసింది. ఫలితాలు వెబ్‌సైట్ (www.bse.telangana.gov.in)లో చూసుకోవచ్చు. ఇక డీఎడ్ ఫస్టియర్‌తో పాటు డిప్లొమా ఇన్ ప్రి స్కూలు ఎడ్యుకేషన్ 2024-26 బ్యాచ్ విద్యార్థులకు ఫైనల్ లెసన్ టీచింగ్ ప్రాక్టికల్స్ రెండు విడతలుగా నవంబరు 10 నుంచి 14వ తేదీ దాకా, మళ్లీ నవంబరు 17వ తేదీ నుంచి 21వ తేదీ దాకా జరుగనున్నాయి.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

భయపడొద్దు... పోలీసులున్నారు

- డీప్‌ఫేక్ బాధితులకు చిరంజీవి భరోసా
- సజ్జనార్ ఆధ్వర్యంలో ఘనంగా ఎక్తా దివస్ రన్



'డీప్‌ఫేక్...సైబర్ నేరాలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ప్రజలకు పోలీసులు అండగా ఉన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడమే కాదు దాని దుర్వినియోగాన్ని అరికట్టడమూ అంతే ముఖ్యం' అని హీరో చిరంజీవి అభిప్రాయపడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జాతీయ ఐక్యతా దినోత్సవం(ఎక్తా దివస్)ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిరంజీవితో పాటు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. టెక్నాలజీని దుర్వినియోగం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఇటీవల ఆయన డీప్‌ఫేక్‌పై సైబర్ క్రైమ్‌లో చేసిన ఫిర్యాదును మీడియా ప్రస్తావించగా.. డీప్‌ఫేక్ అనేది సమాజానికి గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ అంశాన్ని సీపీ సజ్జనార్, డీజీపీ శివధర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారని, వారు సైబర్ నేరగాళ్లపట్ల కఠినంగా వ్యవహరిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి కఠినమైన చట్టం చేయాలని అభిప్రాయపడ్డారు. 'యూనిటీ ఇన్ డైవర్సిటీ' అనే పటేల్ సందేశాన్ని పోలీసులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.

-హైదరాబాద్ సిటీ(ఆంధ్రజ్యోతి)

ఓ నీలి మేఘం.. పెంచింది వేగం!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈనెల 7న తెలుగు సహా పలు భాషల్లో విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కురిసే వాన' అనే ప్రణయ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరాలు సమకూర్చారు. కపిల్ కపిలన్ మైమరపించేలా ఆలపించారు. 'కురిసే వాన తడిపేయాలన్న భూమే ఏదో... సరదా పడుతూ పురి విప్పేస్తున్న నెమలే ఏదో... ఓ నీలి మేఘం, పెంచింది వేగం.. ఆ జాబిలమ్మ చెంత చేరి పంత పాడి, కమ్మితే మైకం...లాయి లాయి లాయిలే...' అంటూ వినగానే ఆకట్టుకునేలా సాగుతుందీ గీతం.

'తెలంగాణ రైజింగ్'కు సహకరిస్తా

సల్మాన్‌ఖాన్



'తెలంగాణ రైజింగ్' నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు తనవంతు సహకారం అందించనున్నట్లు బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ తెలిపారు. గురువారం ముంబైలో ఓ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డిని.. సల్మాన్ ప్రత్యేకంగా కలిశారు. ఆ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని సల్మాన్ చెప్పినట్లు ఓ ప్రకటనలో సీఎం కార్యాలయం తెలిపింది.

-హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)



నిర్మాత అల్లు అరవింద్ తనయుడు... హీరో శిరీష్, నయనికల నిశ్చితార్థం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

చిన్ని గుండెలో అన్ని ఆశలా



రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా మహేశ్ బాబు పి. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈనెల 28న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా మేకర్స్ 'చిన్ని గుండెలో అన్ని ఆశలా..' అంటూ సాగే మూడో గీతాన్ని విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని మెర్విన్, సత్య యామిని పాడారు. వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చారు.

తొలిసారి కెమెరా ముందుకు



నందమూరి బాలకృష్ణ చిన్న కూతురు, విశాఖపట్నం ఎంపీ భరత్ సతీమణి నందమూరి తేజస్విని తొలిసారి కెమెరా ముందుకొచ్చారు. ఓ వాణిజ్య ప్రకటనలో నటించారు. ఓ ప్రముఖ ఆభరణాల సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న తేజస్విని ఇందులో భాగంగా ఆ సంస్థకు సంబంధించిన వాణిజ్య ప్రకటనలో నటించారు. నటనలోనూ, నృత్యంలోనూ తన ప్రతిభను చాటుకున్నారు.

నిన్నొదిలి కాసేపైనా ఉంటానా..



అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంటగా నూతన దర్శకుడు నాని కాసరగడ్డ తెరకెక్కించిన చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. ఈనెల 21న విడుదలవుతోంది. తాజాగా 'కన్నొదిలీ..కలనొదిలీ కనుపాపే ఉంటుందా..నిన్నొదిలీ, నే కదిలీ కాసేపైనా ఉంటానా...' అంటూ సాగే పాటను ఆవిష్కరించారు. ఈ ప్రేమ గీతాన్ని దేవ్ పవార్ రాయగా, భీమ్స్ సిసిరోలియో అద్భుతంగా స్వరపరిచారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఆలపించడం ఈ పాటకు అదనపు ఆకర్షణను తీసుకొచ్చింది. అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంట చూడ చక్కగా ఉంది.



నాన్న ప్రేమే కథగా

త్రినాథ్ కటారి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు మీ ఎదవ'. బళ్లారి శంకర్ నిర్మాత. సాహితీ అవంచ కథానాయిక. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా త్రినాథ్ కటారి మాట్లాడుతూ 'నాన్న బిడ్డలకు పంచే ప్రేమే మా సినిమాకు కథ. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తుంది. చక్కని ప్రేమకథతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అని చెప్పారు. యువతకు చక్కని సందేశం ఇచ్చే చిత్రమిది, పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి అని సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ చెప్పారు.

రాష్ట్రంలో 3,179 వైద్య పీజీ సీట్లు

ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా 75 సీట్లు

కాలేజీల వారీగా వివరాల వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొత్తం 3,179 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు ఉన్నాయని జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది కొత్తగా 75 సీట్లు పెరిగితే.. ఒక్క సనత్‌నగర్ ఈఎస్‌ఐ కళాశాలలోనే 23 పీజీ సీట్లు పెరిగినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 సంవత్సరానికి గాను ఉన్న పీజీ సీట్ల వివరాలను కాలేజీల వారీగా ఎన్‌ఎంసీ తన వెబ్‌సైట్‌లో శుక్రవారం విడుదల చేసింది. ఈ సీట్ల మ్యాట్రిక్స్ నీట్ పీజీ 2025-26 విద్యా సంవత్సరం కోసమని ప్రకటించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,390 పీజీ సీట్లుండగా.. మిగిలినవన్నీ ప్రైవేటు కాలేజీల్లో ఉన్నాయని తెలిపింది. కొత్తగా ప్రారంభమైన రామగుండం, సూర్యాపేట, నల్గొండ, కాలేజీల్లో కూడా డెర్మటాలజీ, అనస్థీషియా, గైనకాలజీ, సర్జరీ, ఆర్థో, ఇతర విభాగాల్లో సీట్లు పెరిగినట్లు ఎన్‌ఎంసీ పేర్కొంది.

దేశంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

500 గిగావాట్ల ఉత్పత్తిలో 74 శాతం

థర్మల్ కేంద్రాల నుంచే..: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): దేశంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతోందని, 500 గిగావాట్ల ఉత్పత్తిలో 74 శాతం థర్మల్ కేంద్రాల నుంచే వస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల కోసం పీఎం కుసుమ్ పథకం, గృహ అవసరాల కోసం పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేస్తున్నాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో పంటల కనీస మద్దతు ధర పెంచాం. తెలంగాణలో 450 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతించాం. నైవేలీ కార్పొరేషన్ లిమిటెడ్ తెలంగాణలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో సోలార్ విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో 9.8 శాతం మేర విద్యుత్తు డిమాండ్ ఉంది. ఈ ఏడాది మార్చిలో రాష్ట్రంలో 17,100 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం తగినంత విద్యుత్తు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఇది తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. తెలంగాణ సర్కారు సింగరేణి కంపెనీకి రూ.42 వేల కోట్ల బకాయి పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల కారణంగానే ఈ దుస్థితి ఏర్పడింది' అని వ్యాఖ్యానించారు.

అభివృద్ధిని గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

పీజేఆర్‌పై ఉన్న గౌరవంతో రాజకీయ వైరుధ్యాన్ని పక్కన పెట్టారని, పీజేఆర్ కుటుంబానికి అండగా నిలిచి.. మరణించిన కుటుంబంలో ఏకగ్రీవానికి ప్రయత్నించారని తెలిపారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఈ మంచి సంప్రదాయాన్ని తుంగలో తొక్కి.. దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాదా? అని నిలదీశారు. పీజేఆర్ కుటుంబానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టిన బీఆర్ఎస్.. నేడు సానుభూతి ఓట్లను అడుగుతోందని మండిపడ్డారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు తుమ్మల, అజారుద్దీన్, మహేశ్‌గౌడ్, అభ్యర్థి నవీన్‌యాదవ్ తదితరులు

కంటోన్మెంట్‌లో రూ.4వేల కోట్లతో పనులు..

"ఆనాటి సీఎం, మునిసిపల్ శాఖ మంత్రి మీ బస్తీలకు వచ్చారా? మీ సమస్యలను పరిష్కరించారా? పదేళ్లలో ఏనాడైనా సినీ కార్మికులను కలిశారా? పలకరించారా? కనీసం వాళ్ల ఆరోగ్యం దెబ్బతింటే దవాఖానాల్లో మందు వేయాలనే ఆలోచన చేశారా?" అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో సానుభూతి కన్నీళ్ల ముసుగులో గెలవాలని అనుకుంటే.. అక్కడి ప్రజలు అభివృద్ధి కావాలంటూ శ్రీగణేష్‌ను గెలిపించారని తెలిపారు. కంటోన్మెంట్‌లో ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ ఇబ్బందిగా మారిన ఎలివేటెడ్ కారిడార్లను, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామని, రూ.4 వేల కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతం నుంచి ఓట్లు వేయించుకొని సికింద్రాబాద్ నుంచి రెండుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి.. మెట్రోరైలుకు, మూసీనది అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. "ఉప ఎన్నిక రాగానే జూబ్లీహిల్స్‌లో కార్పెట్ బాంబింగ్ చేస్తారట! సిగ్గుండాలి.. పాకిస్థాన్ మీద బాంబులు వేయరుగానీ.. జూబ్లీహిల్స్‌లో కార్పెట్ బాంబింగ్ చేయడానికి ఇదేమైనా బీజేపోళ్లా బాబు జాగీరా? ఎవరైనా అభివృద్ధి చేయాలనుకుంటారు. బీజేపీ వాళ్లు బిచ్చమడిగేందుకు వస్తారా?" అంటూ రేవంత్ మండిపడ్డారు. నగరాన్ని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని, తమకు పుట్టగతులు ఉండవనే ఉద్దేశంతో బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ చచ్చిపోయి బీజేపీని గెలిపించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా రాష్ట్రానికి నయా పైసా తీసుకొచ్చారా? అని నిలదీశారు..

బీఆర్ఎస్‌కు ఓటేస్తే పథకాలు రద్దవుతాయి..

పేదోళ్ల అండగా నిలబడితేనే రెండుసార్లు కేసీఆర్ సీఎం అయ్యారని, మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారని సీఎం రేవంత్ అన్నారు. కానీ, ఏనాడు పేదలకు రేషన్‌కార్డు, సన్నబియ్యం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించారా? ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే.. ఆటోవాళ్లను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్సు ఉచితం బంద్ చేయాలంటూ ఆటోల్లో తిరుగుతూ ఫొటోలు దిగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే పిల్లలకు పెడుతున్న సన్న బియ్యం రద్దవుతాయని, పేదోళ్లకు రూ.200 ఉచిత విద్యుత్ బంద్ అవుతుందని, 25 వేల మందికి ఇచ్చిన రేషన్‌కార్డులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం రద్దవుతాయని తెలిపారు. కన్నీళ్లతో మోసగించే ప్రయత్నం చేస్తున్నారని, సెంటిమెంట్ ముసుగులో అభివృద్ధిని ఆపుకోవద్దని సూచించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అజరుద్దీన్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామన్నామని, ఆయన ఓడిపోయినా.. ఆనాటి మాట ప్రకారం ఆయనను మంత్రిని చేసి ప్రచారానికి వచ్చానని గుర్తు చేశారు. 'మీరు ఒక్క ఓటు వేస్తే నవీన్ ఎమ్మెల్యే అవుతారు.. అజరుద్దీన్ మంత్రిగా మీ సమస్యలను పరిష్కరిస్తారు. అజరుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే బీజేపీకి కడుపు నొప్పి ఎందుకు? బీఆర్ఎస్‌కు దుఃఖం ఎందుకు? ఓ మైనారిటీ మంత్రిగా.. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్సీ వహించిన అజరుద్దీన్ మంత్రివర్గంలో ఉండొద్దా?" అని రేవంత్ నిలదీశారు. తమ మంత్రులు ఇక్కడి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అభివృద్ధి పనులు ప్రారంభించామని, బీఆర్ఎస్ గెలిస్తే ఆ పనులు నిలిచిపోతాయని అన్నారు.

మహిళలకు మంత్రి పదవి ఎందుకివ్వలేదు?

2014 నుంచి 2019 వరకు ఒక్క ఆడబిడ్డకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించలేదని, ఆడబిడ్డలు రాజ్యాన్ని నడపలేరా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వారు చేసిన మోసానికి సొంత చెల్లెలు ఇల్లిల్లు తిరుగుతోందని, ఇంటి ఆడబిడ్డ కంటతడి పెడుతున్నా కనీసం కనికరం లేదని విమర్శించారు. రూ.వేల కోట్ల ప్రజల సొమ్మును పందికొక్కులా దోచుకొని ఆడబిడ్డను జైలుకు పంపారని, బయటకు వచ్చాక ఆమెను ఆదుకునే పరిస్థితి కూడా లేదని ధ్వజమెత్తారు. తనను బయటకు గెంటేశారని సొంత ఆడబిడ్డే అంటోందన్నారు. "మీ పిల్లల భవిష్యత్తు కోసం గంజాయి, డ్రగ్స్ నిషేధించాం. కానీ ఫామ్‌హౌజుల్లో గంజాయి, డ్రగ్స్‌తో దొరికితే వాళ్లపై కేసులు పెట్టొద్దంటున్నారు. గంజాయి, డ్రగ్స్‌తో దొరికినవాళ్ల రౌడీలా? పేదల కోసం నిలబడ్డ నవీన్ యాదవ్ రౌడీనా? ఈ పోటీ జూబ్లీహిల్స్‌కు పరిమితం కాదు. రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకొని.. జూబ్లీహిల్స్‌లో ముసుగేసుకొని వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ అభిమానులు కానోళ్లు ఉంటారా? అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని పెట్టే బాధ్యత నాది" అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజరుద్దీన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు బోరబండ, ఎర్రగడ్డలో సీఎం రేవంత్ ప్రచారం

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ప్రచారం చేయనున్నారు. సాయంత్రం 7 రాత్రి 9 గంటలవరకు ఈ ప్రచారం కొనసాగనుంది.

దేశ గౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు

ప్రజలకు సైనికులకు క్షమాపణ చెప్పాలి: బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దేశ ప్రజలకు, సైనికులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. పాక్ దాడి చేసినా భారత్ స్పందించలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పాక్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికుల ధైర్యసాహసాలనే అవమానించేలా ఉన్నాయన్నారు. శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిందని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై ప్రధాని మోదీ కఠిన చర్యలకు ఇది ప్రతీకని పేర్కొన్నారు.



హరీశ్‌రావును పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, బీజేపీ నేతలు

హరీశ్‌రావుకు నిర్మలాసీతారామన్ పరామర్శ

» రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ కూడా..

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే తండ్రిని (తన్నీరు సత్యనారాయణరావు) కోల్పోయిన మాజీమంత్రి హరీశ్‌రావును కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పరామర్శించారు. శుక్రవారం స్వయంగా ఫోన్‌చేసిన మాట్లాడిన ఆమె హరీశ్‌రావుకు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాగా, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, బీజేపీ నేత వేణు గోపాలాచారి, ఇతర బీజేపీ నేతలు కోకాపేటలోని హరీశ్ నివాసంలో ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా మాజీమంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నరసింహులుతో పాటు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఏపీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కూడా హరీశ్‌రావు నివాసానికి వేరు వేరుగా వచ్చి నివాళులర్పించారు.

బనకచర్లను సమావేశ ఎజెండాలో చేర్చండి

» పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ లేఖ

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును నవంబరు 7న జరిగే పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశ ఎజెండాలో చేర్చాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు పీపీఏకు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదికపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరినా స్పందించలేదని, ఈ నేపథ్యంలో ఎజెండాలో ఈ ప్రాజెక్టును చేర్చి చర్చకు అవకాశమివ్వాలని కోరారు. నవంబరు 7న హైదరాబాద్ సీడబ్ల్యూసీ ప్రాంతీయ కార్యాలయంలోని కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్‌లో పీపీఏ 17వ సమావేశం జరగనుంది. ఈ సమావేశ ఎజెండాను పంపిన అథారిటీ.. దీంతో ముడిపడిన అంశాలేమైనా చర్చించాలనుకుంటే 31లోగా తెలియజేయాలని కోరింది. దీంతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును కూడా ఎజెండాలో చేర్చాలని తెలంగాణ కోరింది.

స్కూల్లో తెగిపడిన లిఫ్ట్.. నలుగురికి గాయాలు

నిజాంపేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ తెగి పడి నలుగురు మహిళా టీచర్లతో పాటు మరో మహిళకు గాయాలైన ఘటన హైదరాబాద్ నిజాంపేట్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రగతినగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్లో ఫస్ట్ ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళుతున్న లిఫ్ట్ వైరు తెగి ఒక్కసారిగా కింద పడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్ట్‌లో మొత్తం ఏడుగురు ఉండగా.. అందులో నలుగురికి ఎముకలు విరిగాయి. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.



వివాహ బంధంతో ఒక్కటైన ప్రేమ జంట చైతన్య గౌడ్-ఇమెన్ బెన్

తెలంగాణ అబ్బాయి.. ఫ్రాన్స్ అమ్మాయి

» ఎల్లలు దాటిన ప్రేమ.. వివాహ బంధంతో ఒక్కటైన జంట

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించిది ఆ జంట. ఫ్రాన్ అమ్మాయితో ప్రేమలో పడిన ఎల్లారెడ్డిపేట యువకుడు.. పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చైతన్య గౌడ్ రెండేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా ఫ్రాన్స్ దేశానికి వెళ్లాడు. అక్కడ ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఇమెన్ బెన్ అనే యువతితో ఏర్పడిన స్నేహం కాస్త ప్రేమగా మారింది. వారి ప్రేమ విషయాన్ని ఇంట్లో వాళ్లకు చెప్పి పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలెక్కారు. వీరి వివాహం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా జరిగింది. వివాహవేడుక కోసం వరుని స్వగ్రామానికి చేరుకున్న వధువు తల్లిదండ్రులు.. హిందూ సంప్రదాయ పద్ధతిలో వరుని కాళ్లు కడిగి కన్యాదానం చేశారు.

10వేల పరిహారం ఏ మాత్రం సరిపోదు..

» రైతులను గాలికొదిలేసిన సర్కారు

» అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో బీజేపీ కార్యకర్తలపై కేసులు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



ఖమ్మం బైపాస్ రోడ్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా వరదలతో పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి కేవలం రూ.10 వేల పరిహారం ఏమాత్రం సరిపోదని, ఇది రైతులను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఖమ్మం నగరంలోని మున్నేరు పరీవాహక ప్రాంత వరద బాధితులను శుక్రవారం కలుసుకున్న రామచందర్‌రావు.. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పంటల రక్షణలో సర్కారు విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించకపోవడం అన్నదాతల ఆత్మాభిమానానికి అవమానమని, టార్పాలిన్ పట్టాల్లేకే వర్షంతో తడిచిన ధాన్యాన్ని పారబోయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల జీవితాలను గాలికొదిలేసి ప్రభుత్వం ఓట్ల కోసం పాకులాడటం ఆపివేయాలన్నారు. 3 జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని రామచందర్‌రావు తెలిపారు. అయినా రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వ పెద్దలు పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలపై కేసులతో కాంగ్రెస్ నాయకులు వేధిస్తున్నారని, అధికార పార్టీ నేతల ఒత్తిడితో విచారణలు జరుగుతున్నాయని మండిపడ్డారు. అంతకుముందు మోతీనగర్‌లోని పలువురు వరద బాధితులతో మాట్లాడి, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

నవీన్‌యాదవ్ ఆకు రౌడీ!

అలాంటి వ్యక్తిని గెలిపిస్తే అందరినీ బెదిరిస్తారు.. జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఓటెయ్యాలి

» మీ తీర్పు తెలంగాణ గోస తీర్చాలి

» కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి

» రెండేళ్లలో ఒక్కరికైనా మేలు జరిగిందా?

» షేక్‌పేట రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్/సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన నవీన్‌యాదవ్ ఓ ఆకురౌడీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడే అందరినీ భయపెడుతున్న ఆయన్ను పొరపాటున గెలిపిస్తే.. టీస్టాల్ వాళ్ల సహా అందరినీ బెదిరిస్తారని చెప్పారు. అతను ఎమ్మెల్యే అయితే ఎంతో ప్రమాదకరమన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు తెలివిగా ఆలోచించి, ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. మజ్లిస్ పార్టీకి చెందిన పలువురు నేతలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో, షేక్‌పేటలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజల్ని బెదిరిస్తున్నారని, వారికి ఎవరూ భయపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలని, కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నోటికొచ్చిన హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ రెండేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తాం.. అంటూ ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్.. ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు ఎంతో బాకీ పడిందని, ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించాలంటూ డబ్బులు ఇస్తే.. తీసుకొని మిగతా డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలని చెప్పారు. పేదల ఇళ్లను కూలగొట్టిన బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

మీ తీర్పు తెలంగాణ గోస తీర్చాలి..!

అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో స్వర్గం చూపిస్తామంటూ 420 హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని కేటీఆర్ కోరారు. నియోజకవర్గంలోని నాలుగు లక్షల ఓటర్ల తీర్పు.. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజల గోస తీర్చేలా ఉండాలన్నారు. కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే ఇచ్చిన హామీలు అమలవుతాయని, పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని, ప్రజలను పట్టించుకోడని అన్నారు. శుక్రవారం రాత్రి కేటీఆర్ షేక్‌పేటలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చావు నోట్లో తలపెడితే వచ్చిన రాష్ట్రానికి నాడు రూ.85 వేల కోట్ల అప్పు ఉండేదని, సంపద పెంచి అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలబెట్టామని చెప్పారు. కేసీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను కొనసాగించే తెలివి ఈ సర్కారుకు లేదన్నారు. రెండేళ్లలో ఈ సర్కారు వల్ల ఒక్కరికైనా మేలు జరిగిందా..? అన్నది ఆలోచించాలని కోరారు. ఓటమి భయంతో కాంగ్రెస్ ఆపద మొక్కులకు పోతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇన్నాళ్లు గుర్తుకు రాని మైనారిటీల నుంచి సినీ కార్మికుల వరకు అందరికీ ఏదో చేస్తామంటూ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.



షేక్‌పేట రోడ్‌షోలో పాల్గొన్న కేటీఆర్, మాగంటి సునీత

ఆ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించండి..

జూబ్లీహిల్స్‌లో గోపీనాథ్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారని, దురదృష్టవశాత్తు అనారోగ్య సమస్యలతో మరణించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం మీ ముందుకు వచ్చిందని, ఆ ఇంటి ఆడబిడ్డను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 'మీ జోష్ చూస్తుంటే విజయం మనదే అని తెలుస్తోంది. తేలాల్సింది మెజారిటీ మాత్రమే' అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ మళ్లీ కావాలంటే జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.



ఎర్రగడ్డలో పాదయాత్ర చేస్తూ బీజేపీకి ఓటేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న కిషన్ రెడ్డి

ఫోన్ చేస్తే చాలు.. మీ సమస్యను పరిష్కరిస్తాం

» జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ప్రభావం లేదు

» కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు

» మా నిజాయితే మా పార్టీని గెలిపిస్తుంది: కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. ప్రజల సమస్యలను తీర్చేందుకు తాము ముందుంటామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీగా తాను కోట్ల నిధులు తీసుకొచ్చానని, ఈ ప్రాంతంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు కాలనీల్లో కిషన్‌రెడ్డి పాదయాత్ర చేశారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్.. మజ్లిస్ పార్టీ ఓట్ల కోసమే ఇక్కడ పోటీ చేస్తోందని, ఇక్కడి ప్రజలు గూండాయిజాన్ని, రౌడీయిజాన్ని అంగీకరించబోరన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రతీ ఒక్కరిని కలిసి ఓటేయాలని కోరుతున్నామని, వేరే పార్టీల్లాగా రాజకీయాలు చేయాలనుకోవట్లేదని, తమ నిజాయితే తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తుందని నమ్ముతున్నామని చెప్పారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ ప్రభావం కొంచెం కూడా లేదని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌ను గెలిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని, ఈ సారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలు కూడా భావిస్తున్నారని ఆయన చెప్పారు. కాగా, రెండేళ్లపాటు ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓట్ల కోసం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. అజారుద్దీన్, మైనార్టీలపైన ప్రేమ ఉంటే రెండేళ్లుగా ఆ వర్గానికి ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగంతో ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

స్విమ్మింగ్ పూల్ కట్టిస్తా.. సీసీటీవీలు పెట్టిస్తాం

వీకెండ్ పార్టీలు.. శ్రీశైలం 'కార్తీక మాస' యాత్ర

జూబ్లీహిల్స్‌లో అపార్ట్‌మెంట్ల ఓట్లకు గాలం

బంజారాహిల్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 'స్విమ్మింగ్ పూల్ కట్టిస్తా.. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం' అని నేతలు హామీలు గుప్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో విజయం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు.. నేతలు ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, కాలనీల ఓటర్లకు గాలం వేస్తున్నారు. తటస్థులను తమ వైపుకు తిప్పుకోవడానికి ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. ఆయా అభ్యర్థుల తరఫున ప్రచార బాధ్యతలు తలకెత్తుకున్న మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. కాలనీలు, అపార్ట్‌మెంట్ సంక్షేమ సమితి కార్యాలయాలకవసరమైన వస్తువులివ్వడంతోపాటు విహార యాత్రలకు ప్రణాళికలు వేస్తున్నారు. 2 అపార్ట్‌మెంట్ల సంక్షేమ సమితిల నేతలతో మాట్లాడిన ఒక పార్టీ నాయకుడు.. తమ అభ్యర్థికి ఓటేస్తే 25 సీసీటీవీ కెమెరాలతో సంబంధిత అపార్ట్‌మెంట్‌ల భద్రతకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తదనుగుణంగా ఓ కంపెనీకి సీసీటీవీ కెమెరాల ఏర్పాటు బాధ్యత అప్పగించినా.. తమ పార్టీ గెలవగానే పని ప్రారంభిస్తామని హామీనిచ్చారు. వారికి నమ్మకం కలిగించడానికి సదరు సీసీటీవీ కెమెరాల కంపెనీకి కొంత అడ్వాన్స్ కూడా చెల్లించారు. ఇంకో నాయకుడు మరో అడుగు ముందుకేసి 500 మంది గల అపార్టుమెంట్‌కు ఏకంగా స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తానని హామీ ఇవ్వడంతోపాటు గెలవగానే పని ప్రారంభిస్తామని వాగ్దానం చేశారు. మరొకరు సదరు అపార్టుమెంటు సంక్షేమ సమితి కార్యాలయంలో రెండు 60-అంగుళాల ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు.



హైదరాబాద్‌లోనే అతిపెద్దదిగా పేరొందిన ఓ కాలనీలో గల 1200 ఓట్లలో 35 శాతానికి మించి పోల్ కావు. ఈ ఓట్లపై కన్నేసిన నాయకుడు.. ఆ కాలనీ వాసులతో జరిగిన భేటీలో.. తమ సర్కారు అధికారంలోకి వచ్చాకే కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. కాలనీ సంక్షేమ సమితి కార్యాలయానికి సుమారు రూ.5 లక్షల విలువ గల ఫర్నీచర్ కానుకగా ఇస్తానని హామీనిచ్చారు. 600 మంది ఓటర్లు గల అపార్టుమెంట్‌కెళ్లిన ఓ పార్టీ నేత వారాంతంలో హోటల్‌లో విందు ఏర్పాటు చేశారు. ఓ పార్టీ అభ్యర్థి మరో కాలనీ సీనియర్ సిటిజన్లకు కార్తీక మాసం నేపథ్యంలో రూ.2 లక్షల ఖర్చుతో శ్రీశైలం యాత్రకు పంపుతానని వాగ్దానం చేశారు.

రియాజ్ చనిపోయింది పోలీసు కస్టడీలోనే

» సీసీ ఫుటేజీలు పరిశీలించాలి

» నిజామాబాద్ ఎన్‌కౌంటర్‌పై విచారణ

సీబీఐకి ఇవ్వాలి:సిటిజన్స్ ఫోరం

బర్కత్‌పుర, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగిన రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రియాజ్ పోలీసు కస్టడీలోనే చనిపోయాడని, అతడు క్రిమినల్ కాదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు ఖలీదా పర్వీన్, సారా మాథ్యూస్, మాజిద్ సుతారి, న్యాయవాది సమీర్ అలీ, మహ్మద్ అబ్దుల్ తాజ్, షేక్ సికిందర్.. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రియాజ్ ఎన్‌కౌంటర్ అనంతరం తాము నిజామాబాద్ వెళ్లి విచారణ చేయగా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రియాజ్ బైక్ రికవరీ ఏజెంట్‌గా పని చేసేవాడని, కానిస్టేబుల్ ప్రమోద్ హత్య అనంతరం పోలీసులు రియాజ్ కుటుంబాన్ని కస్టడీలోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేశారని తెలిపారు. పోలీస్ స్టేషన్, ఆస్పత్రి పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. రియాజ్‌ను అక్టోబరు 20న ఎన్‌కౌంటర్ చేశారని, అదే నెల 17న కానిస్టేబుల్ ప్రమోద్ హత్య జరిగిందన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణను ప్రభుత్వం సిట్‌కు అప్పగించిందని, కానీ సీబీఐకి అప్పగిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను ఎవరు చంపారో తేలాలని అన్నారు. రియాజ్ చాకుతో పొడిచి ప్రమోద్‌ను చంపాడని పోలీసులు పేర్కొంటున్నారని, దీనిపై కూడా పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రియాజ్ కుటుంబానికి రూ.5 కోట్ల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

బిజినెస్

100 కోట్ల చదరపు అడుగులు..
రూ.16.4 లక్షల కోట్లు

భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై సీఐఐ- నైట్‌ఫ్రాంక్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్) నిల్వ 100 కోట్ల చదరపు అడుగులు మించిపోయిందని భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ), రియల్టీ కన్సల్టింగ్ సేవల సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా సంయుక్తంగా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. ఆ మొత్తం ఆఫీస్ స్పేస్ ప్రస్తుత విలువ 18,600 కోట్ల డాలర్లు (సుమారు రూ.16.4 లక్షల కోట్లు)గా ఉంటుందని నివేదిక అంచనా వేసింది. భారత్ నాలుగో అతిపెద్ద ఆఫీస్ మార్కెట్‌గా ఎదిగిందని, ఈ విభాగంలో వృద్ధి జోరును కొనసాగించేందుకు కొత్త స్థల సముదాయాలను నిర్మించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరంలో 20 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉన్న దేశీయ ఆఫీస్ స్పేస్ పరిమాణం.. గడిచిన 25 ఏళ్లలో ఐదింతలై వంద కోట్ల చదరపు అడుగులకు చేరింది. ఆఫీస్ స్పేస్ విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న, భవిష్యత్ అవసరాలకు సంసిద్ధమైన మార్కెట్‌గా భారత్ అవతరించిందని ఈ అసాధారణ విస్తరణ నొక్కి చెబుతున్నదని సీఐఐ-నైట్‌ఫ్రాంక్ రిపోర్టులో ప్రస్తావించాయి. గత ఏడాది కార్యాలయ స్థలాల స్థూల లీజులు 7 కోట్ల చదరపు అడుగులు దాటాయి. ఈ ఏడాదిలో గడిచిన 9 నెలల్లోనే 6.7 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగిందని నైట్‌ఫ్రాంక్ తెలిపింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలోనూ భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్ నిర్మాణాత్మక శక్తికిది నిదర్శనమని సంస్థ పేర్కొంది.

పరిమిత సరఫరా, పెరుగుతున్న డిమాండ్, డెవలపర్లలో జాగరూకత వంటి అంశాల కారణంగా ప్రస్తుతం భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్ కీలక మలుపు దశలో ఉంది. ఇది స్థలాల విలువ, అద్దె పెరుగుదలకు దారితీయనుందని నివేదికలో ప్రస్తావించింది. మార్కెట్ వృద్ధిని కొనసాగించడంతో పాటు 200 కోట్ల చదరపు అడుగుల మైలురాయిని చేరుకుందుకు భారత్ కొత్త స్థలాల నిర్మాణంతో పాటు ప్రస్తుత స్థలాల ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందని సీఐఐ-నైట్‌ఫ్రాంక్ నివేదిక సూచించింది.

గోయాజ్‌లో నార్వెస్ట్ వెంచర్ రూ.130 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గోల్డ్-ప్లేటెడ్ సిల్వర్ ఆభరణాల బ్రాండ్ గోయాజ్.. అమెరికా వెంచర్ క్యాపిటల్ సంస్థ నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి రూ.130 కోట్ల నిధులు సమీకరించింది. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు, డిజైన్, తయారీ సామర్థ్యాల విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నట్లు గోయాజ్ తెలిపింది. ప్రస్తుతం గోయాజ్ దేశవ్యాప్తంగా 18 స్టోర్లను నిర్వహిస్తోంది. నార్వెస్ట్ వెంచర్ తమ భాగస్వామిగా మారటం సంస్థ వృద్ధి పథంలో కీలక మైలురాయి అని గోయాజ్ ఫౌండర్, సీఈఓ ప్రియాంక వేములూరి అన్నారు.

అమెరికా మార్కెట్లోకి నాట్కో ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా మార్కెట్లోకి ఎవెరోలిమస్ టాబ్లెట్లను విడుదల చేసినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. నోవార్టిస్‌కు చెందిన జోర్‌ట్రెస్‌కు ఇది జెనరిక్ ఔషధమని తెలిపింది. పెద్దలకు సంబంధించి కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సల్లో ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అమెరికాలో మార్కెటింగ్ భాగస్వామి అయిన ఏఎన్‌డీఏ, బ్రెకెన్‌రిడ్జ్ ఫార్మాతో కలిసి ఈ ఔషధాన్ని వెంటనే విడుదల చేయనున్నట్లు నాట్కో ఫార్మా తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	120
వరంగల్	112	గుంటూరు	124
కరీంనగర్	112	ఒంగోలు	124
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	116
కర్నూలు	112	నెల్లూరు	121
విశాఖపట్నం	116	అనంతపురం	121
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,680 ▲	1,12,450 ▲	1,64,000 ▼
విజయవాడ	1,25,000 ▲	1,18,000 ▲	1,53,400 ▲
విశాఖపట్నం	1,24,910 ▲	1,11,350 ▲	1,65,000 ▼
రాజమండ్రి	1,23,270 ▲	1,13,000 ▲	1,50,000 ▲
ప్రొద్దుటూరు	1,20,800 ▲	1,11,140 ▲	1,53,500 ▲
ముంబై	1,20,770 ▲	1,10,625 ▲	1,49,125 ▲

డిగ్రీ కాదు.. నైపుణ్యం ముఖ్యం

హైరింగ్‌లో మారుతున్న ట్రెండ్ ▸▸ ట్యాగ్డ్ సీఈఓ దేవాశిష్ శర్మ

న్యూఢిల్లీ: పనిచేసే చోట శరవేగంగా సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగంలో విజయానికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు కూడా మారుతున్నాయి. ఉద్యోగుల్లో వాక్చాతుర్యం, విశ్లేషణాత్మక ఆలోచన వంటి సాఫ్ట్ స్కిల్స్‌కు కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయని డిజిటల్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ట్యాగ్డ్ సీఈఓ దేవాశిష్ శర్మ అన్నారు. మారుతున్న వాతావరణంలో కంపెనీల యాజమాన్యాలు సంప్రదాయ విద్యార్హతల నుంచి ఉద్యోగార్థుల ఆచరణాత్మక నైపుణ్యాలు (ప్రాక్టికల్ స్కిల్స్), ఉద్యోగంలో చేరిన తక్షణమే బాధ్యతలను నిర్వర్తించగలుగుతాడా..? అనే అంశాల పైకి దృష్టి మళ్లిస్తున్నాయని అన్నారు. జాబ్ మార్కెట్లో నిపుణుల కొరతను పరిష్కరించేందుకు ఇండస్ట్రీ, విద్యా సంస్థలతో పాటు విద్యార్థులు కూడా గణనీయంగా ప్రయత్నిస్తున్నారని శర్మ పేర్కొన్నారు. ఉద్యోగార్థులు తమను తాము సిద్ధం చేసుకునేందుకు సాఫ్ట్ స్కిల్స్, సమస్యల పరిష్కారం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలపై దృష్టిసారిస్తున్నారని అన్నారు. యాజమాన్యాలు ముఖ్యంగా బడా కంపెనీలు విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధం చేసేందుకు విద్యా సంస్థలతో కలిసి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక కోర్సులను సైతం డిజైన్ చేస్తున్నాయని అన్నారు.

ప్రథమార్ధం ద్రవ్యలోటు రూ.5.73 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థంలో ద్రవ్యలోటు వార్షిక లక్ష్యంలో 36.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ వ్యయం, ఆదాయం మధ్య అంతరాన్ని ద్రవ్యలోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాల సమీకరణ ద్వారా కేంద్రం ఈ లోటును భర్తీ చేసుకుంటుంది. కంట్రోలర్ జనరల్ అకౌంట్స్ (సీజీఏ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. 2025-26 ప్రథమార్థంలో లోటు రూ.5,73,123 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా (రూ.15.69 లక్షల కోట్లు) ఉండవచ్చని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అంచనా వేసింది. ప్రథమార్ధం లోటు ఈ అంచనాలో 36.5 శాతానికి సమానం. ఈ ఏప్రిల్-సెప్టెంబరులో ప్రభుత్వానికి రూ.17.3 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. వార్షిక బడ్జెట్ అంచనాలో 49.5 శాతానికి సమానమిది.

సెన్సెక్స్ 466 పాయింట్లు పతనం

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్‌లు, లోహ రంగ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా సెన్సెక్స్ శుక్రవారం 465.75 పాయింట్లు కోల్పోయి 83,938.71 వద్దకు జారుకుంది. నిఫ్టీ 155.75 పాయింట్లు పతనమై 25,722.10 వద్ద ముగిసింది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 273.17 పాయింట్లు, నిఫ్టీ 73.05పాయింట్లు కోల్పోయాయి.

ఎన్ఎస్ఈ ఐపీఓకు మోక్షం కల్పిస్తాం: సెబీ చీఫ్

ఇన్వెస్టర్లు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు తప్పక మోక్షం కల్పిస్తామని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. అయితే, ఈ విషయంపై మరింత స్పష్టతనివ్వడం లేదా ఎక్స్ఛేంజీ ఎప్పటికల్లా ఐపీఓకు రావచ్చనే విషయాలను మాత్రం ఆయన ప్రస్తావించలేదు. సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్ వైదొలిగాక పరస్పర విరుద్ధ ప్రయోజనాలను బహిర్గతం చేసే విధానంపై సూచనలు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా పాండే తెలిపారు. ఆ కమిటీ నవంబరు 10 నాటికి నివేదిక సమర్పించవచ్చన్నారు.

జెన్ టెక్నాలజీస్‌కు రూ.289 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి రూ.289 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఏడాది కాలంలో ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

మారుతి సుజుకీ లాభం
రూ.3,349 కోట్లు

క్యూ2లో 8% వృద్ధి

మొత్తం ఆదాయం రూ.42,344 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,349 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.3,102 కోట్లు)తో పోల్చితే లాభం 8 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక కాలంలో ఎగుమతులు గణనీయంగా పెరగటంతో మంచి పనితీరును కనబరిచినట్లు ఎంఎస్ఐ తెలిపింది. కాగా సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.37,449.2 కోట్ల నుంచి రూ.42,344.2 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు మాత్రం రూ.33,879 కోట్ల నుంచి రూ.39,018 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది.

తగ్గిన దేశీయ అమ్మకాలు: కాగా సెప్టెంబరు త్రైమాసికంలో దేశీయంగా కార్ల విక్రయాలు 5.1 శాతం క్షీణించి 4,40,387 యూనిట్లుగా నమోదయ్యాయని ఎంఎస్ఐ తెలిపింది. సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వస్తుందన్న కారణంగా వినియోగదారులు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవటమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. అయితే ఎగుమతులు మాత్రం రికార్డు స్థాయిలో 42.2 శాతం పెరిగి 1,10,487 యూనిట్లుగా నమోదైనట్లు వెల్లడించింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయిలో ఎగుమతులు చేపట్టడం ఇదే మొదటిసారని తెలిపింది.

జీఎస్టీ తగ్గింపుతో చిన్న కారుకు మళ్లీ జోష్

జీఎస్టీ తగ్గింపు కారణంగా మళ్లీ చిన్న కార్లకు డిమాండ్ నెలకొందని ఎంఎస్ఐ చైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. భారతీయ వినియోగదారుల అభిరుచి అంతా పెద్ద కార్లకు మళ్లిందన్న వార్తలను జీఎస్టీ తగ్గింపు పటాపంచలు చేసిందన్నారు. కంపెనీ ఎంట్రీ లెవల్ చిన్న కార్లయిన ఆల్టో కే10, ఎస్-ప్రెస్సో, వ్యాగన్ ఆర్, సెలేరియో విక్రయాలు 20.5 శాతం పెరగటమే ఇందుకు నిదర్శనమన్నారు. తాజాగా కార్ల తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల పోర్టుఫోలియోను డిమాండ్‌కు తగ్గట్టుగా మళ్లీ మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు భార్గవ చెప్పారు. కాగా ఐదో ప్లాంట్ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రూ.35,000 కోట్ల పెట్టుబడితో ఐదో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మారుతి గత ఏడాది ప్రకటించింది.

బీపీసీఎల్ లాభంలో 169% వృద్ధి

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం ఏకంగా 169 శాతం వృద్ధి చెంది రూ.6,442.53 కోట్లుగా నమోదైనట్లు బీపీసీఎల్ వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,397.93 కోట్లుగా ఉంది. రిఫైనింగ్ మార్జిన్లు గణనీయంగా పెరగటమే ఇందుకు కారణమని తెలిపింది. సమీక్షా కాలంలో ఒక్కో బ్యారల్ క్రూడాయిల్ రిఫైనింగ్‌పై 10.78 డాలర్లను ఆర్జించినట్లు పేర్కొంది. ఈ కాలంలో మొత్తం రెవెన్యూ రూ.1.21 లక్షల కోట్లుగా ఉంది.

తగ్గిన బీఓబీ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. సెప్టెంబరు త్రైమాసిక లాభం 8 శాతం క్షీణించి రూ.4,809 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో కీలకమైన ఆదాయ వృద్ధి ఓ మోస్తరుగా ఉండటంతో పాటు బేస్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉండటం పనితీరును దెబ్బతీసిందని బ్యాంక్ పేర్కొంది. ఈ కాలంలో మొత్తం ఆదాయం రూ.35,445 కోట్ల నుంచి రూ.35,026 కోట్లకు తగ్గింది. అయితే వడ్డీ ఆదాయం మాత్రం రూ.30,278 కోట్ల నుంచి రూ.31,511 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏలు 2.5 శాతం నుంచి 2.16 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 0.6 శాతం నుంచి 0.57 శాతానికి తగ్గిందని బ్యాంక్ పేర్కొంది. క్యూ2లో కార్పొరేట్ లోన్ బుక్ 3 శాతం మేర వృద్ధి చెందిందని బీఓబీ ఎండీ, సీఈఓ దేబదత్త చంద్ వెల్లడించారు. ఇప్పటికే బ్యాంక్ రూ.40,000 కోట్ల రుణాలను మంజూరు చేయగా మరో రూ.25,000 కోట్ల రుణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

స్పోర్ట్స్

అర్జున్ సాధిస్తాడా?

నేటినుంచి చెస్ వరల్డ్ కప్

బరిలో 80 దేశాల నుంచి 206 మంది ఆటగాళ్లు



పాంజిమ్ (గోవా): ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్ కప్ శనివారం ఇక్కడ ప్రారంభం కానుంది. 80 దేశాల నుంచి మొత్తం 206 మంది ఆటగాళ్లు టోర్నీలో తలపడుతున్నారు. భారత్ నుంచి ప్రజ్ఞానంద, ప్రపంచ చాంపియన్ గుకేష్, గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి తదితర స్టార్లు బరిలో నిలిచారు. ఈ వరల్డ్ కప్‌లో తొలి మూడు స్థానాలలో నిలిచిన ఆటగాళ్లు 2026 ఫిడే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నారు. దాంతో ప్రపంచ కప్ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రపంచ చాంపియన్ గుకేష్‌తో తలపడే ఆటగాడిని నిర్ణయించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ జీఎం అర్జున్‌కు ప్రపంచ కప్ కీలకం కానుంది. ఇక్కడ సత్తా చాటితే అతడు క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అవుతాడు. వరల్డ్ కప్ నాలుగు వారాలపాటు ఎనిమిది రౌండ్లలో సింగిల్ నాకౌట్ విధానంలో జరుగుతుంది. ఒక్కో మ్యాచ్‌లో రెండు క్లాసికల్ గేమ్‌లుంటాయి. ఇవి డ్రా అయితే విజేతను తేల్చేందుకు ర్యాపిడ్, బ్లిట్జ్ టై బ్రేక్స్ నిర్వహిస్తారు. డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్, అమెరికా గ్రాండ్‌మాస్టర్లు నకమురా, కరువానా టోర్నీలో పాల్గొనడంలేదు. తెలుగు ఆటగాళ్లు పెంటేల హరికృష్ణ, రాజా రిత్విక్, లలిత్ బాబు, కార్తీక్ వెంకట్రామన్‌తోపాటు అనీష్ గిరి విన్సెంట్ (హాలెండ్), కీమర్ రోచ్ (జర్మనీ), అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్థాన్) కూడా తలపడుతున్నారు. ఇక..మహిళల వరల్డ్ కప్ విజేత దివ్యా దేశ్‌ముఖ్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగుతోంది.

ట్రోఫీకి ఆనంద్ పేరు



ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ కప్ విజేతకు ప్రదానం చేసే ట్రోఫీకి ఆనంద్ పేరు పెట్టారు. ఈమేరకు శనివారం జరిగిన టోర్నీ ఆరంభ కార్యక్రమంలో కప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా అఖిల భారత చెస్ సమాఖ్య అధ్యక్షుడు నితిన్ నారంగ్ ప్రకటించారు.

ఉన్నతి సంచలనం

నాలుగో సీడ్‌కు షాకిచ్చి సెమీస్‌కు

హైలో ఓపెన్‌లో లక్ష్య, ఆయుష్‌కు నిరాశ

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సింగిల్స్ క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ ఉన్నతి 22-20, 21-13తో నాలుగో సీడ్ సియాంగ్ తి లిన్ (చైనీస్ తైపీ)కి షాకిచ్చింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్య సేన్ 17-21, 21-14, 15-21తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో, ఆయుష్ శెట్టి 21-19, 12-21, 20-22తో కాలె కొలిజానెన్ (ఫిన్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యారు.



ఢిల్లీకి కబడ్డీ కిరీటం

ఫైనల్లో పుణెరి పరాజయం

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబాంగ్ ఢిల్లీ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం పుణెరి పల్టన్‌తో ఉత్కంఠ భరితంగా సాగిన తుది పోరులో దబాంగ్ జట్టు 30-28 తేడాతో నెగ్గింది. ఢిల్లీకిది రెండో ట్రోఫీ. గతంలో ఎనిమిదో సీజన్‌లో విజేతగా నిలిచింది. ప్రస్తుత కోచ్ జోగిందర్ నర్వాల్ అప్పుడు ఆటగాడిగా ఉండడం విశేషం. ఇక లీగ్ దశ ఆద్యంతం అత్యుత్తమ ప్రదర్శనతో టాప్-2లో నిలిచిన ఇరుజట్లు ఫైనల్లోనూ హోరాహోరీగా తలపడ్డాయి. అయితే పుణెరి టీమ్‌కు నిరాశ తప్పలేదు. ఢిల్లీ అద్భుత డిఫెన్స్‌తో ప్రత్యర్థికి చెక్ పెట్టింది. దబాంగ్ రైడర్ నీరజ్ నర్వాల్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. అటు పుణెరి పల్టన్ రైడర్ ఆదిత్య షిండే అత్యధికంగా 10 పాయింట్లతో రాణించినా ఫలితం లేకపోయింది.

చెత్తగా ఆడి..
చిత్తుగా ఓడి..

- అభిషేక్ మెరుపులు వృధా
- చెలరేగిన హాజెల్‌వుడ్
- ఆస్ట్రేలియా బోణీ

రెండో టీ20లో భారత్‌కు నిరాశ



సూర్య (1)ను అవుట్ చేసిన ఆనందంలో హాజెల్‌వుడ్ (3/13)

అభిషేక్ (68)

మెల్‌బోర్న్: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాపై రికార్డు స్థాయిలో 339 రన్స్‌ను ఛేదించి వహ్వా.. అనిపించగా, స్టార్లతో కూడిన పురుషుల జట్టు మాత్రం అదే ఆసీస్ చేతిలో చిత్తుగా ఓటమిపాలైంది.. ఫార్మాట్ వేరైనప్పటికీ మహిళల జట్టు చూపిన పోరాటం ముందు సూర్యకుమార్ సేన చిన్నబోయి అభిమానులను నిరాశ పర్చింది. శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో భారత్ 4 వికెట్లతో చిత్తయ్యింది. ఆతిథ్య ఆసీస్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి 1-0 ఆధిక్యం అందుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అభిషేక్ (37 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 68), హర్షిత్ రాణా (33 బంతుల్లో 35) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పేసర్లు హాజెల్‌వుడ్‌కు 3.. ఎలిస్, బార్ట్‌లెట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఆసీస్ 13.2 ఓవర్లలో 126/6 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ మార్ష్ (26 బంతుల్లో 46), హెడ్ (15 బంతుల్లో 28) ఎదురుదాడికి దిగడంతో పరుగులు వేగంగా వచ్చాయి. ఈ జోడీ పవర్‌ప్లేలోనే 56/1 స్కోరుతో నిలిచింది. కుల్దీప్ ఓవర్‌లో మార్ష్ 4,6,4,6తో 20 రన్స్ బాది అతడికే చిక్కాడు. ఆ తర్వాత ఇన్‌గ్లిస్ (20) పర్వాలేదనిపించాడు. చివర్లో 3 వికెట్లు టపటపా కోల్పోయినా మ్యాచ్ ఫలితం అప్పటికే తేలిపోయింది. హాజెల్‌వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

పేకమేడలా..

5, 2, 1, 0, 7, 4, 0, 0, 0.. భారత్ ఇన్నింగ్స్‌లో తొమ్మిది మంది బ్యాటర్ల నుంచి వచ్చిన పరుగులివి. జట్టు మొత్తం స్కోరు 125 కాగా.. ఇందులో వీరి భాగస్వామ్యం కేవలం 19 రన్స్ కావడం గమనార్హం. పేసర్ హాజెల్‌వుడ్ తన ఎక్స్‌ట్రా బౌన్స్‌తో బెంబేలెత్తించాడు. ఒకేసారి తన ఓవర్ల కోటా పూర్తి చేయగా 13 పరుగులే ఇచ్చి గిల్ (5), సూర్య (1), తిలక్ (0) వికెట్లు తీశాడు. అలాగే అతను 15 డాట్ బాల్స్ వేయడం విశేషం. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను ఇష్టారీతిన మార్చడం టీమిండియాను దెబ్బ తీసింది. కానీ బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై అభిషేక్ మాత్రం భారీ షాట్లతో చెలరేగాడు. 49/5 స్కోరు దగ్గర శివమ్ దూబె కన్నా ముందే వచ్చిన హర్షిత్.. అభిషేక్‌కు జత కలిశాడు. ఇద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకుని ఆరో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. అభిషేక్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఇక 16వ ఓవర్‌లో హర్షిత్, దూబే (4)ల వికెట్లు తీసి బార్ట్‌లెట్ ఝలక్ ఇవ్వగా.. ఆ తర్వాత టపటపా వికెట్లు నేలకూలడంతో భారత్ పూర్తి ఓవర్లు కూడా ఆడలేకపోయింది.

2 టీ20ల్లో బంతుల పరంగా (40) భారత్‌కిది రెండో అతిపెద్ద ఓటమి. 2008లో ఆసీస్‌పైనే 52 బాల్స్ ఉండగా ఓడింది.

స్కోరుబోర్డు

భారత్: గిల్ (సి) మార్ష్ (బి) హాజెల్‌వుడ్ 5, అభిషేక్ (ఎల్బీ) ఎలిస్ 68, శాంసన్ (ఎల్బీ) ఎలిస్ 2, సూర్యకుమార్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజెల్‌వుడ్ 1, తిలక్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజెల్‌వుడ్ 0, అక్షర్ (రనౌట్) 7, హర్షిత్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 35, దూబే (సి) ఇన్‌గ్లిస్ (బి) బార్ట్‌లెట్ 4, కుల్దీప్ (సి సబ్) ఎబాట్ (బి) స్టొయినిస్ 0, వరుణ్ (నాటౌట్) 0, బుమ్రా (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.4 ఓవర్లలో 125 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-20, 2-23, 3-32, 4-32, 5-49, 6-105, 7-109, 8-110, 9-125, 10-125; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 4-0-13-3, బార్ట్‌లెట్ 4-0-39-2, ఎలిస్ 3.4-0-21-2, స్టొయినిస్ 4-0-24-1, ఓవెన్ 1-0-13-0, కునేమన్ 2-0-14-0.

ఆస్ట్రేలియా: మార్ష్ (సి) అభిషేక్ (బి) కుల్దీప్ 46, హెడ్ (సి) తిలక్ (బి) వరుణ్ 28, ఇన్‌గ్లిస్ (ఎల్బీ) కుల్దీప్ 20, డేవిడ్ (సి అండ్ బి) వరుణ్ 1, ఓవెన్ (సి) శాంసన్ (బి) బుమ్రా 14, స్టొయినిస్ (నాటౌట్) 6, షార్ట్ (బి) బుమ్రా 0, బార్ట్‌లెట్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 13.2 ఓవర్లలో 126/6. వికెట్ల పతనం:** 1-51, 2-87, 3-90, 4-112, 5-124, 6-124; **బౌలింగ్:** బుమ్రా 4-0-26-2, హర్షిత్ 2-0-27-0, వరుణ్ 4-0-23-2, కుల్దీప్ 3.2-0-45-2.



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒకే ఒక్క ఇన్నింగ్స్ ఆమెను దేశ మహిళా క్రికెట్‌లో రారాణిగా చేసింది. ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్‌కు ముందు జెమీమా రోడ్రిగ్స్ ఎదుర్కొన్న ఒత్తిడి అంతా..ఇంతా..కాదు. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో రెండు డకౌట్లు, మరో రెండింటిలో 30ల్లో అవుట్. దాంతో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు ఆమెను పక్కనపెట్టేశారు. ఇది చాలదన్నట్టు 25 ఏళ్ల జెమీమాపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్. ఆటకంటే ఆమెకు ఇతర విషయాలపై ఎక్కువగా ఆసక్తి ప్రదర్శిస్తున్నదన్న తీవ్ర విమర్శలు. గతంలోనూ జెమీమా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. మూడేళ్ల కిందట న్యూజిలాండ్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచ కప్ జట్టులో ఆమెకు చోటు దక్కలేదు. తదనంతరం కూడా రోడ్రిగ్స్ జట్టుకు ఎంపిక కాలేకపోయింది. ఇవన్నీ ఇలా ఉండగానే..ముంబైలోని ఖార్ జింఖానా క్లబ్‌లో జెమీమా తండ్రి ఇవాన్ క్రైస్తవ మత ప్రచారం నిర్వహించినట్టు విమర్శలొచ్చాయి. అక్కడ అతడు మత మార్పిడులకు పాల్పడినట్టు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దాంతో ఖార్ జింఖానా మేనేజ్‌మెంట్ ఆ క్లబ్‌లో జెమీమా సభ్యత్వాన్ని రద్దు చేసింది. అసలే జట్టులో స్థానం కోల్పోయి వేదనలో ఉన్న జెమీమా ఈ పరిణామాలలో మరింత ఒత్తిడిలో కూరుకుపోయింది. ఇక ఈసారి వరల్డ్ కప్‌లోనూ ఆరంభంలో వైఫల్యాలు ఎదుర్కొంది. దరిమిలా ఆమెపై మరోసారి విమర్శల జడివాన ప్రారంభమైంది. వాటిని పట్టించుకోకుండా ఆమె తనకు తాను కర్తవ్యబోధ చేసుకుంది. విమర్శలకు బ్యాటుతోనే బదులివ్వాలని నిశ్చయించుకుంది. ఈక్రమంలో న్యూజిలాండ్‌పై మ్యాచ్‌లో అజేయ హాఫ్ (76)తో తానేమిటో నిరూపించుకుంది. ఆ మనోబలమే ఏడుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా జట్టుతో సెమీఫైనల్లో తాను ఆకాశమే హద్దుగా విజృంభించేందుకు తోడ్పడింది. రికార్డు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు షఫాలీ, మంధాన త్వరగా అవుట్ కావడంతో భారత జట్టు విజయంపై అభిమానుల్లో ఏమూలో సందేహం నెలకొంది. అయితే కెప్టెన్ హర్మన్ తోడుగా ఆసీస్ బౌలర్లపై రోడ్రిగ్స్ విరుచుకుపడింది. కీలక తరుణంలో కౌర్ నిష్క్రమించినా జెమీమా ఏమాత్రం వెరవలేదు. దీప్తీశర్మ, రిచా ఘోష్ చివరగా అమన్‌జోత్ కౌర్ అండగా జట్టుకు చిరస్మరణీయ విజయం అందించింది. భారత మహిళా క్రికెట్ చరిత్రలోనే ఓ అద్భుత విజయాన్ని సాక్షాత్కరింపజేసిన జెమీమా మ్యాచ్ అనంతరం బోరున విలపించింది. ఆమెలో గూడుకట్టుకున్న ఆవేదనకు అది అద్దం పట్టింది. ఏమైనా..ఒకే ఒక ఇన్నింగ్స్‌తో జెమీమా టీమిండియాలో సూపర్‌స్టార్‌గా మారింది.

పంత్ విఫలం

భారత్ 'ఎ' 234 ఆలౌట్

బెంగళూరు: కెప్టెన్ రిషబ్ పంత్ సహా స్టార్లతో కూడిన భారత్ 'ఎ' జట్టు బ్యాటింగ్‌లో విఫలమైంది. దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికార టెస్టులో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్‌లో పంత్ సేన 234 పరుగులకే ఆలౌటైంది. ఆయుష్ మాత్రే (65), బదోని (38), సాయి సుదర్శన్ (32) మినహా అంతా విఫలమయ్యారు. కెప్టెన్ పంత్ (17) కూడా స్వల్ప స్కోరుకే పరిమితమయ్యాడు. సుబ్రయేన్‌కు 5, సిపమ్లాకు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా 'ఎ' రెండో రోజు ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 30 పరుగులతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 309 పరుగులకు ఆలౌటైంది.

ఆ ఒక్కమాటే చెప్పా!

కోచ్ మజుందార్

నవీముంబై: 'మ్యాచ్‌ను విజయవంతంగా ముగించండి' అని మాత్రమే తాను చెప్పినట్టు మహిళల జట్టు కోచ్ అమోల్ మజుందార్ వెల్లడించాడు. 'వారికి నేను హితబోధ చేయలేదు. మ్యాచ్‌ను విజయవంతంగా ముగించాలని మాత్రమే చెప్పా. టోర్నీలో చాలా మ్యాచ్‌లను చక్కగా ఆరంభించాం. అయితే చివరకు తడబాటుకులోనై చేజార్చుకున్నాం. కానీ సెమీఫైనల్లో అలా జరగకూడదని చెప్పా' అని మజుందార్ వివరించాడు.

నాలాల కబ్జాలను ఉపేక్షించొద్దు

చెరువుల ఆక్రమణలనూ తొలిగించాల్సిందే.. ఎంతటి వారినైనా వదిలిపెట్టొద్దు

- వరద బాధితులకు అండగా ఉంటాం
- తుఫాన్‌తో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం
- ఇళ్లు నీట మునిగితే రూ.15 వేలు.. కూలిపోతే ఇందిరమ్మ ఇళ్లు
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు
- వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి



వరంగల్ నగరంలోని సమ్మయ్య నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వరంగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మొంథా తుఫాన్ కారణంగా వానలు దంచికొట్టడంతో వరంగల్ నగరంలో పలు కాలనీలు నీట మునిగిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్‌లోని పలు కాలనీలను సందర్శించి, వరద బాధితులను పరామర్శించారు. వరద ముంపునకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన హనుమకొండ కలెక్టరేట్‌లో ఏడు జిల్లాల కలెక్టర్లతో వరద నష్టంపై సమీక్షించారు. తుఫాన్ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉందని రేవంత్ చెప్పారు. వరంగల్‌తో పాటు అనేక జిల్లాల్లో వరద నష్టం భారీగా ఉందన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. నీటిపారుదల, పురపాలక శాఖల అధికారులతోపాటు స్థానికంగా ఉండే అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల చాలా నష్టాలు జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా రావడం లేదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతి పైసాను రాబట్టుకోవాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మేఘ విస్ఫోటంతో కుండపోత వానలు నిత్యకృత్యంగా మారాయని, రెండు మూడేళ్లుగా వరసగా ఎక్కడో ఒక చోట ఇలా జరుగుతోందని చెప్పారు. ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. నగరాల్లో నాలాల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దన్నారు. చెరవులు, నాలాల కబ్జాల్లో ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దని ఆదేశించారు. పది మంది కోసం పది వేల మంది ప్రజలు ఇబ్బంది పడాలా? అని ప్రశ్నించారు. ఆక్రమణలపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుతం వరదలు తగ్గాయని, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమన్వయ కమిటీలు నియమించుకొని పనిచేయాలని అధికారులకు సూచించారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల్ని గడువులోగా పూర్తి చేయాలన్నారు. వరదలకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల రోడ్లు భారీగా దెబ్బతిన్నాయని, వాటిపై వెంటనే నివేదికలు అందజేయాలన్నారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నానని, పని చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరద నష్టంపై త్వరలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తానని, నివేదికలు సిద్ధం చేయాలని చెప్పారు.

మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం

వరదల కారణంగా మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. ఎవరైనా వరదల్లో మృతి చెందినట్లు ఫిర్యాదులు వస్తే, వెంటనే ఎఫ్ఆర్ఐ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. వరదల వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు కోల్పోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరదలకు ఇళ్లు మునిగిన వారికి రూ.15 వేలు అందిస్తామని, ఇళ్లు పూర్తిగా ధ్వంసమైతే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అలాగే మేక, గొర్రె వంటివి మృతి చెందితే రూ.5 వేలు; గేదెలు, ఆవులు, ఎద్దులు వంటివి మృతి చెందితే పశువులను బట్టి రూ.50 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం అందిస్తామని సీఎం రేవంత్ చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

వరంగల్‌లో వరద బీభత్సానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రభావిత కాలనీల్లో స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులను చూసి.. అధికారుల తీరుపై మండిపడ్డారు. వంద అడుగుల రోడ్డులో సుమారు రూ.100 కోట్లతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ టన్నెల్ గేట్లను తెరవకపోవడంతో గోపాల్‌పూర్ చెరువు నీళ్లతో 50 కాలనీల వరకు నీట మునిగాయని స్థానికులు సీఎంకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన అధికారులను మందలించారు. తుఫాన్ ఉందని తెలిసి కూడా ఎందుకు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పాలనాపరమైన అనుభవం లేకపోవడంతో అధికారులు వరద నష్టాన్ని అంచనా వేయలేకపోయారని ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులు నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు.



వరద నష్టంపై ఏరియల్ సర్వే

వర్షాలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి మధ్యాహ్నం 1.25గంటలకు హుస్నాబాద్ నియోజకవర్గంతోపాటు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

ఇందిర, పటేల్‌కు నివాళులు

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సర్దార్ వలభ్ భాయ్ పటేల్ చిత్ర పటాలకు సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఇందిర వర్ధంతి, పటేల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

పరామర్శిస్తూ.. భరోసా ఇస్తూ..



వరంగల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు గంటకుపైగా పర్యటించారు. బాధితులను పలకరిస్తూ.. భరోసా ఇస్తూ.. వారి వినతులు స్వీకరిస్తూ.. ముందుకు సాగారు. మధ్యాహ్నం 3గంటలకు హనుమకొండ చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా హనుమకొండ సమ్మయ్య నగర్ చేరుకున్న ఆయన.. వరద ముంపు ప్రాంతాలను సందర్శించారు. కాలనీకి చెందిన రమాదేవి, లత ఇళ్లలోకి వెళ్లిన సీఎం.. బాధితులతో మాట్లాడారు. వరద ముంపునకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. రేవంత్ మాట్లాడుతుండగా కాలనీ వాసులు అడ్డు తగిలారు. ఏటా వర్షాకాలంలో తాము వరద ముంపునకు గురవుతున్నామని వాపోయారు. దీంతో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. సమ్మయ్య నగర్ నాలాను పరిశీలించి వెళ్తున్న సీఎంను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్మికులు కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. కాపువాడలో వరద బాధితులను పరామర్శించారు. పక్కనే ఉన్న పోతననగర్ కాలనీ, నాలాలను పరిశీలించారు. అయితే, పోతననగర్‌లో ఐదారు నిమిషాలు మాత్రమే పర్యటించడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

విధ్వంసం.. దుర్గంధం!

గ్రేటర్ వరంగల్‌లో బీభత్స వాతావరణం | కొట్టుకొచ్చిన వ్యర్థాలు, బురదతో కంపు

- ఇంకా వరదలోనే లోతట్టు ప్రాంతాలు పునరావాస కేంద్రాల్లో 3వేలమంది బాధితులు
- ఎక్కడికక్కడ ధ్వంసమైన రోడ్లు
- శాంతించిన మున్నేరు. ఖమ్మానికి తప్పిన ముంపు ముప్పు
- డిండి వద్ద వంతెనపై నేటి నుంచి వాహనాల రాకపోకలకు అనుమతి



తడిసిన బియ్యాన్ని చూపిస్తున్న ఓ మహిళ, కేయూసీ నుంచి కాజీపేటకు వెళ్లే రోడ్డు పరిస్థితి

వరంగల్ కార్పొరేషన్, ఖమ్మం, అచ్చంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గింది.. వరద ముంపూ కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే రోడ్ల మీద, కాలనీల్లో, ఇళ్లలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన బురద, కొట్టుకొచ్చిన వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం నెలకొంది. 48 గంటలు గడిచినా లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. మొంథా తుఫాన్ మిగిల్చిన బీభత్సంతో గ్రేటర్ వరంగల్‌లో నెలకొన్న పరిస్థితులివీ! భారీ వర్షం.. వరదపోటుతో నగర పరిధిలో 45 కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొన్ని కాలనీలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నా అక్కడ పాములు, తేళ్లు కనిపిస్తుండటంతో ఆందోళన నెలకొంది. చెత్తకుప్పలు, మురుగు నీటిపై ఈగలు, దోమలు ముసరడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. దాదాపు 12 చోట్ల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో శుక్రవారం ఉదయం వరకు 3వేల మంది బాధితులు ఉన్నారు. బాధితుల్లో కొందరు ఇళ్లకు వెళుతున్నారు. పేరుకుపోయిన బురద, చెత్తాచెదారాన్ని తొలగించి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. నవంబరు 4న మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇంకా తమ కాలనీలలో నీరు నిలిచి ఉండటంతో మళ్లీ వర్షం పడితే పరిస్థితి ఏమిటని బాధితులు హైరానా పడుతున్నారు. అధికారులు మాత్రం ఇప్పుడే ఇళ్లకు వెళ్లొద్దని, వర్షం ముప్పు తగ్గిన తర్వాతే ఇళ్లకు వెళ్లాలని సూచిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు సీఎంహెచ్‌వో రాజారెడ్డి తెలిపారు. వరద ఉధృతికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానరోడ్లతో పాటు అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. బొందివాగు, హంటర్‌రోడ్డు, కేయూ రోడ్డు, రంగశాయిపేట, శివనగర్, ఏనుమాముల, చిన్నవడ్డెపల్లి చెరువు రోడ్డు, భద్రకాళి రోడ్డు, భట్టుపల్లిరోడ్డు, పోతననగర్, 12 మోరీల రోడ్డు, చింతల్, లేబర్ కాలనీల ప్రధానరోడ్లలో కొన్ని తెగిపోయాయి. ఇంకొన్ని కుంగిపోయాయి.

19 అడుగులకు మున్నేరు

మున్నేరు శాంతించింది.. ఖమ్మం నగరానికి ముప్పు తప్పింది. వరద ఉధృతితో ఒకదశలో 26 అడుగుల ఎత్తుతో ప్రవహించిన మున్నేరు శుక్రవారం 19 అడుగులకు చేరింది. పరీవాహక ప్రాంతం కాలనీల్లోని 191 కుటుంబాలకు చెందిన 478మంది రెండురోజుల క్రితం పునరావాస కేంద్రాలకు వెళ్లారు. వరద తగ్గడంతో శుక్రవారం వారు ఇళ్లకు చేరుకొని శుభ్రం చేసుకుంటున్నారు. కాగా మున్నేరు వరద నుంచి ఖమ్మానికి రక్షణ కోసం నిరుడు వాగుకు ఇరువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించాలని నిర్ణయించారు. ఈమేరకు 17 కి.మీ మేర గోడ నిర్మాణం కోసం రూ.501 కోట్లు కేటాయించారు. పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు.. శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం డిండి ప్రాజెక్టు అలుగు వద్ద ధ్వంసమైన వంతెన పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. 500 మీటర్ల పొడవు ఉన్న ఈ బ్రిడ్జి కోతకు గురవ్వడంతో రెండ్రోజులుగా వాహనరాకపోకలు నిలిపివేశారు. శనివారం నుంచి వాహనాలను అనుమతించనున్నారు.



పౌర సరఫరా అధికారులతో మాట్లాడుతున్న మహిళా రైతు తారవ్వ

తారవ్వ ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కష్టనష్టాలకోర్చి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి తెస్తే.. మొంథా తుఫాను ప్రభావంతో వరద పాలైన తారవ్వ ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కేడిక తారవ్వ తన ఐదెకరాల్లో పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి హుస్నాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చింది. తేమ పేరుతో తూకం వేయడానికి అధికారులు తాత్సారం చేయడంతో.. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆమె తెచ్చిన ధాన్యంలోంచి 80 శాతం పైగా కొట్టుకుపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు.. తారవ్వ వద్ద నుంచి 106.80 క్వింటాళ్ల తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసిన పౌర సరఫరా అధికారులు, శుక్రవారం సాయంత్రం ఆమె భర్త రవీందర్‌రెడ్డి ఖాతాలో రూ.2.55 లక్షలను జమ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి తారవ్వ కృతజ్ఞతలు తెలిపారు. ఇక, తారవ్వకు కేంద్ర మంత్రి బండి సంజయ్ అండగా నిలిచారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుంచి తారవ్వతో ఫోన్‌లో మాట్లాడి.. తక్షణ సహాయం కింద రూ. 50 వేలు అందిస్తున్నట్లు తెలిపారు.

తుపాను బాధిత కుటుంబాలను ఆదుకోండి

- కార్పొరేట్ సంస్థలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు
- హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు పెంచుతాం
- 'సీఐఐ సదరన్ రీజనల్ కౌన్సిల్' సమావేశంలో స్పష్టీకరణ



హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఆపన్న హస్తం అందించాల్సిందిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్పొరేట్ సంస్థలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని పౌరులు, రైతుల కోసం సహాయ, పునరావాస శిబిరాలు నిర్వహించాలని పలు సంస్థలకు లేఖలు రాశారు. సామాజిక బాధ్యతగా నిత్యావసర వస్తువులు, ఔషధాలు, వైద్య సహాయం అందించాలని కోరారు. ఆపత్కాలంలో వారికి అండగా నిలిచి చితికిన కుటుంబాలను తిరిగి నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు. కాగా భారత్ 15 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక భాగస్వామిగా మారుస్తామని మంత్రి తెలిపారు. ఈమేరకు శుక్రవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్.. తెలంగాణ రోడ్‌మ్యాప్ టు త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు చేరేలా 'సర్వీసెస్, సస్టైనబిలిటీ, స్మార్ట్ లివింగ్'కు 'గ్లోబల్ క్యాపిటల్, నెట్-జీరో ఫ్యూచర్ సిటీ'గా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని కీలకమైన పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. 'విశ్వసనీయమైన లాంచ్ ప్యాడ్'గా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, తదితరులు పాల్గొన్నారు.

హాలీవుడ్ ఫిల్మ్ హబ్‌గా తెలంగాణ: కోమటిరెడ్డి



మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సినీ నిర్మాణ రంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహారాష్ట్ర ఐటీ, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి ఆశిష్ శెలార్ శుక్రవారం మంత్రి కోమటిరెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ అభివృద్ధిలో తెలంగాణ విధానాలపై వారు చర్చించారు. మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ ప్రాంతం సినిమా చిత్రీకరణకు అనువైనదని ఆశిష్ శెలార్‌కు వివరించారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సినీ నిర్మాణానికి ఉత్తమ వేదికలుగా తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని హాలీవుడ్ స్థాయి ఫిల్మ్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. శెలార్ శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కూడా భేటీ అయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో పలు అంశాలపై చర్చించారు.

హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

- పీఎం ఈ-డ్రైవ్ కింద క్లీన్ సిటీ లక్ష్యం
- ఈ-బస్సు కంపెనీ ప్రతినిధులతో పొన్నం సమావేశం



హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చే లక్ష్యంతో, డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వాహనాలను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈవీ పాలసీ ప్రవేశపెట్టిందని చెప్పారు. పీఎం ఈ-డ్రైవ్ కింద హైదరాబాద్‌కు మంజూరైన 2వేల విద్యుత్ బస్సుల నిర్వహణ, మౌలిక సదుపాయాలపై మంత్రి శుక్రవారం సచివాలయంలో ఈ-బస్సుల తయారీ కంపెనీల ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ-బస్సుల డెలివరీలో జరుగుతున్న జాప్యం, కొంతమంది ఆపరేటర్లు టెండర్ షరతులను పాటించకపోవడం, చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఆలస్యం వంటి వంటి సమస్యలను ప్రస్తావించారు. వీటి పరిష్కారంపై విద్యుత్ బస్సుల తయారీ కంపెనీల ప్రతినిధులతో మంత్రి పొన్నం చర్చించారు. దేశవ్యాప్తంగా పీఎం ఈ-డ్రైవ్ కింద 9 నగరాల్లో 15 వేల విద్యుత్ బస్సులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుండగా, అందులో హైదరాబాద్‌కు 2 వేల విద్యుత్ బస్సులు మంజూరయ్యాయి.

పగలంతా థర్మల్ కేంద్రాలు బ్యాక్‌డౌన్!

- జోరుగా జల, సౌర విద్యుత్తు ఉత్పత్తి

వరదలతో జలవిద్యుత్తు ఉత్పత్తి పెరగడం, సౌర విద్యుదుత్పత్తి కూడా జోరుగా సాగుతుండటంతో.. పగలంతా థర్మల్ కేంద్రాలను బ్యాక్‌డౌన్ (విద్యుదుత్పత్తిని తగ్గించడం) చేస్తున్నారు. జెన్‌కో పలు యూనిట్లను బ్యాక్‌డౌన్ చేసింది. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకే థర్మల్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి సాగుతోంది.

జల విద్యుదుత్పత్తిని నిలిపేయండి..

తాగు, సాగునీటి అవసరాలు లేకుండా జల విద్యుదుత్పత్తి చేయరాదని, ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులకు ప్రవాహాలు లేనందున.. తక్షణమే ఉత్పత్తిని నిలిపేయాలని తెలంగాణ, ఏపీలు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి లేఖలు రాశాయి. అక్టోబరు 24న ఏపీ, 27న తెలంగాణ లేఖలు రాశాయి. దీంతో ఏపీ రాసిన లేఖను జత చేసి తెలంగాణకు, తెలంగాణ రాసిన లేఖను జత చేసి ఏపీకి కృష్ణా బోర్డు పంపింది. ఈ లేఖలు రాసిన తర్వాత వర్షాలతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు వరద పెరిగింది.

ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్



కరీంనగర్ జిల్లా మక్తపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కవిత

తిమ్మాపూర్, హుజూరాబాద్ రూరల్, శంకరపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. నుస్తులాపూర్ గ్రామంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలించిన కవిత ఆ తర్వాత తిమ్మాపూర్ మండలంలోని మక్తపల్లి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి అక్కడున్న ధాన్యాన్ని పరిశీలించారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గురుకుల పాఠశాల విద్యార్థిని శ్రీవర్షిత మృతిపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ జరిపించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామంలో ఉంటున్న శ్రీవర్షిత తల్లిదండ్రులను కవిత శుక్రవారం పరామర్శించారు. శ్రీవర్షిత మృతిపై సిట్ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



సంగారెడ్డిలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన జగ్గారెడ్డి

దేశప్రజల కోసం

ఇందిరాగాంధీ తూటాలకు బలైన రోజు ఇది

రైతులకు, పేదలకు బ్యాంకులను చేరువచేసిన గొప్ప లీడర్ ఇందిరాగాంధీ

- కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు భూములు పంచిన ఘనత ఇందిరా గాంధీది
- బలైపోతానని తెలిసి దేశం కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకున్న ధైర్యవంతురాలు ఇందిర
- ప్రతిపక్షాలు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా ఇందిరా, రాజీవ్ గాంధీల కుటుంబానిది ఒక చరిత్ర
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని ఇందిరాగాంధీ విగ్రహానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రజల కోసం ఇందిరాగాంధీ ఇదేరోజున తూటాలకు బలయ్యారని గుర్తు చేశారు. బ్యాంకులను ప్రజల బ్యాంకులుగా మార్చిన ఘనత ఇందిరమ్మకే దక్కుతుందన్నారు. ఇంటిస్థలం లేని పేదలకు ఇందిరమ్మ పేరిట స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టించిన విషయం నేటికీ గుర్తు చేసుకుంటారని చెప్పారు. ల్యాండ్‌సీలింగ్ చట్టాన్ని అమలు చేసి దేశంలో భూమిలేని పేదలకు భూములు పంచిన ఘనత కూడా ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. ఆమె చనిపోయిన రోజు దేశమంతా చీకటిగా మారిందని, రక్తపు మడుగులో ఉన్న ఇందిరా గాంధీ పక్కనే ఆరోజు సోనియాగాంధీ ఉన్నారని వివరించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల కుటుంబానిది త్యాగాల చరిత్ర అని, ఆ కుటుంబం త్యాగాలు చేసిన సమయంలో మోదీ, అమిత్‌షా, కేసీఆర్ లాంటి వాళ్లంతా ఎక్కడున్నారని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఆరోజు ప్రతిపక్షనేతగా ఉన్న బీజేపీ పార్టీకి చెందిన మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా ఇందిరాగాంధీని అపర కాళికగా కొనియాడారని గుర్తుచేశారు.

10 మంది తెలుగు పోలీసులకు కేంద్రీయ దక్షతా పదక్ అవార్డులు

న్యూఢిల్లీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ ఏటా ప్రకటించే దక్షతా పదక్ అవార్డులకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 మంది పోలీసులు ఎంపికయ్యారు. స్పెషల్ ఆపరేషన్, ఇన్వెస్టిగేషన్, ఇంటెలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్ రంగాల్లో అత్యుత్తమ పనితీరును కనబర్చిన పోలీసులకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందిస్తుంది. తెలంగాణ నుంచి ఇన్వెస్టిగేషన్ కేటగిరిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు చంద్రబాబు నగరి, జల ఉపేందర్‌రావు, తిరుపతి వాసాల, స్పెషల్ ఆపరేషన్ కేటగిరిలో హెడ్ కానిస్టేబుళ్లు అకెపోగు లక్ష్మణరావు, గిబిమన్ జాకబ్‌ను కేంద్రం ఎంపిక చేసింది.

రూ.1,032 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల తోపాటు పంచాయతీరాజ్, రహదారులు-భవనాల శాఖలకు సంబంధించిన రూ.1,032 కోట్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పెండింగ్ బిల్లులపై చర్చ జరిగింది. వీటిని వెంటనే విడుదల చేయాలని భట్టి ఆదేశించడంతో ఆర్థిక శాఖ అధికారులు అప్పటికప్పుడు విడుదల చేశారు. అక్టోబరుకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లు, రూ.10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియర్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖలకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లు విడుదల చేశారు. ఇందులో రహదారులు-భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షలలోపు 3,610 బిల్లుల మొత్తం రూ.95 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లు ఉన్నాయి.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశాలు

- బతుకమ్మకుంట స్వరూపాన్ని మార్చినట్టు కోర్టు ధిక్కరణ కేసు

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట భూవివాదానికి సంబంధించిన ఓ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరుకావాలని పేర్కొంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఫారం-1 నోటీసు జారీచేసింది. బతుకమ్మకుంట భూమి స్వభావం మార్చరాదన్న కోర్టు ఆదేశాలను ఆయన ఉల్లంఘించారంటూ కేసు నమోదయింది. ఆ స్థలాన్ని ప్రైవేటు సంస్థల చేతికి ఇచ్చి అభివృద్ధి చేయించారని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పేర్కొంటూ ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్ రావుల ధర్మాసనం.. భూమి స్వభావంలో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు ఫొటోల ద్వారా స్పష్టంగా తెలుస్తోందని తెలిపింది. బతుకమ్మ కుంటను డిజైన్ చేసింది ప్రైవేటు ఏజెన్సీ విమోస్ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అని, నిర్మాణం చేపట్టింది ఎస్వీఆర్ ఇన్‌ఫ్రాటెక్ అని శిలాఫలకంలో ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీచేసింది. విచారణ నవంబరు 27కు వాయిదా పడింది.

న్యాయవాదులకు బీమా సౌకర్యం

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు బీమా పథకాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. 'ఏక కాల చెల్లింపు' కింద లబ్ధిదారు కొంత మొత్తం ప్రీమియంగా చెల్లించాలని సూచించింది. బార్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో చైర్మన్ ఏ నర్సింహారెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నవంబరు 1 నుంచి డిసెంబర్ 31లోగా తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ పేరిట డీడీతో పాటు దరఖాస్తులను కౌన్సిల్‌లో సమర్పించాలన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు లేదు: హైకోర్టు

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు బోధించే టీచర్లూ టెట్ రాయాల్సిందేనని హైకోర్టు పేర్కొంది. టెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ విభాగంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. నిబంధనల ప్రకారం స్పెషల్ టీచర్లకూ టెట్ వర్తిస్తుందని, మినహాయింపు ఏమీ లేదని తెలిపింది.



విద్యార్థుల ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలిస్తున్న రాచా అరిబర్గ్, జీవీ సెల్వం, ప్రిన్స్ జయకుమార్

సైబర్ నేరాలతో ప్రపంచానికి ముప్పు

- దీనిపై పోరాడేందుకు యువత సాంకేతికతను ప్రయోగించాలి
- సాంకేతికతతో యువకులు, వృద్ధుల మధ్య అంతరం
- 'టెక్నో వీఐటీ2025'లో థాయ్‌లాండ్ డిప్యూటీ కమిషనర్

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో భారత్, థాయ్‌లాండ్ తోపాటు ప్రపంచానికి ముప్పు నెలకొందని, దీనిపై పోరాడేందుకు యువత సాంకేతికతను ప్రయోగించాలని చెన్నైలోని థాయ్‌లాండ్ డిప్యూటీ కమిషనర్ రాచా అరిబర్గ్ పిలుపునిచ్చారు. 'వీఐటీ చెన్నై'లో 'టెక్నో వీఐటీ 2025' పేరుతో ఏర్పాటైన మూడు రోజుల ప్రపంచస్థాయి సాంకేతిక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా రాచా అరిబర్గ్ మాట్లాడుతూ.. అత్యధికులు సాంకేతిక జ్ఞానాన్ని మంచి ప్రయోజనాల కోసం వినియోగిస్తుండగా.. కొందరు మాత్రం దానిని చెడు ప్రయోజనాల కోసం ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ టెక్నాలజీ ద్వారా విభజన నెలకొందని, ఇది యువకులకు-వృద్ధులకు మధ్య అంతరాన్ని సృష్టిస్తోందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు యువత వృద్ధులతో కొంత సమయం గడపాలని, లేకుంటే వారు తమ దైనందిన జీవితంలో సాంకేతికతను ఉపయోగించడంలో వెనుకబడిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ.. యూఎస్‌లో కొత్త విధాన మార్పుల కారణంగా భారతీయ విద్యార్థులు అక్కడ చదువుకునే అవకాశాలు తగ్గాయని, ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థుల సంఖ్య 44 శాతం తగ్గిందన్నారు. కరోనా కాలంలో దిగుమతులపై ఆధారపడకుండా మన సొంత ఉత్పత్తులను సిద్ధం చేసుకోగలిగామని తెలిపారు. డిమాండ్ ఆవిష్కరణలకు భారత్ తల్లి లాంటిదని, భారతీయ విద్య పరిశోధన ఆధారితమైందన్నారు. టెక్నో విట్ వంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఒక గొప్ప అవకాశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన హెచ్‌సీఎల్ టెక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రిన్స్ జయకుమార్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల అభివృద్ధిలో ఎంతో వేగం ఉదని, గత 30 ఏళ్లలో భారత్ ఐటీ సేవల రంగంలో ప్రపంచానికి రాజధానిగా నిలిచిందన్నారు. టెక్నో వీఐటీ టెక్నాలజీ ఫెస్టివల్‌లో రోబో షో, డ్రోన్ షోతో సహా 150కి పైగా టెక్నాలజీ సంబంధిత కార్యక్రమాలు జరుగుతున్నాయి. విజేతలకు మొత్తం రూ.10 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నారు. భారత్ తోపాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, మలేసియా, ఉజ్బెకిస్తాన్, పోలాండ్ తదితర దేశాలకు చెందిన 10 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపే తక్షణ కర్తవ్యం

మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉందని, తనను మంత్రిగా చూసినందుకు తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషపడ్డారని అజారుద్దీన్ చెప్పారు. తన తక్షణ కర్తవ్యం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడమేనన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలపై అజారుద్దీన్ స్పందించారు. తన గురించి కిషన్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరైనవి కావని, ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదని చెప్పారు.

అజారుద్దీన్‌పై ఏం కేసులున్నాయో చెప్పండి

భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా అజారుద్దీన్ దేశానికి ఎన్నో విజయాలను అందించిన సంగతి మరిచారా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్.. కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి నిర్ణయం 3నెలల కిందటే తీసుకున్నామన్నారు. ప్రభుత్వ సలహాదారుగా సుదర్శన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రావులను ప్రభుత్వం నియమించడాన్ని మహేశ్‌కుమార్‌గౌడ్ స్వాగతించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్లో ఆమె చిత్రపటానికి మహేశ్‌కుమార్‌గౌడ్ నివాళి అర్పించారు.

ఎంఐఎంతో మ్యాచ్ ఫిక్సింగ్: బీజేపీ

ఎంఐఎంతో మ్యాచ్ ఫిక్సింగ్ వల్లే కాంగ్రెస్ నాయకుడు అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. క్రికెట్‌లోనే కాదు, రాజకీయాల్లో కూడా అజర్ మ్యాచ్ ఫిక్సరే అని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్



అజారుద్దీన్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే, ఒక వర్గం ఓట్ల కోసం మంత్రి పదవి ఇచ్చారన్నారు. ఒవైసీ చెబితేనే కాంగ్రెస్.. నవీన్‌యాదవ్‌కు టికెట్టు, అజర్‌కు మంత్రి పదవి ఇచ్చిందని ఆయన అన్నారు.

నిషేధిత భూముల జాబితా రెడీ

గ్రామాల వారీగా 22ఏ జాబితా సిద్ధం

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లోని నిషేధిత భూముల (22ఏ) జాబితా సిద్ధమైంది. జిల్లా కలెక్టర్లు ఆయా జిల్లాల పరిధిలో గ్రామాల వారీగా జాబితాలను సిద్ధం చేశారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ జాబితా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అందుబాటులోకి రానుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని మొత్తం 10,953 రెవెన్యూ గ్రామాలకుగాను 10,947 గ్రామాల నిషేధిత భూముల జాబితాను సిద్ధం చేశారు. ఇందులో 10,510 గ్రామాల జాబితాలను అప్‌లోడ్ కూడా చేశారు. కొన్ని జిల్లాల్లో అప్‌లోడ్ చేయకపోవడంపై రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్.. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే సాంకేతికపరమైన ఇబ్బందుల వల్లనే ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇచ్చిన ఫార్మాట్‌కు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయం ఇచ్చిన ఫార్మాట్‌కు తేడాలు ఉండటం వల్ల అప్‌లోడ్ చేయడం వీలు కాలేదని బదులిచ్చారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 100% జాబితాలను అప్‌లోడ్ చేయాలని కార్యదర్శి ఆదేశించారు. ఏదైనా గ్రామానికి సంబంధించిన 22ఏ జాబితాను ధ్రువీకరించి.. సంతకం చేయడంలో కలెక్టర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హెచ్చరించడం అధికారుల్లో చర్చనీయాంశమయింది.

96 శాతం అప్‌లోడ్ అయింది..

33 జిల్లాలకు సంబంధించి 10,510 రెవెన్యూ గ్రామాల (96%) 22ఏ జాబితా అప్‌లోడ్ చేశారు. ఇందులో 5 జిల్లాల్లో మాత్రమే 90% లోపు అప్‌లోడ్ చేశారు. రాజన్న సిరిసిల్లలో 171 గ్రామాలు ఉండగా.. 93 గ్రామాల వివరాలే అప్‌లోడ్ చేశారు. అక్కడ 54% అప్‌లోడ్ చేయగా, వరంగల్ జిల్లాలో 58% అయ్యాయి. ఈ జిల్లాలో 191 గ్రామాలకుగాను 110 గ్రామాల జాబితా అప్‌లోడ్ అయింది. జోగులాంబ గద్వాల జిల్లాలో 199 రెవెన్యూ గ్రామాలు ఉంటే 133 గ్రామాల జాబితాను (67%) అప్‌లోడ్ చేశారు. కాగా, వంద శాతం అప్‌లోడ్ చేసిన జిల్లాలు 16 ఉన్నాయి. అందులో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నారాయణపేట, మేడ్చల్ మల్కాజిగిరి, కుమరం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, నిర్మల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, పెద్దపల్లి ఉన్నాయి. కాగా, మరో ఏడు జిల్లాల్లో 99 శాతం జాబితాలను అప్‌లోడ్ చేశారు.

కక్ష సాధింపులకు ఆయుధంగా 22ఏ?

నిషేధిత భూముల జాబితా(22ఏ) రాజకీయ కక్ష సాధింపునకు ఒక ఆయుధంగా మారిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వారసత్వంగా వచ్చిన భూమిని రాజకీయ కక్షతో నిషేధిత జాబితాలో పెట్టారని, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇవ్వలేదనే కారణంతో నిషేధిత జాబితాలో ఉంచారని.. ఇలా రకరకాల ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై కోర్టుల్లో 5 వేలకుపైగా పిటిషన్లు దాఖలయ్యాయంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఒక్కసారి 22ఏ జాబితాలో చేరిస్తే.. దానిని తొలగించుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఏమిటీ 22ఏ జాబితా?

కేంద్ర ప్రభుత్వ రిజిస్ట్రేషన్ చట్టం-1908లో సెక్షన్ 22ఏ అనే నిబంధన ఉంది. దీని ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు జరగకుండా అడ్డుకోవడం. అక్రమంగా చేతులు మారడం, ఆక్రమణలకు పాల్పడటం, అనధికారిక భవనాలు నిర్మించడం, భూ మార్పిడి వంటి చర్యలకు అవకాశం లేకుండా ఈ సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలతో గెజిట్ ప్రకటన జారీ చేశాక.. ఆ భూములను సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేయకూడదు. ప్రభుత్వమే డీ నోటిఫై చేస్తే తప్ప.. రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు.

ఇందులో ఐదు కేటగిరీలు ఉన్నాయి. అవి..

- సెక్షన్ 22ఏ: అసైన్డ్ భూముల క్రయ,విక్రయాలను నిషేధిస్తూ తెచ్చిన 1977 చట్టం ప్రకారం సెక్షన్ 4(1) కింద గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొన్న భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదు. అమ్మడం, కొనడం నిషేధం.
- బీ: షెడ్యూల్ ప్రాంతాల్లో భూ బదలాయింపు నియంత్రణ చట్టం 1959 ప్రకారం నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొన్న భూముల క్రయ విక్రయాలు జరగకుండా చూడాలి
- సీ: పట్టణ ప్రాంతాల్లో (జీహెచ్‌ఎంసీ, మునిసిపాలిటీలు) ఉన్న అనధికారిక లేఅవుట్లు, అనుమతులు పొందని భూముల విక్రయాలను నియంత్రించడం
- డీ: నీటి వనరుల పరిధిలో ఉండే భూములు.. అంటే చెరువులు, కుంటలు, వాగులు, బావులు, జలాశయాలు, నాలాలు, నదులు వంటి వాటికి 10 మీటర్ల పరిధిలో ఉన్న భూములు క్రయవిక్రయాలు జరగకుండా నిషేధించడం.
- ఇ: భూ సేకరణ చట్టం కింద సేకరించిన భూములు. గెజిట్‌లో నోటిఫై చేయని భూములు దీనికి వర్తించవు.



మార్చురీ వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

మార్చురీకి బతికున్న వ్యక్తి తరలింపు కారకులపై డీఎంఈ చర్యలు

- మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి రాజ నర్సింహ సీరియస్
- ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ కమిటీ ఏర్పాటు
- డీఎంఈకి నివేదిక సమర్పించిన విచారణ కమిటీ

హైదరాబాద్/ నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బతికున్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనకు కారకులైన వారిపై వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) చర్యలు తీసుకుంటారని ముగ్గురు ప్రొఫెసర్ల కమిటీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపింది. మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ బోధనాస్పత్రిలో జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ సీరియస్ అయ్యారు. మంత్రి ఆదేశం మేరకు వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ నియమించిన కమిటీలో సభ్యులు డాక్టర్ వీ చంద్రశేఖర్ (ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్), డాక్టర్ గోపాలరావు (జనగామ జిల్లా ప్రభుత్వ బోధనాస్పత్రి శస్త్రచికిత్సల విభాగం అధిపతి), డాక్టర్ ఆర్.శ్రీధరాచారి (సిద్దిపేట జిల్లా ప్రభుత్వ బోధనాస్పత్రి ఫోరెన్సిక్ విభాగం అధిపతి).. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్న ప్రొఫెసర్లు.. ఆస్పత్రిలో సీసీటీవీ కెమెరాలు పని చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వ్యక్తి బతికుండగానే నిర్ధారించకుండా ఎలా మార్చురీకి తరలించారని ఆస్పత్రి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదిక తయారు చేసిన విచారణ కమిటీ సభ్యులు.. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు డీఎంఈకి నివేదికను సమర్పించారు.

ఎనిమిది వారాల సమయం ఇవ్వండి

- నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి
- చివరి దశకు మరో నలుగురి విచారణ
- ఇద్దరు ఎమ్మెల్యేల ప్రక్రియ ప్రారంభమైంది
- స్పీకర్ల కాన్ఫరెన్స్, విదేశీ పర్యటనలతో ఆలస్యమైంది
- ఫిరాయింపు కేసుల విచారణకు మరింత గడువు కోరిన స్పీకర్ కార్యాలయం

న్యూఢిల్లీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో శాసన సభ్యుల పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై విచారణ జరిపేందుకు మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని సుప్రీం కోర్టును స్పీకర్ కార్యాలయం కోరింది. గతంలో విధించిన మూడు నెలల గడువు శుక్రవారంతో ముగియడంతో మరింత సమయం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయిందని, నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపింది. మరో నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన విచారణ చివరి దశకు చేరిందని, ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ ప్రారంభమైందని వివరించింది. రాజ్యాంగపరమైన స్పీకర్ అధికారాలు, రోజువారీ కార్యక్రమాలు, స్పీకర్ల అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు తదితరాలతో స్పీకర్ బిజీగా ఉన్నారని, దాంతో, గడువులోగా విచారించడం సాధ్యం కాలేదని తెలిపింది. శాసన సభ్యులు సైతం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వరద సహాయక చర్యల కారణంగా నియోజకవర్గాల్లోనే ఉండాల్సి వస్తోందని పేర్కొంది. ఎమ్మెల్యేలను నేరుగా విచారించాల్సి ఉందని, స్పీకర్, శాసనసభ్యుల షెడ్యూల్ కార్యక్రమాల కారణంగా సమయం సరిపోలేదని పేర్కొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, ఆరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ కూడా సుప్రీంలో రిట్ పిటిషన్ (సివిల్) దాఖలు చేశారు. వాదనలు జరుగుతుండగా బీజేపీ ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్ రెడ్డి కూడా స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) దాఖలు చేశారు. వీటన్నిటినీ కలిపి విచారించిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న కీలక ఆదేశాలు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని, ఆలస్యం చేసేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలోనే మరికొంత సమయం కావాలంటూ సుప్రీంకోర్టుకు స్పీకర్ కార్యాలయం విన్నవించింది.

నాగారం భూముల వివాదం..
ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పేర్కొంది. ఆయా సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది. అయితే, భూదాన్ భూములు ఉన్నాయని పేర్కొంటున్న సర్వే నెంబర్లు 181, 182పై మాత్రం సింగిల్ జడ్జి ఆదేశాలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో ఇప్పటివరకు నిషేధిత జాబితాలో ఉన్న తమ భూముల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లు నిర్మాణాలు కొనసాగించడంతో పాటు క్రయవిక్రయాలు చేపట్టే అవకాశం ఏర్పడింది. భూదాన్ లేదా ప్రభుత్వ భూములుగా పేర్కొంటున్న నాగారంలోని ఆయా సర్వే నెంబర్లలోని భూముల రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని, సదరు భూములను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి బినామీల పేరిట రిజిస్ట్రేషన్లు చేశారని, ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేట్‌కు చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై 2025 ఏప్రిల్ 4న విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. సదరు వివాదాస్పద భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని, భూమి స్వభావం మార్చరాదని, ఎలాంటి లావాదేవీలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలపై ఐఏఎస్, ఐపీఎస్‌లు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం వద్ద అప్పీలు చేశారు. ఈ అప్పీలుపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని విచారణ ముగించింది. ఈ నేపథ్యంలో సదరు భూములను నిషేధిత జాబితాలో పెట్టాలన్న ఉత్తర్వులను ఎత్తేయాలని కోరుతూ పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వెకేట్ స్టే అప్లికేషన్లు దాఖలు చేశారు. ఈ అప్లికేషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్.. కేసులో ప్రతివాదులుగా ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారు దాఖలు చేసిన వెకేట్ స్టే పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు ఈ నెల 17న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుపై ఐఏఎస్, ఐపీఎస్‌లు రవి గుప్తా, తరుణ్ జోషీ, రేణూ గోయల్, బత్తుల హేమలత (బీ శివధర్ రెడ్డి), బుసిరెడ్డి రాహుల్, జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్), ఏకే మహంతి, ఆర్ అభిషేక్ తదితరులు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం ఈ పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. భూదాన్ భూములు సర్వే నెంబర్ 181, 182లో ఉన్నాయని, సర్వే నెంబర్లు 194, 195కు వివాదంతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అవి పట్టా భూములే అని పేర్కొన్న విషయాన్ని సింగిల్ జడ్జి పట్టించుకోలేదని తెలిపారు. పిటిషనర్ బిర్ల మల్లేశ్ కూడా తొలుత 194, 195 భూదాన్ భూములని పేర్కొని, తర్వాత గైరాన్ సర్కార్ (ప్రభుత్వ) భూమి అని వైఖరి మార్చుకున్నారని గుర్తు చేశారు. అక్కడ భూములు కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లపై ప్రతిరోజూ పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, భూకుంభకోణంలో అధికారులు ఉన్నట్లు, తమ అధికారాన్ని ఉపయోగించి భూములు స్వాధీనం చేసుకున్నట్లు తప్పుడు సందేశం వెళ్తోందని పేర్కొన్నారు. అవి న్యాయబద్ధంగా కొనుగోలు చేసిన భూములని తెలిపారు. అధికారుల తరఫున మరో సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదిస్తూ.. రిట్ పిటిషనర్ బిర్ల మల్లేశ్ భూమి నాగారం సర్వే నెంబర్లు 194, 195లో లేదని.. అతని భూమి నాగిరెడ్డిపల్లిలో ఉన్నదని పేర్కొన్నారు.

సర్వే నెంబర్లు 194, 195లోని భూములతో బిర్ల మల్లేశ్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారుల భూములు ఉన్న సర్వే నెంబర్లు 194, 195లను నిషేధిత జాబితాలో నుంచి ఎత్తేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆ సర్వే నెంబర్ల వరకు సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టేసింది. మిగితా సర్వే నెంబర్లపై నిషేధం యథావిధిగా ఉంటుందని పేర్కొంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన రిట్ అప్పీళ్ల విచారణను ముగించింది.

సీనియర్ ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు, బదిలీలు

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు యూనిట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్

- ప్రధాన కార్యదర్శిగా సైదులుకు అదనపు బాధ్యతలు
- అనితా రామచంద్రన్‌కు గిరిజనశాఖ కమిషనర్‌గా బాధ్యతలు
- పశు సంవర్ధక కార్యదర్శిగా ఇళంబర్తి
- రిజ్వీ స్థానంలో జీఏడీ కార్యదర్శిగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్

హైదరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. కొందరిని బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు యూనిట్' ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి(1994 బ్యాచ్) సవ్యసాచి ఘోష్‌ను నియమించింది. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన్ను బదిలీచేసింది. ఇది వరకు ఘోష్‌ను అన్ని సంక్షేమ శాఖల పర్యవేక్షణకు 'సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి'గా నియమించిన సంగతి తెలిసిందే. ఆ బాధ్యతల్లోనూ కొనసాగాలని ఆయనను ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో ఆదేశించింది. సవ్యసాచి ఘోష్‌తో పాటు మహాత్మగాంధీ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులును 'అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు యూనిట్'కు ప్రత్యేక కార్యదర్శిగా నియమిస్తూ అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇక, మహిళా శిశు సంక్షేమం, ఎస్సీ సంక్షేమ శాఖల కార్యదర్శిగా ఉన్న అనితా రామచంద్రన్‌కు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా, కమిషనర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. మెట్రోపాలిటన్ ప్రాంత, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇళంబర్తిని బదిలీ చేసి, రవాణా శాఖ కమిషనర్‌గా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి రఘునందన్‌రావును రిలీవ్ చేసింది. అంతేకాకుండా ఇళంబర్తికి పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు అదనపు బాధ్యతలను అప్పగించింది. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం జీఏడీ కార్యదర్శిగా ఉన్న ఎస్ఏఎం రిజ్వీ అక్టోబర్ 31 నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్)పై వెళుతున్నందున... శ్రీధర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఉద్యానవన సంచాలకుడు ఎస్‌కే యాస్మీన్ బాషాకు టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించగా.. ఆదిలాబాద్ జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డిని బదిలీ చేసి ఎస్సీ అభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్‌గా నియమించారు. టీజీ షెడ్యూల్డు కులాల సహకార అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా జితేందర్‌రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.